ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com
WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్
fb.com/vaartha

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

6-2-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 5
పేజీలు: 10+4 వెల: 6.50

## ముస్లింల ఆధ్యాత్మిక గురువు ఆగాఖాన్ కన్నుమూత

## గాజాను స్వాధీనం చేసుకుంటాం: ట్రంప్

5



బుధవారం హైదరాబాద్‌లో క్రికెటర్ త్రిషకు మెమొంటోను అందజేస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో మంత్రి పొంగులేటి తదితరులు

### టాప్ మహిళా క్రికెటర్ త్రిషకు

# కోటి నజరానా

### మరింతగా రాణించాలని ఆకాంక్షించిన సిఎం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి5:** మహిళల అండర్-19 ప్రపంచ కప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా నిలిచి టీమ్ ఇండియా విజయంలో కీలక పాత్ర పోషించి తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన యువ క్రికెటర్ గొంగడి త్రిషను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి గొంగడి త్రిష >>2

# స్థానిక పోరుకు సర్కార్ రెడీ

### పార్టీ ఎమ్మెల్యేలతో నేడు సిఎం రేవంత్ భేటీ

### రెండు వారాల్లో నోటిఫికేషన్ వచ్చే అవకాశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి5:** తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతోంది. రెండు వారాల్లో నోటిఫికేషన్ వస్తుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో అధికార పార్టీ వేగంగా అడుగులు వేస్తోంది. గురువారం ఎమ్మెల్యేలతో సమావేశం కావాలని పార్టీ నిర్ణయించింది. ఈ సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి, పార్టీ ఇన్ ఛార్జ్ దీపాదాస్ మున్షీ కూడా హాజరుకానున్నారు. ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మర్రి చెన్నారెడ్డి ఇన్‌స్టిట్యూట్‌లో గురువారం సమావేశం కానున్నారు. :కులగణన,ఎస్సీ వర్గకరణ అంశాలతో పాటు ప్రభుత్వం పథకాల అమలు, ఇతర సమస్యలపై చర్చించేందుకు సీఎం రేవంత్ రెడ్డి గురువారం మధ్యాహ్నం 3గంటల నుంచి రాత్రి 7గంటలకు వరకు ఎమ్మెల్యేలతో ముఖాముఖీ కార్యక్రమం నిర్వహించనున్నారు. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఈ సమావేశం కొనసాగనుంది.ఈ సమావేశంలో ఏఐసీసీ ఇంచార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు పాల్గొననున్నారు.. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ సంస్థాగత నిర్మాణం సహా తదితర అంశాలపై చర్చించనున్నారు. ఇదే సమయంలో ఇటీవల కొందరు ఎమ్మెల్యేలు నిర్వహించిన సమావేశంపై కూడా ఆయాఎమ్మెల్యేల నుంచి ఏఐసీసీ ఇంచార్జి దీపాదాస్‌మున్షీ వివరాలు సేకరించనున్నారు. మొత్తంగా >>2



ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాలు చేస్తున్న ప్రధాని మోడీ

## 'మహాకుంభ్'లో ప్రధాని మోడీ

### త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానం ఆచరించిన ప్రధాని

**ప్రయాగరాజ్, ఫిబ్రవరి 5:** ప్రపంచంలోని అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం మహాకుంభ్‌మేళాలో ప్రధాని నరేంద్రమోడీ పాల్గొన్నారు. బుధవారం ఆయన పవిత్ర త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానం ఆచరించారు. ఆ తర్వాత >>2

# బిజెపికే ఢిల్లీ పీఠం!

### ఆప్‌కు రెండో స్థానం ఇచ్చిన ఎగ్జిట్ పోల్స్

### ఒకటి, రెండు సీట్లకే కాంగ్రెస్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:** దేశరాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నిల పోలింగ్ ముగిసిన వెంటనే వెల్లడవుతున్న ముందస్తు సర్వేలు బిజెపికే మొగ్గుచూపిస్తున్నాయి. అత్యధిక సర్వేసంస్థలన్నీ కూడా బిజెపి ప్రస్తుత >>2



2

## పోలింగ్ 57.7 శాతం

| సంస్థ | ఆప్ | బిజెపి | కాంగ్రెస్ | ఇతరులు |
|---|---|---|---|---|
| చాణక్య స్ట్రాటజీస్ | 25-28 | 39-44 | 2-3 | 0 |
| జెవిసి | 22-31 | 39-40 | 0-2 | 0 |
| మాట్రిజ్ | 32-37 | 35-40 | 0-1 | 0 |
| పుయ్ ప్రిసైడ్ | 46-52 | 18-23 | 0-1 | 0 |



### హెచ్1బి వీసా రెన్యువల్

# రద్దు

### -ట్రంప్ సర్కార్ నిర్ణయం

**వాషింగ్టన్, ఫిబ్రవరి 5:** అమెరికాలో ఉద్యోగాలు చేసే విదేశాయులకు ట్రంప్ ఒక్కసారిగా షాక్ ఇచ్చారు. హెచ్‌వన్‌బీ, ఎల్‌వన్ వీసాలను ఆటోరెన్యువల్‌చేసుకోవడానికి ఉన్న అవకాశాన్ని రద్దుచేయాలని ఇద్దరు రిపబ్లికన్ అమెరికన్ సెనేటర్లు తీర్మానం ప్రవేవపెట్టారు. వర్క్ వీసాలను ఆటోరెన్యువల్ అనేది ఇమిగ్రేషన్ అమలుకు అత్యంతప్రమాదకరమని వారన్నారు. హెచ్‌వన్‌బీ, ఎల్‌వన్ వీసాల గడువును పొడిగింపును పెంచుతూ బైడెన్ సర్కారు నిర్ణయించింది. గతంలో ఇది కేవలం 180 రోజులుంటే గత సర్కారు 540 రోజులకుపెంచింది. ఈక్రమంలో ట్రంప్ కఠిన వలసల నియంత్రణ, కఠిన వీసా నిబంధనలకు ఇది అడ్డంకిగా మారుతుందని సెనేటర్లు వాదిస్తున్నారు. >>2

## పాఠశాల భవనంపై నుంచి దూకి టెన్త్ విద్యార్థి ఆత్మహత్య

### ప్రిన్సిపల్ తిట్టాడని మనస్తాపంతో బలవన్మరణం

7

## సామాజిక న్యాయానికి

# కట్టుబడి ఉన్నాం

### కుల గణన ఫుల్ బాడీ చెకప్, ఎక్సరే లాంటిది

### దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తోంది: డి.సిఎం భట్టి

**హైదరాబాద్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:** సామాజిక న్యాయం అమలుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కులగణన చాలా పారదర్శకంగా, శాస్త్రీయంగా జరిగిందని వివరించారు. కులగణన సర్వే విజయవంతంగా పూర్తి చేసి అసెంబ్లీలో ప్రవేశపెట్టడంతో దేశం మొత్తం తెలంగాణ వైపు చూస్తున్నదన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కుల గణన సర్వే సమాచారాన్ని ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలకు, సామాజిక పరంగా తీసుకునే నిర్ణయాలకు తప్పనిసరిగా వాడుకుంటామని చెప్పారు. ఈ సర్వే రాష్ట్రంలోని ప్రజల వివిధ రకాల స్థితిగతులపై ఫుల్ బాడీచెకప్, ఒక ఎక్స రే లాంటిదన్నారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో ఉందని సర్వే స్పష్టం చేస్తుందన్నారు. గత కులగణన సర్వేలో పాల్గొనని వారు ఆసక్తి కనబరిచి సమాచారం ఇస్తే ఇప్పుడు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని వెల్లడించారు. కులగణన సర్వే దశాబ్దాలుగా ప్రజలు ఎదురుచూస్తున్న సమస్యల పరిష్కార మార్గం చూపించే ప్రక్రియగా ఉపయోగపడుతుందన్నారు. సర్వే విషయమై తప్పుడు ప్రచారం చేసి సర్వేలో పాల్గొనద్దని కొందరు పిలుపు ఇచ్చినప్పటికీ, ప్రభుత్వ ఆలోచనను అర్థం చేసుకొని సర్వే విజయవంతం కావడానికి ప్రజలు సహకరించారన్నారు. కొన్ని దశాబ్దాలుగా కొన్ని వర్గాల ప్రజలు ఎదురు చూస్తున్న కుల గణన సర్వే పూర్తి చేసి చట్టసభలో ప్రవేశపెట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చడానికి కుల గణన సర్వేపై సుదీర్ఘంగా కసరత్తు చేశామని వివరించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కోసం క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని, తదుపరి దానిపై అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేశామన్నారు. సర్వే పర్యవేక్షణకు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన >>2





బుధవారం కులగణన పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ అనంతరం మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్. చిత్రంలో స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి చైర్మన్ గుత్తా తదితరులు

# పబ్లిక్ డొమైన్‌లో కులగణన

### -మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

### అసెంబ్లీలోని కమిటీ హాల్‌లో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్

### హాజరైన స్పీకర్ ప్రసాద్, చైర్మన్ సుఖేందర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి5:** కులగణన సర్వేకు సంబంధించి వ్యక్తిగత వివరాలు మినహాయించి గురు, శుక్రవారాల్లోగా పబ్లిక్ డొమైన్‌లో కులాల వారిగా, ఉప కులాల వివరాలను జిల్లాల వారిగా పెడతామని కులగణన కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్, మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. సర్వేపై అపోహలు, అనుమానాలు ఉన్న కుల సంఘాల నేతలను పిలిచి వారితో చర్చించి అపోహలను నివృత్తి చేస్తామన్నారు. బుధవారం అసెంబ్లీ కమిటీ హాలులో బీసీ కులగణనపై ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు ఉత్తమ్ పవర్ పాయింట్ ఆధ్వర్యంలో ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, రాష్ట్ర నోడల్ అధికారి,హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి సర్వేపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో గతంతో పోలిస్తే బీసీ జనాభా పెరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వే పూర్తిగా శాస్త్రీయ బద్ధమైందని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం తర్వాత అత్యంత పకడ్బందీగా పూర్తి పారదర్శకంగా నిర్వహించిన సర్వే ఇది ఆయన తేల్చి చెప్పారు. కుల గణన సర్వే నివేదిక లెక్కల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల రూపకల్పన చేస్తుందని స్పష్టం చేశారు. గత గణాంకాలతో పోలిస్తే బీసీ జనాభా శాతం పెరిగిందని, బిఆర్ఎస్ పాలనలో 51.09 శాతంగా నమోదైన బీసీ జనాభా శాతం ఇప్పుడు 56.33శాతంకు పెరిగిందన్నారు. షెడ్యూల్ ట్రైబ్స్ జనాభా 9.8శాతం నుంచి 10.45 శాతంకు పెరిగిందని ,ఇతర కులాల(ఓసీ) జనాభా 21.55శాతం నుంచి 15.79శాతంకు తగ్గిందని వివరించారు. 2011 జనాభా లెక్కల తర్వాత క్షేత్ర స్థాయిలో నిర్వహించిన కులగణన ఇదని, విపక్షాలు తప్పుడు గణాంకాలతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. కులగణన సర్వే మీద కొందరు అపోహలు.. అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు కుల గణన సర్వే ఎలా జరిగింది అనేది ప్లానింగ్ డిపార్ట్ మెంట్ వివరిస్తుందన్నారు. స్వాతంత్రం తర్వాత ఇంత శాస్త్రీయంగా, లాజికల్‌గా దేశంలోని ఏ రాష్ట్రంలో కులగణన జరగలేదని ఉత్తమ్ తెలిపారు. కమ్యూనికేషన్ గ్యాప్ ఉండవద్దని ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు కులగణనపై కేబినెట్ సబ్ కమిటీ వివరణ ఇవ్వాలని నిర్ణయించి, పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేస్తున్నామన్నారు. అన్ని కులాలకు సంబంధించిన సామాజిక ఆర్థిక సర్వే జరిగిందని, సర్వేపై ప్రజలు ఎవరికి ఇందులో అపోహలు అవసరం లేదని ఉత్తమ్ స్పష్టం చేశారు. సర్వే ఆధారంగా పాలనలో కొత్త మార్పులు వస్తాయని, డేటా ఆధారిత పరిపాలనకు మార్గదర్శిగా నిలుస్తుందని పేర్కొన్నారు. మొదట సమగ్ర కుటుంబ సర్వేతో పోల్చుకున్నారని. అది పబ్లిక్ డొమైన్‌లో లేని డాక్యుమెంట్ అని స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణ కూడా 2011 జనాభా లెక్కల ఆధారంగా చేసుకొని చేసిందేనన్నారు. కులగణన సర్వే విషయంలో ఎవరు మాకు సవాలు చేయలేరని, ఇవే నిజమైన గణాంకాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ >>2

## టెట్‌లో ఉత్తీర్ణత

# 31.21%

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఫిబ్రవరి4:** తెలంగాణ టెట్ ఫలితాలను విద్యాశాఖకార్యదర్శి యోగితరాణా బుధవారం విడుదల చేశారు. తొలుత టెట్ ఫలితాలను విడుదల చేసేందుకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అడ్డొస్తుందని భావించినప్పటికీ.. ఇప్పటికే ఎగ్జామ్ పూర్తయినందున ఎలాంటి అడ్డంకులు లేవని భావించిన విద్యాశాఖ బుధవారం సాయంత్రం ఫలితాలు విడుదల చేసింది. జనవరి 2 నుంచి 20 వరకు 20 సెషన్స్‌లో జరిగిన టెట్ పరీక్షల్లో 1,35,82 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 42,384 మంది అభ్యర్థులు క్వాలిఫై అయ్యారు. టెట్ ఫలితాల్లో 31.21 శాతం ఉత్తీర్ణత నమోదు అయినట్లు ఫలితాల ప్రకటనలో వెల్లడించారు. పేపర్ 1 లో 69, 476 మంది పరీక్ష రాస్తే 41 ,327 మంది అభ్యర్థులు క్వాలిఫై అయ్యారు. పేపర్ 2 లో మ్యాథ్స్ అండ్ సైన్స్ లో 69,390 మంది పరీక్ష రాస్తే 23,755 మంది ఉత్తీర్ణత సాధించారు. సోషల్ స్టడీస్ పేపర్‌లో 66,412 మంది పరీక్ష రాస్తే 18,629 మంది ఉత్తీర్ణత సాధించారు. పేపర్ 1 అండ్ 2 లో కలిపి 1,35,802 మంది పరీక్షలు రాస్తే 42,384 మంది ఉత్తీర్ణత సాధించారు. టెట్ ఫలితాలను స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్ లోను అందుబాటులో ఉంచారు.

# పాలమూరు దాహం తీర్చండి




బుధవారం బెంగళూరులో కర్ణాటక డి.సిఎం డికెకు వినతి పత్రం అందజేస్తున్న మంత్రులు జూపల్లి, శ్రీధర్‌బాబు తదితరులు

### జూరాలకు నీరు విడుదల చేయండి

### కర్ణాటక సిఎం సిద్ధరామయ్య, డి.సిఎం డికెను కోరిన మంత్రులు జూపల్లి, శ్రీధర్ బాబు


### 4 టిఎంసిల నీటి విడుదలకు డికె హామీ

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:** కర్నాటకలోని నారాయణపూర్ డ్యాం నుంచి 5 టీఎంసీల నీటిని విడుదల చేసి ఉమ్మడి పాలమూరు జిల్లా సాగు, తాగునీటి అవసరాలు తీర్చాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దారామయ్యను పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. సీయం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, వాకిటి శ్రీహరి, గవినోళ్ల మధుసూదన్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్..మంగళవారం బెంగళూర్‌లో సీయం సిద్దారామయ్యను కలిసి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం నీటి పారుదల శాఖ మంత్రి డీకే శివకుమార్‌ను కలిసి.. నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయాలని కోరారు. ఉమ్మడి పాలమూరు జిల్లా వరప్రదాయని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వేగంగా అడుగంటుతోందని, రోజు రోజుకూ నీటి నిల్వలు తగ్గిపోయి నీటిమట్టం పడిపోతోందని వారికి వివరించారు. ఉమ్మడి పాలమూరు జిల్లా రైతులు, ప్రజలకు సాగు,తాగునీరు అందించే జూరాల ప్రాజెక్టులో నీటిమట్టం నిరాశాజనకంగా ఉందని,ప్రస్తుత పరిస్థితుల్లో, ఈ ప్రాంతం తీవ్రంగా సాగు, తాగునీటి కొరతను ఎదుర్కొంటోందని, దీంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో ఫిబ్రవరి 4, 2025 నాటికి నీటి నిల్వ తీవ్రంగా తగ్గిపోయి కేవలం 1.7 టీఎంసీకి చేరిందని, పరిస్థితి ఇలాగే సాగితే నీటిమట్టం డెడ్ స్టోరేజీకి పడిపోతుందనే ఆందోళన వ్యక్తంచేశారు.దీనివల్ల తాగునీటిసరఫరా, పంటలకు అవసరమైన సాగునీటి అవసరాలపై తీవ్రమైన ఒత్తిడి ఏర్పడిందని, పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొని ఉందని, లక్షలాది మంది రైతుల జీవనోపాధిపై ప్రభావం పడుతుందని నీటి సంక్షోభంపై వారికి వివరించారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు వరప్రదాయిని అని,జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, భీమా ప్రాజెక్ట్ వంటి ప్రధాన ప్రాజెక్టులకు నీటిని అందిస్తూ సాగు, తాగునీటి అవసరాలను తీరుస్తుందని తెలిపారు. ఈ మూడు ప్రాజెక్టుల ద్వారా సుమారు 2.5 లక్షల ఎకరాల వ్యవసాయ >>2



2

## అక్రమవలసదారులతో అమృత్‌సర్ చేరిన అమెరికా విమానం



### హైకోర్టులో ముగ్గురు అదనపు జడ్జిలకు

## శాశ్వత జడ్జిలుగా పదోన్నతి

### ఆమోదించిన సుప్రీం కొలీజియం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఫిబ్రవరి5:** తెలంగాణ హైకోర్టులో ముగ్గురు అదనపు జడ్జీలను శాశ్వత జడ్జీలు(న్యాయమూర్తులు)గా నియామకం చేసేందుకు సుప్రీంకోర్టు కొలీజియం ఆమోదించింది. ఈ జాబితాలో జస్టిస్ లక్ష్మీ నారాయణ అలిశెట్టి,జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి, జస్టిస్ సుజానా కళాసికం ఉన్నారు. జస్టిస్ లక్ష్మీనారాయణ నిజామాబాద్ జిల్లాకు చెందిన హైకోర్టు న్యాయమూర్తి, వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయంలో లా డిగ్రీ చదివి, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో >>2

## స్థానిక ఎన్నికల్లో ఒంటరి పోటీ

### వామపక్షాలున్నచోట పరస్పర సహకారం

### మీడియాతో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 5,ప్రభాతవార్త:** తెలంగాణలో వామపక్ష ప్రత్యామ్నాయ వేదిక ఏర్పాటుకు కృషి చేస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రకటించారు. రాష్ట్రంలో ప్రజా ఉద్యమాలతో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతామని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో ఒంటరిగానే పోటీచేస్తామనీ, అయితే, వామపక్ష పార్టీలు బలంగా ఉన్న చోట పరస్పర సహకారంతో ముందుకెళ్తామని నొక్కి చెప్పారు. ప్రజల్లో రాజకీయ చైతన్యం తీసుకొస్తామనీ, ధన, మద్య ప్రలోభాల రాజకీయాలను >>2







ఢిల్లీలో బుధవారం ఓటువేసిన అనంతరం సిరా గుర్తును చూపుతున్న రాష్ట్రపతి ముర్ము, కుటుబ సభ్యులతో ఢిల్లీ మాజీ సిఎం కేజ్రీవాల్, ప్రియాంక గాంధీ, కేంద్రమంత్రి హర్‌దీప్‌సింగ్ పూరి తదితరులు

# ఢిల్లీలో పోలింగ్ 57.7%
## కేజ్రీవాల్ నియోజకవర్గంలో 54 శాతం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బుధవారం జరిగిన పోలింగ్ ముగిసేనాటికి 57.7శాతం మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నట్లు తేలింది. 2020లో ఇదే సమయానికి 54.2శాతం ఓట్లు పోలయ్యాయి. ఐదేళ్లనాటికంటే ఓటరు నమోదు పెరగడం, ఓటర్లలోచైతన్యం వచ్చిందనే పెరిగిన ఓటింగ్‌శాతం చెపుతోంది. మొత్తం 699 మంది అభ్యర్థులు పోటీచేస్తున్న ఢిల్లీ అసెంబ్లీలోని 70స్థానాలకు ఒకే విడతగా పోలింగ్ జరిగింది కేజ్రీవాల్‌పోటీచేస్తున్న న్యూఢిల్లీ స్థానంలో సాయంత్రం ఐదు గంటల సమయానికి 54.27శాతం పోలింగ్‌నమోదయింది. ముఖ్యమంత్రి అతిశిమొర్లేనే పోటీచేస్తున్న కల్కాజీ స్థానంలో 51.81శాతం,మాజీ డిప్యూటి సీఎం మనీశ్‌సిసోడియా పోటీచేస్తున్న జంగ్‌పుర స్థానంలో 55.23శాతం పోలింగ్ జరిగింది. ఆరోగ్యమంత్రి సౌరభ్‌భరద్వాజ్‌పోటీచేస్తున్న గ్రేటర్ కైలాష్ స్థానంలో 52శాతం పోలింగ్‌జరిగినట్లు తేలింది. ఢిల్లీ మొత్తంగా 1.5 కోట్లమంది ఓటర్లు పోలింగ్‌కు వస్తారని ఆశించినా 57.7శాతం మాత్రమే నమోదయింది. ఎగ్జిట్‌పోల్స్ అన్నీ బిజెపికే అవకాశం అన్న సర్వేలను వెల్లడించడంతో ఆప్‌కు ఈసారి హ్యాట్రిక్‌సాధించడం కష్టమేనన్న వాదన వస్తోంది. అలాగే ఢిల్లీలోచక్రం తిప్పిన ఆనాటి షీలాదీక్షిత్‌ప్రభుత్వమే మళ్లీరావాలంటూ ప్రచారంచేసిన కాంగ్రెస్‌కు ఒకటిరెండుమినహా స్థానాల్లో గెలుపు అవకాశాలు లేవని సర్వేలు చెపుతున్నాయి.

# ‘మహాకుంభ్’లో ప్రధాని మోడీ

>> గంగానదికి హారతి ఇచ్చి పూజలునిర్వహించారు. ప్రయాగరాజ్ విమానాశ్రయంలో దిగినప్రధాని మోడీ అక్కడినుంచి అరైల్‌ఘాట్‌కువెళ్లారు. ఘాట్‌నుంచి బోటులోప్రయాణించి మహాకుంభమేళా జరుగుతున్న ప్రాంతానికి చేరుకున్నారు. అనంతరం త్రివేణి సంగంలోప్రధానిపుణ్యస్నానం ఆచరించారు. అంతకుముందు అక్కడి బోటులోప్రయాణించారు. స్నానాలు ఆచరించేందుకు వచ్చిన భక్తులకు పడవనుంచే అభివాదంచేస్తూ ముందుకు సాగారు. ఆయన వెంట యుపి సీఎం యోగి ఆదిత్యనాథ్‌కూడా ఉన్నారు. 144 ఏళ్లకోసారి వచ్చే ఈ మహాకుంభమేళా జనవరి 13న ప్రారంభం కాగా భారత్‌తోపాటు విదేశాలనుంచి భారీ సంఖ్యలో భక్తులువచ్చి త్రివేణి సంగమంలో స్నానమాచరిస్తున్నారు. ఈనెల 26వ తరకూ ఈ వేడుక జరుగుతుంది.

బుధవారం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్‌రిజిజు కూడా పుణ్యస్నానమాచరించారు. మొత్తం ఇప్పటివరకూ 38 కోట్లమంది పుణ్యస్నానాలుచేసారని యుపి సమాచార శాఖప్రకటించింది. ఈచరిత్రాత్మక సమయంలో రాజకీయాలు చేయవద్దని చెప్పారు.

భారీ సంఖ్యలో ప్రజలు తరలివస్తున్న తరుణంలో ప్రతి ఒక్కరూ మార్గదర్శకాలను పాటించాలన్నారు. మహాకుంభమేళాప్రారంభానికిముందు ప్రధానిమోడీప్రయాగరాజ్‌కువెళ్లారు. రూ.5500 కోట్లతో అభివృద్ధి ప్రాజెక్టులు, ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలుచేసారు.

## లక్ష డప్పులు -వెయ్యిగొంతుల కార్యక్రమం వాయిదా
### ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

**హైదరాబాద్, ఫిబ్రవరి 5,ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రతిపాదించిన ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ల వాటాల్లో మాదిగలకు అన్యాయం జరిగిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. వర్గీకరణలో తమకు రావాల్సి న వాటా కంటే 2 శాతం తక్కువ రిజర్వేషన్లు వచ్చాయని ఆరోపించారు. ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి రిజర్వేషన్ల పంపిణీలోని లోపాలను సరిదిద్ది ముందుకు వెళ్లాలని సూచించారు. ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర అసెంబ్లీ ఆమోదం తెలిపిన నేపథ్యంలో బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మందకృష్ణ మాదిగ మాట్లాడారు. మాదిగల జనాభాకు తగినట్లుగానే రిజర్వేషన్ల వాటా ఉండాలని ఏ ప్రాతిపదిక తీసుకున్నా మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు రావాలని కానీ ప్రభుత్వం ప్రతిపాదించిన దాంట్లో తమకు 9 శాతమే దక్కుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 7వ తేదీన ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లో నిర్వహించ తలపెట్టిన లక్ష డప్పులు, వెయ్యి గొంతులుఖి కార్యక్రమం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఆ కార్యక్రమం స్థానంలో 15 రోజుల తర్వాత సాంస్క ృతిక మహోత్సవంగా నిర్వహిస్తామని మందకృష్ణపేర్కొన్నారు.

# ఎపిలో మద్యం అక్రమాలపై ‘సిట్’

**విజయవాడ.ఫిబ్రవరి5,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో గత ప్రభుత్వ హయంలో జరిగిన మద్యం అక్రమాలపై సిట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడ పోలీస్ కమీషనర్ రాజశేఖరబాబు ఆధ్వర్యంలో ఏడుగురు సభ్యులతో ఈ సిట్ ఏర్పాటయింది.,మద్యం అమ్మకాలకు సంబంధించి సిట్‌కు అవసరమైన పూర్తి సమాచారం ఇవ్వాలని ఎక్సైజ్ శాఖకు ఆదేశాలు జారీ అయ్యాయి.దర్యాప్తు బృందం సీఐడీ చీఫ్ ద్వారా ప్రతి 15 రోజులకు ఒక పర్యాయం ప్రభుత్వానికి నివేదికను సమర్పించాలని ప్రభుత్వ ఉత్తర్వుల్లో స్పష్టం చేసారు.ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఎస్పీ సుబ్బరాయుడు,అడిషనల్ ఎస్పీ కొల్లి శ్రీనివాస్, సీఐడీ ఏఎస్పీ శ్రీహరిబాబు, డోన్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శివాజీని నియమించారు. సీఐడీ డీఐజీ ఆధ్వర్యంలోనే సిట్ పనిచేస్తోందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. సిట్ బృందానికి పూర్తి అధికారాలు కల్పించారు.2019 అక్టోబరు నుంచి 2024 మార్చి వరకు రాష్ట్రంలో మద్యం విక్రయాలకు సంబంధించి రూ.90వేలు కోట్ల నగదు లావాదేవీలు జరిగాయన్నది అభియోగం,నగదు లావాదేవీలతో పాటు హోలో గ్రామ్ వ్యవహారంలో కుడా పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

# అక్రమవలసదారులతో అమృత్‌సర్ చేరిన అమెరికా విమానం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:** డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి రాగానే అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపిన అమెరికా ప్రభుత్వం కొంతమంది భారతీయులను కూడా వెనక్కి పంపిన సంగతి తెలిసిందే. చట్టవ్యతిరేకంగా అగ్రరాజ్యంలో అడుగుపెట్టిన వారిని ప్రత్యేక విమానంలో స్వదేశానికి పంపింది. 104 మందితో టెక్సాస్ నుంచి బయల్దేరిన అమెరికా సైనిక విమానం సీ- 17 బుధవారం మధ్యాహ్నం 1.55 గంటలకు పంజాబ్‌లోని అమృత్‌సర్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో దిగింది. వీరిలో 30 మంది పంజాబ్, 33 మంది హర్యానా, 33 మంది గుజరాత్ వాసులతో పాటు మహారాష్ట్ర నుంచి ముగ్గురు, ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముగ్గురు, ఇద్దరు చండీగఢ్ వాసులు ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. వెనక్కి పంపేముందు ప్రతిఒక్కరి రికార్డులను పరిశీలించినట్లు ఢిల్లీలోని అమెరికా ఎంబసీ అధికారులు వెల్లడించారు. రానున్న రోజుల్లో మరిన్ని విమానాలు అమెరికా నుంచి భారత్‌కు రానున్నాయని వివరించారు. అమెరికా హోంలాండ్ అధికారుల లెక్కల ప్రకారం 20,407 మంది భారతీయుల వద్ద సరైన పత్రాలు లేనట్లు గుర్తించిన అధికారులు 17,940 మందిని వెనక్కి పంపేందుకు తుది ఉత్తర్వులు జారీ చేశారు. 2,467 మంది ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ రిమూవల్ ఆపరేషన్స్ నిర్బంధంలో ఉన్నారు. తొలివిడతలో భాగంగా 205 మందిని వెనక్కి పంపించారు. అక్రమవలసదారులపై ట్రంప్ మొదటి నుంచి కఠినంగా ఉంటున్నారు. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టడంతో వారి గుర్తింపు, తరలింపు ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ క్రమంలోనే ఎల్ పాసో, టెక్సాస్, శాన్ డియాగో, కాలిఫోర్నియాలో ఉన్న 5,000 మంది అక్రమ వలసదారులను ఆయా దేశాలకు తరలించేందుకు పెంటగాన్ సిద్ధమైంది. ఇప్పటికే కొంతమందిని సైనిక విమానాల్లో గటేమాలా, పెరు, హోండూరస్ తదితర దేశాలకు పలువురిని తరలించింది. అక్రమ వలసదారులపై అమెరికా అనుసరిస్తున్న విధానాల పట్ల ఇప్పటికే భారత్ తన స్పందనను తెలిపింది. అక్రమ వలసలకు తాము వ్యతిరేకమని, ఈ అంశం అనేక రకాల వ్యవస్థీకృత నేరాలతో ముడిపడి ఉందని పేర్కొంది. వీసా గడువు ముగిసినా లేదా సరైన దస్త్రాలు లేకుండా భారతీయులు అమెరికాతో సహా ఎక్కడ ఉన్నా వారిని తిరిగి తీసుకువచ్చేందుకు వీలు కల్పిస్తామని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

## బిజెపికే ఢిల్లీ పీఠం!

>> అదికార పార్టీ ఆమ్ ఆద్మీపార్టీకంటే ఎక్కువస్థానాలు గెలుస్తుందని అంచనావేస్తున్నారు. ప్రముఖ ముందస్తు సర్వే సంస్థలన్నీ కూడా బిజెపికే మొగ్గుచూపించాయి. పీపుల్స్ పల్స్ మినహా మిగిలిన అన్ని సర్వేసంస్థలు బిజెపికి 50స్థానాలకు తగ్గకుండా వస్తాయని ప్రకటించాయి. పీపుల్స్ పల్స్ మాత్రం బిజెపికి 51 నుంచి 60 స్థానాలు వస్తాయని, ఆమ్ ఆద్మీపార్టీకి 10 నుంచి 19స్థానాలు మాత్రమే వస్తాయని అంచనావేసింది. వివిధ సంస్థల అంచనాలకు అనుగుణంగానే ఎన్నికల ప్రచారం కూడా జోరుగా సాగింది.పోటీ ఆసాంతం ఆమ్ ఆద్మీ భారతీయ జనతాపార్టీమధ్యనే నడిచిందని పోలింగ్ సరళి రుజువుచేస్తోంది. వివిధ సర్వేసంస్థలన్నీ చేసిన సర్వేలనుచూస్తే కాంగ్రెస్ పార్టీకి ఒకటిరెండు స్థానాలకు మించి రావని స్పష్టంచేస్తున్నాయి. వివిధ సర్వేసంస్థల అంచనా స్థానాలు ఈ విధంగా ఉన్నాయి. ఢిల్లీలో మొత్తం రిజిస్టరు అయిన ఓటర్లు 1.52కోట్లకుపైగా ఉన్న ఢిల్లీ ఓటర్లు ఈసారి చైతన్యం ప్రదర్శించారని స్పష్టం అవుతోంది. ఎక్కువగా కొత్తగాచేసిరనవారి ఓట్లు పోలింగ్‌కు ఎక్కువ రావడంతో విజయం బిజెపికే ఖాయం అని విశ్లేషకులు అంచనాలువేస్తున్నారు. ఈ ఎన్నికల్లో బిజెపి 68 స్థానాల్లోపోటీచేస్తుంటే ఆప్ మొత్తం 70 స్థానాల్లోను పోటీచేస్తోంది. 15 ఏళ్లపాటు ఢిల్లీని పాలించిన కాంగ్రెస్ గడచిన రెండుదశాబ్దాలుగా ఒక్కస్థానం కూడా సాధించుకోలేకపోతోంది. ఇప్పటివరకూ వచ్చిన ఎగ్జిట్‌పోల్స్‌ను చూస్తుంటే కనీసం ఆరుసంస్థలు బిజెపికే గెలుపు అవకాశాలు ఎక్కువ ఉన్నట్లు ప్రకటించాయి.

## హెచ్1బి వీసా రెన్యువల్ రద్దు

>> అందువల్ల బైడెన్ నిర్ణయాన్ని రద్దుచేయాలని ఆ ఇద్దరు తీర్మానం ప్రవేశపెట్టారు. గత ప్రభుత్వ నిబంధనను 2025 జనవరి 13న డిపార్టుమెంట్ ఆఫ్‌హోమ్‌ల్యాండ్‌సెక్యూరిటీ ఖరారుచేసింది. ఇది వలసదారులు,శరణార్థులు, గ్రీన్‌కార్డుదారులు హెచ్‌వన్‌బి ఎల్‌వన్ వీసాదారుల భార్యలపై ప్రభావంచూపించింది. భారీ సంఖ్యలో వర్క్ వీసాలపై పనిచేస్తున్న భారతీయులు లబ్దిపొందారు. సెనేటర్లు జాన్‌కెన్నెడీ, రిక్‌స్కాట్‌లు కాంగ్రెస్ రివ్యూయాక్ట్‌కింద గతనెల 31న బైడెన్ నిర్ణయానికి రద్దుతీర్మానంప్రతిపాదించారు. కెన్నడీ మాట్లాడుతూ గత సర్కారునిర్ణయం ప్రమాదకరమైనదన్నారు బైడెన్ కార్యవర్గం వర్క్ పర్మిట్స్‌ను ఆటోమేటిక్‌గా 540 రోజులు పొడిగించేలా నిబంధన తీసుకొచ్చింది. ఇది ఇమ్మిగ్రేషన్‌చట్టాల అమలును దెబ్బతీస్తుంది. అమెరికా భద్రతకు సైతం ముప్పు తెస్తుందని కెన్నడీ వ్యాఖ్యలుచేసారు. బైడెన్ నిర్ణయాన్ని స్కాట్ ఖండించారు. అక్రమ వలసదారులు ఏళ్లతరబడి అమెరికాలో ఉద్యోగాలుచేసేందుకు ఇది సహకరిస్తుందని వ్యాఖ్యానించారు. ఈ నిబంధనలు రద్దుచేయకుండా అక్రమ వలసదారులను గుర్తించడం కష్టమని అభిప్రాయం వ్యక్తంచేసారు.

# ఒంటరి పోటీ

>> తిప్పికొడతామని చెప్పారు. కేంద్రంలోని మోడీ సర్కారు ప్రవేశపెట్టిన బడ్జెట్ ముమ్మాటికీ పేదల వ్యతిరేక బడ్జెట్ అని స్పష్టం చేశారు. కమ్యూనిస్టు పార్టీగా దేశంలోని ప్రతి ఒక్కరికీ ఉచిత విద్య, వైద్యం అందాలని తాము కోరుకుంటుంటే మోడీ సర్కారు మాత్రం ఆ రెండు రంగాలను పూర్తిగా కార్పొరేట్ల చేతుల్లో పెట్టే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. ఆ రెండు రంగాలకు కేవలం 4 శాతం నిధులే కేటాయించడం దానికి నిదర్శనమని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్), హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్(హెచ్‌యూజే) సంయుక్త ఆధ్వర్యంలో మీట్ ది మీడియా కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి జాన్‌వెస్లీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్నదనీ, ఫలితంగానే ఒక్కశాతం ఉన్న కార్పొరేట్ల చేతిలో 27 శాతం సంపద పోగైందని చెప్పారు. అదానీ, అంబానీ లాంటి వాళ్లకు లక్షల కోట్ల రూపాయల సంపదను అప్పనంగా కట్టబెడుతున్న తీరును ఎండగట్టారు. దేశంలో 50 శాతం ఉన్న పేదల చేతుల్లో కేవలం 13 శాతం సంపదే ఉందని చెప్పారు. దీంతో పేదలు రక్తహీనత, పేదరికం, నిరుద్యోగం, నిత్యావసర సరుకులు ధరలు, విద్య, వైద్యం, ఇండ్లలేమి వంటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. గ్రామాల్లో ఉపాధి కూలీలకు పని దొరకని పరిస్థితులు ఓవైపు, వారి పిల్లలు ఉన్నత విద్యనభ్యసించినా చేసేందుకు ఉద్యోగాలు లేక ఎదుర్కొంటున్నారని చెప్పారు. మన దేశంలో ఈ అసమానతలు గత పాలకులు, ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాల వల్లనే అన్నారు. మన దేశంలో ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కుల వివక్ష ఉందనీ, సామాజిక అసమానతలు వేల ఏండ్ల నుంచి కొనసాగుతున్నా వాటిని నిర్మూలించాలనే చిత్తశుద్ధి నేటి పాలకులకు లేదని విమర్శించారు. మతోన్మాద రాజకీయాలు శ్రామిక వర్గ ఐక్యతకు, సామాజిక ఉద్యమాలకు, బడుగు, బలహీన వర్గాల పోరాటాలకు తీవ్ర ఆటంకంగా మారాయని ఈ తరుణంలో దేశంలోని లౌకిక శక్తులు ఐక్యం కావాల్సి న అవసరం ఉందని నొక్కి చెప్పారు.

**బిసిలకు సరైన కేటాయింపులు లేవు..**

దేశంలో 50 శాతానికిపైగా జనాభాగా ఉన్న బీసీలకు బడ్జెట్‌లో సరైన కేటాయింపులు లేవన్నారు. మూడు, నాలుగు వేల కోట్ల రూపాయలతో మైనార్టీ సంక్షేమం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. సీపీఐ(ఎం) పార్టీగా తాము విద్యా వైద్య రంగాలకు కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని అడుగుతుంటే ఆ రెండు రంగాలకు కేవలం నాలుగు శాతం నిధులు ఇవ్వడమేంటని నిలదీశారు. విద్యవైద్య రంగాలను పూర్తిగా ప్రయివేటీకరణ చేసే కుట్ర దీని వెనుక దాగి ఉందన్నారు. దేశంలో తాండవిస్తున్న నిరుద్యోగ సమస్య పరిష్కారం గురించి కేంద్ర ప్రభుత్వానికి ఆలోచనే లేదని విమర్శించారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలకు కేటాయింపులే లేవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బయ్యారం ఉక్కు కర్మాగారం, హైదరాబాద్‌లో మెట్రో పేస్2, ఫోర్త్ సిటీ, మూసీ సుందరీకరణకు కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని అడిగితే మోడీ సర్కారు పట్టించుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. గత బీఆర్ ఎస్ ప్రభుత్వం హామీలను విస్మరించడం వల్లనే ప్రజలు ఆ పార్టీని కాదని కాంగ్రెస్‌కు అవకాశమిచ్చారనీ, కాంగ్రెస్ కూడా బీఆర్ ఎస్ బాటలోనే నడుస్తున్నదని విమర్శించారు. రైతులకు, కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని చెప్పారు. ప్రతిపక్ష హోదాలో ఉన్న బీఆర్ ఎస్ పార్టీ మతోన్మాద రాజకీయాలపై తన వైఖరేంటో చెప్పకుండా అవకాశవాదంతో ముందుకెళ్తుందని బీజేపీ పట్ల తన వైఖరేంటో స్పష్టపర్చాలని బీఆర్‌ఎస్‌ను డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) పార్టీ విస్తరించడానికి బలమైన ఉద్యమాలే కీలకం కాబోతున్నాయన్నారు. విస్తృత పోరాటాల ద్వారా ప్రజలకు చేరువవుతామని చెప్పారు. వామపక్ష పార్టీలను కలుపుకుని రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను ఏర్పాటు చేసేందుకు సీపీఐ(ఎం)గా చొరవ తీసుకుంటామని ప్రకటించారు. తాను సామాజిక సమీకరణాల రీత్యా ఈ పదవిలోకి రాలేదనీ, సీపీఐ(ఎం) మహాసభ ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకుంటే కార్యదర్శిని అయ్యానని విలేకర్లు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు.

# త్రిషకు కోటి నజరానా

>> జూబ్లీహిల్స్‌లోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా త్రిష ప్రతిభను కొనియాడుతూ ముఖ్యమంత్రి కోటి రూపాయల నజరానా ప్రకటించారు. ‘నీ ప్రతిభ తెలంగాణ గర్వించదగినది. భవిష్యత్తులో భారతదేశం తరఫున మరింతగా రాణించాలని ఈ సందర్భంగా సిఎం ఆకాక్షించారు. తెలంగాణ నుంచి అంతర్జాతీయ స్థాయిలో మహిళా క్రికెటర్లు ఎదగడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

**ధృతి కేసరికి రూ. 10 లక్షల నజరానా**

అండర్19 మహిళల వరల్డ్ కప్ టీమ్‌లో సభ్యురాలిగా నిలిచిన మరో తెలంగాణ క్రీడాకారిణి ధృతి కేసరిని కూడా సీఎం అభినందించారు. ఆమె ప్రతిభను గుర్తిస్తూ రూ.10 లక్షల నగదు బహుమతి ప్రకటించారు. కోచ్,ట్రైనర్లకు కూడా ప్రోత్సాహం అందించారు. కేవలం క్రీడాకారులకే కాకుండా, వారిని తీర్చిదిద్దిన కోచ్‌లు, ట్రైనర్లకు కూడా గుర్తింపు ఇవ్వడం ప్రభుత్వం యొక్క లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అండర్19 మహిళల టీమ్ హెడ్ కోచ్ నౌషీన్, ట్రైనర్ షాలినిలకు చెరో రూ.10 లక్షల నగదు ప్రోత్సాహకం ప్రకటించారు.

మహిళా క్రీడాకారుల ఎదుగుదలకు తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సీఎం స్పష్టం చేశారు. మహిళా క్రికెట్‌ను మరింత అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని, ఆటగాళ్లకు ఉత్తమ శిక్షణ, ప్రోత్సాహకాలు అందజేస్తుందని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన త్రిష సిఎంను కలిసిన సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, పలువురు లోక్‌సభ సభ్యులు, ఎమ్మెల్యేలు,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డితో పాటు ఇతర ప్రముఖులు ఉన్నారు.

# స్థానిక పోరుకు సర్కార్ రెడీ

>> స్థానిక సంస్థల ఎన్నికలపై కాంగ్రెస్ పార్టీ ఫోకస్ చేసింది. కులగణన రిపోర్టును అసెంబ్లీ పెట్టి చర్చించింది ప్రభుత్వం. రాజ్యాంగం ప్రకారం తెలంగాణ ప్రభుత్వం పంపిన తీర్మానాన్ని కేంద్రం ఆమోద ముద్ర వేయాలి. లేకుంటే పార్టీ పరంగా బీసీలకు 42 శాతం సీట్లను స్థానిక సంస్థల ఎన్నికల్లో కేటాయిస్తామని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు పార్టీ ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్‌రెడ్డి, ఇన్ ఛార్జ్ దీపాదాస్ మున్షీ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సమావేశం కానున్నారు. ఎమ్మెల్యేలను జిల్లాల వారీగా నాలుగు గ్రూపులుగా విభజించనున్నారు. ఆ తర్వాత వారితో సమావేశం కానున్నారు. వీలైతే ఒక్కొక్కరితో మాట్లాడే అవకాశమున్నట్లు గాంధీ భవన్ వర్గాలు చెబుతున్నాయి.

# పాలమూరు దాహం తీర్చండి

>> భూమికి నీరు అందుతోందని, ప్రస్తుతం పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, నీటి నిల్వల తగ్గుదల కారణంగా ప్రస్తుత పంటలకు కనీసం రెండు తడులు ఇవ్వాల్సి న అవసరం ఉందని పేర్కొన్నారు.అంతేకాక, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సుమారు 30 లక్షల మంది ప్రజలు తాగునీటి కోసం పూర్తిగా ఈ నీటి వనరుపైనే ఆధారపడి ఉన్నారని, నీటి నిల్వలు తగ్గుతుండటంతో గద్వాల్, వనపర్తి, కొల్లాపూర్, దేవరకద్ర, మక్తల్ నియోజకవర్గాల్లో తీవ్ర నీటి సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు ఈ ప్రాంతానికి తక్షణమే నీటి విడుదల జరగకపోతే, పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతారని, అదేవిధంగా తాగునీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చి ప్రజల దాహార్తిని తీర్చడం కష్టంగా మారనుందని వివరించారు. ఇలాంటి పరిస్థితుల నుంచి గట్టెక్కించేందుకు చర్యలు తీసుకోవాలని, నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి తక్షణమే 5 టీఎంసీల నీటిని విడుదల చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు, డిప్యూటీ సీయంకు మంత్రి జూపల్లి విజ్ఞప్తి చేశారు. నీటిని విడుదల చేయడం వల్ల తాగునీటి కష్టాలు తీరుతాయని, యాసంగి పంటలకు కూడా ఢోకా ఉండదని తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డీకే శివకుమార్.. 4 టీఎంసీల నీటి విడుదల చేస్తామని భరోసానిచ్చినట్లు మంత్రుల బృందం తెలిపింది.

## అదనపు జడ్జిలకు శాశ్వత జడ్జిలుగా పదోన్నతి

>> లైబ్రరీ సైన్స్ డిగ్రీ చదివారు. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో,తర్వాత తెలంగాణ హైకోర్టులో న్యాయవాదిగా రెగ్యులర్ ప్రాక్టీస్ చేశారు. 2023 జూలై 31న తెలంగాణ హైకోర్టులో ఆయన అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఇప్పుడు ఇదే హైకోర్టులో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటీ సంగారెడ్డి జిల్లాకు చెందిన హైకోర్టు న్యాయమూర్తి. మొదట ఇంజనీరింగ్ డిగ్రీ చేసిన ఆయన తర్వాత లా డిగ్రీ, పిజీ లా డిగ్రీ చదివారు. హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీకి స్టాండింగ్ కౌన్సిల్ ప్రతినిధిగా విధులు నిర్వహించడంతో పాటు లోక్ అదాలత్‌లో సేవలు అందించారు. 2023 జూలై 31న తెలంగాణ హైకోర్టులో ఆయన అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఇప్పుడు ఇదే హైకోర్టులో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. జస్టిస్ సుజానా కళాసి కంనల్లగొండ జిల్లాకు చెందిన హైకోర్టు న్యాయమూర్తి.ఉస్మానియా విశ్వవిద్యాలయంలో లాడిగ్రీ చదివారు. 2010లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. తర్వాత 2012లో జిల్లా జడ్జిగా ఎంపికయ్యారు. కరీంనగర్‌లో అదనపు జిల్లా జడ్జీగా విధులు నిర్వహించారు. నిజామాబాద్‌లో ప్రిన్సిపల్ జిల్లా జడ్జీగా పనిచేశారు. హైదరాబాద్‌లో చీఫ్ జడ్జీగా, స్టేట్ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్‌గా , హైకోర్టులో రిజిస్ట్రార్ జనరల్‌గా పనిచేశారు. 2023 జూలై 31న తెలంగాణ హైకోర్టులో ఆమె అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఇప్పుడు ఇదే హైకోర్టులో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు

## వారం - వర్జ్యం

తేది : 06-02-2025, గురువారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం,
శిశిర ఋతువు, శుక్లపక్షం,
నవమి రా.10.54
కృత్తిక రా.7.28
వర్జ్యం : ఉ.8.06-9.42
దు.ఉ.10.36-11.12
2) మ.3.10-3.56
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి. వృత్తి, వ్యాపారాలు లాభిస్తాయి. ఉద్యోగాలలో స్థానమార్పులు.

**వృషభం:** భూ, గృహ లాభం పొందుతారు. ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి.

**మిథునం:** కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. వస్తులాభం ప్రయాణాలలో పరిచయాలు.

**కర్కాటకం:** దూరప్రాంతాల నుండి శుభవార్తలు వింటారు. సోదరుల కలయిక. కాంట్రాక్టు లభిస్తాయి.

**సింహం:** నూతన పరిచయాలు పెరుగుతాయి. పనులలో విజయం సాధిస్తారు. వస్తు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

**కన్య :** అనుకోని ఆహ్వానాలు ఆశ్చర్యపరుస్తాయి సంఘంలో ఆదరణ పొందుతారు. బంధువుల నుండి సాయం అందిస్తారు.

**తుల :** ఉద్యోగాలలో మార్పులు వుంటాయి. అనుకోని సమస్యలు ఎదురవుతాయి. వాటిని పరిష్కరించుకుంటారు.

**వృశ్చికం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకొంటారు. ధనవ్యయం పెరుగుతుంది.

**ధనుస్సు:** గృహనిర్మాణ ఆలోచనలు స్థిరంగా ఉండవు. ఉద్యోగాలలో బదలీలు వుంటాయి.

**మకరం:** కుటుంబ సమస్యలు ఎదురై చికాకు పరుస్తాయి. ఇంటా బయటా అనుకూలంగా వుంటుంది.

**కుంభం:** చిన్ననాటి మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**మీనం :** కుటుంబ సభ్యుల నుండి వత్తిడులు ఎదురైన అధిగమిస్తారు. స్వల్పధనలాభం పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## పబ్లిక్ డొమైన్‌లో కులగణన

>> కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు ఉత్తమ్ పద్మావతీరెడ్డి, వేముల వీరేశం,మందుల సామ్యేల్, వీర్లపల్లి శంకర్,అమీర్ అలీఖాన్, లక్ష్మీకాంతరావు, భూపతిరెడ్డి, బొజ్జు,కుంభం అనిల్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్సీలు కోదండరామ్,బల్మూరి వెంకట్, అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రజల నుంచి బీసీ సంఘాల నుంచి వస్తున్న అభిప్రాయాలను అడిగి సమాధానాలు తెలుసుకున్నారు.

## సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నాం

>> సబ్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాను 150 కుటుంబాలతో కూడిన ఎన్యూమరేషన్ బ్లాక్‌గా విభజించి తద్వారా 94,261 బ్లాక్‌లను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,03,889 ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లను నియమించి వారికి శిక్షణ ఇచ్చి నిరంతరం ఈ ప్రక్రియ పూర్తి కావడం కోసం జిల్లా అడిషనల్ కలెక్టర్లను నోడల్ అధికారిగా నియామకం చేశామని తెలిపారు, జిల్లా కలెక్టర్ల నిరంతరం పర్యవేక్షణ చేసే విధంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మానిటరింగ్ చేసి పకడ్బందీగా సర్వే పూర్తి చేశామని వివరించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు ఉన్నారు.

# హైబ్రిడ్ అన్యూటీ మోడ్‌లో వేగంగా రోడ్ల నిర్మాణం

## 15యేళ్లు సంస్థ నిర్వహణకు ఒప్పందం

## అటవీ మట్టిరోడ్లను తారు రోడ్లుగా రూపొందించేందుకు వెంటనే మంజూరు

## వర్షాకాలం దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుకు షార్ట్ టెండర్ ప్రక్రియ

## ఆర్‌అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



బుధవారం ఆర్ అండ్ బి శాఖపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**హైదరాబాద్,ఫిబ్రవరి5,ప్రభాతవార్త:** హైబ్రీడ్ అన్యూటీ మోడ్‌లో రాష్ట్రంలో రోడ్ల నిర్మాణంను వేగం పెంచాల్సిన అవసరం ఉందని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం సచివాలయంలో ఆర్‌అండ్‌బి సమీక్షా సమావేశం మంత్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కొమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ స్థానిక ప్రజా ప్రతనిధులు ఎస్ఇ, ఇఇలతో పాటు ఇతర అధికారులు కలిసి హ్యామ్ రోడ్లను గుర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని మూడు రకాల రోడ్లను వర్గీకరించి వాటి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచిం చారు. ముఖ్యంగా మట్టి రోడ్లను గుర్తించి వాటి అభివృద్ధికి ప్రణాళికలు వేయాలని ఆయన సూచించారు. అటవీ అనుమతులతో మట్టిరోడ్లుగా ఉన్న రహదారులకు భవిష్యత్‌లో బిటి రోడ్లుగా మార్చేందుకు ప్రణాళికలు సిద్దంచేయాలని సూచించారు. ప్రభుత్వం 40శాతం, ప్రవేటు 60శాతం పెట్టుబడితో రోడ్లు నిర్మాణం చేసి టోల్‌వసూలు చేసుకొనే పద్దతిని హైబ్రీడ్ అన్యూటీ మోడ్ రోడ్ల నిర్మాణం అని ఆయన వివరించారు. నియమ,నిబంధనలకు అనుగుణంగా హ్యామ్ రోడ్ల నిర్మాణం చేయాలని అధికారులకు సూచించారు. మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి మిస్సింగ్ లింక్‌రోడ్లు, జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర రాజధానికి మిస్సింగ్ లింక్ రోడ్లు, అప్‌గ్రేడేషన్ వంటి మూడు విభాగాలుగా రోడ్ల నిర్మాణాలు చేయబోతున్నామని తెలిపారు. హ్యామ్ రోడ్డు నిర్మాణం కన్సల్టెంట్లను గుర్తించి డిపిఆర్ సిద్దం చేయాలని ఆదేశించారు. మంచిగా ఉన్న రోడ్లను హ్యామ్ లోకి తీసుకువస్తే కన్సల్టెంట్లు బాగుపడుతారు కాబట్టి అత్యంత దారుణంగా ఉండే రోడ్లను ప్రజలు ఇబ్బంది పడుతున్న రోడ్లను ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని దిశనిర్ధేశించారు. రోడ్ల నిర్మాణంలో డివైడర్లు, లైటింగ్,రోడ్ విస్తరణ పేవ్‌డే షోల్టర్స్ ఏర్పాటులో ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించాలని మంత్రి చెప్పారు. 15ఏళ్ళ పాటు హ్యామ్ రోడ్డు తీసు కున్న సంస్థ పూర్తిగా మెయింటినెన్స్ చేయాల్సి ఉం టుందని అని తెలిపారు. నాణ్యతా ప్రమాణాల విషయంలో ఇంజనీర్ల రాజీప డొద్దని అన్నారు. మట్టిరోడ్లు ఎన్ని ఉన్నాయో వాటిని గుర్తించి మంజూరులు హ్యామ్ పద్దతిలో ఇవ్వాలని సూచించారు. ప్రజాధనంతో నిర్మించే రహదారులలో నాణ్యత లేకపోతే పనులు రద్దుచేయాలని కోరారు. హ్యామ్ రోడ్ల నిర్మాణంకు సమయం కావాలని కన్సలెటెన్సీలు అడుగగా ప్రజలు ఇబ్బంది పడుతుంటే ప్రమాదాలలో చనిపోతే ఎవరు బాద్యత తీసుకొంటారు వెంటనే నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఏరోడ్డు నిర్మాణం అయినా రెండు మూడు నెలలో ప్రారంభించి వేగంగా ముందుకు తీసుకొని వెళ్లాలని ఆయన అన్నారు. వర్షాకాలంలో దెబ్బతిన్న, దశాబ్దాలుగా మరమ్మతుకు నోచుకోని రహదారులకు ఎస్సిమేట్ సిద్దంచేసి షార్ట్ టెండర్ పిలిచి పనులు ప్రారంభించాలని మంత్రి కోరారు. 82నియోజకవర్గాలలలో 1690.26కిమి నిడివితో రోడ్లు మరమ్మతు చేయాలని అధికారులకు సూచించారు. సర్వీస్ రూల్ ప్రక్రియ పూర్తిచేసి ఇప్పటి వరకు ఏఇఇలను డిఇఇలుగా పదోన్నతులు ఇచ్చామని నెలాఖరుకల్లా డిఇఇ,ఇఇ,ఎస్ఇల ప్రమోషన్ ఇస్తామని తెలిపారు. రివ్యూలో ఆర్‌అండ్‌బి స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్, స్పెషల్ సెక్రటరీ దాసరిహరిచందన, సిఇలు తిరుమల, మోహన్‌నాయక్, ఎస్ఇలు,ఇఇలు పాల్గొన్నారు.

# కోళ్లకు వైరస్ టిజి, ఎపిలో లక్షల కోళ్లు మృత్యువాత

## ఆందోళనలో పౌల్ట్రీ యజమానులు



**హైదరాబాద్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:** తెలంగాణ, అంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పౌల్ట్రీ ఫామ్స్‌ను అంతు చిక్కని వైరస్ అల్లాడిస్తోంది. రోజూ వేలాది సంఖ్యలో కోళ్లు చనిపోతుండటంతో పౌల్ట్రీ యజమానులు తలలు పట్టుకుంటున్నారు. పలు జిల్లాల్లో పౌల్ట్రీ ఫారాలు వద్ద గుట్టలు గుట్టలుగా మృతి చెందిన కోళ్లు దర్శనమిస్తున్నాయి. ఒక్కొక్క పౌల్ట్రీ ఫారం వద్ద రోజుకు సుమారు పదివేల కోళ్లు మృతి చెందుతున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలోని ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలో వేలాది బాయిలర్ కోళ్లు చనిపోతున్నాయి. అంతు చిక్కని ఈ వైరస్‌తో సత్తుపల్లి, కల్లూరు, విఎమ్ బంజరలోని పౌల్ట్రీ ఫామ్స్‌లో కోళ్లు చనిపోతున్నాయి. కోళ్ల మృతిపై వాటి యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోనూ అంతుచిక్కని వ్యాధితో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. బిర్కూర్, పోతంగల్, భీమ్‌గల్ మండలాల్లో వేలాది కోడి పిల్లలు చనిపోయాయి. వైరస్ ఒక్కొక్కటిగా అన్ని పౌల్ట్రీ ఫామ్స్‌కు వ్యాపిస్తుండటంతో తీవ్ర ఆందోళనలో కొట్టుమిట్టాడుతున్నారు. కాగా ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పౌల్ట్రీలకు వైరస్ వ్యాపించడంతో వాటి నిర్వహకులు తీవ్ర ఆందోళనల్లో కొట్టుమిట్టాడుతున్నారు. రాష్ట్రంలోని ఉమ్మడి పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లో పౌల్ట్రీ రంగం అల్లాడిపోతుంది. కోళ్లు మృత్యువాత పడుతుండటంతో పౌల్ట్రీ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత 15 రోజుల్లో ఉమ్మడి జిల్లాలో 40 లక్షల కోళ్లు చనిపోయాయి. బాదంపూడి, రేలంగి, మొగల్లు, పెద్ద తాడేపల్లి, దువ్వ వేల్పూర్, తణుకు, గుమ్మనిపాడు ప్రాంతాలలో కోళ్లు ఎక్కువగా చనిపోతున్నాయి. ఒక్కొక్క పౌల్ట్రీ ఫామ్ దగ్గర రోజుకు దాదాపు పదివేల కోళ్లు చనిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షలాది కోళ్ల మృతితో పశు సంవర్ధన శాఖ అధికారులు రంగంలోకి దిగారు. శాంపిల్స్ సేకరించి భోపాల్‌లోని హై సెక్యూరిటీ ల్యాబ్ కు పంపారు. మరిన్ని కోళ్లకు వైరస్ సోకకుండా రైతులు చనిపోయిన కోళ్లను బహిరంగ ప్రదేశంలో పడేయకుండా పాతిపెట్టాలని సూచిస్తున్నారు. వేల రూపాయల నుంచి లక్షల రూపాయలు విలువచేసే పందెం పుంజుల సైతం వైరస్ బారిన పడి మృత్యువాత పడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా కోళ్ల ఫారాలలో ఎనిమిది కోట్ల బ్రాయిలర్ కోళ్లు, ఇళ్లలో రెండు కోట్ల నాటు కోళ్లు ఉన్నాయని అధికారులు తెలిపారు. దేశీయ కోళ్ల కంటే కోళ్ల ఫారం కోళ్లలోనే మరణాలు ఎక్కువగా ఉన్నాయి. వైరస్ ఏంటో కనిపెట్టి దానికి సంబంధించిన వ్యాక్సిన్ పంపిణీ చేయాలని రెండు రాష్ట్రాల ప్రభుత్వాన్ని పౌల్ట్రీ యజమానులు కోరుతున్నారు. వేలాది కోళ్లు అర్థంతరంగా మృతి చెందడంతో తమకు తీవ్ర నష్టం వస్తుందని ప్రభుత్వాలే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ రావుకు హైకోర్టులో ఊరట

**హైదరాబాద్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** కాంగ్రెస్ నేత చక్రధర్ గౌడ్ ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో నమోదైన ఫోన్ ట్యాపింగ్ కేసులో బిఆర్ఎస్ నేత హరీష్ రావుకు హైకోర్టులో మరోసారి ఊరట లభించింది. ఈ కేసులో హరీష్ రావును ఫిబ్రవరి 12 తేదీ వరకు అరెస్టు చేయరాదని హైకోర్టు బుధవారం పోలీసులను ఆ దేశించింది. ఈ కేసుపై ఇదివరకు ఇచ్చిన స్టేపై హైకోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా అటు హరీష్ రావు తరపు, ఇటు పోలీసుల తరపు న్యాయవాదులు తమ తమ వాదనలు వినిపించారు. తనపై నమోదైన కేసును కొట్టి వేయాలని హరీష్ రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడం తెలిసిందే. ఇదే సమయంలో హరీష్ రావును అరెస్టు చేయాలని ఆయనపై ఫిర్యాదు చేసిన చక్రధర్ గౌడ్ కోరారు. ఈ కేసులో ఎ1గా హరీష్‌రావు ఎ2గా టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్ రావు నిందితులుగా ఉన్నారు. టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్ రావు కూడా ఈ కేసును కొట్టి వేయాలని హైకోర్టులో పిటిషన్‌దాఖలు చేయగా దీనిపై విచారణ ఇంకా మొదలు కాలేదు. హరీష్ రావు దాఖలు చేసిన పిటిషన్‌పై ఇప్పటికే ఇచ్చిన స్టేను హైకోర్టు మరోసారి పొడిగించింది. ఫిబ్రవరి 12వ తేదీన ఈ కేసుపై తదుపరి విచారణ చేస్తామని ప్రకటించిన ధన్మాసనం అదే రోజుకు కేసును వాయిదా వేసింది. ఈ కేసుపై ఇప్పటికే హరీష్ రావుకు రెండుసార్లు ఊరట లభించగా తాజాగా మూడవసారి కూడా స్టే పొడిగించారు.



## మరోసారి బిసిలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ : బిజెపి ఎమ్మెల్యే పాయల్ శంకర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ మరోసారి బిసిలను మోసం చేసిందని, తెలంగాణ శాసనసభను వేదికగా చేసుకుని బిసిలకు ఇచ్చిన హామీలను విస్మరిస్తూ బిసిలను మభ్యపెట్టే రాజకీయాలు కొనసాగిస్తుందని బిజెపి శాసనసభ్యులు పాయల్ శంకర్ బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కామారెడ్డి బిసి డిక్లరేషన్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 బిసి రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ, ఆ హామీని నిలబెట్టుకోలేకపోయిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చట్టాలపై స్పష్టమైన అవగాహన ఉంది. అయినా, బిసి రిజర్వేషన్ల విషయంలో ఆయన దాటవేసే ధోరణి అవలంభించారని అన్నారు. మేము బిసిలకు రిజర్వేషన్లు ఇవ్వాలనుకుంటున్నాం, కానీ, సుప్రీంకోర్టు తీర్పు వల్ల ఇవ్వలేకపోతున్నామంటూ ప్రభుత్వం అంటుందన్నారు. ఒక తీర్మానం చేయడానికి అసెంబ్లీ సమావేశం పెట్టాల్సిన అవసరమా? అన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టులేక, బిసిలను మభ్యపెట్టే విధంగా శాసనసభలో కాంగ్రెస్ పార్టీ వ్యవహారించిందన్నారు. అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ప్రశ్నిస్తే సమాధానం ఇవ్వడం లేదన్నారు. 2024లో బిసిల జనాభా ఎలా తగ్గిపోయింది? అని అడిగితే స్పష్టమైన సమాధానం లేదు. రాష్ట్రంలో బిసి జనాభా ఎంత? అంటూ ప్రశ్నించారు. ఏ జిల్లాలో ఎంతమంది తగ్గారు? అని ప్రశ్నిస్తే డేటా బహిర్గతం చేయలేమంటున్నారు. బిసిలకు ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్ పార్టీకి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన బుద్ధిచెప్పాలని బిసిలందరినీ కోరుతున్నాఅన్నారు. ఈ మీడియా సమావేశంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్.ప్రకాష్ రెడ్డి, బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, బిజెపి ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్ నాయక్, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి అమర్ నాథ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా కింద రూ.1,126.54 కోట్లు జమ

## ప్రభుత్వానికి రైతే తొలి ప్రాధాన్యత

## వ్యవసాయ మంత్రి నాగేశ్వరావు

**హైదరాబాద్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త :** రైతు భరోసా నిమిత్తం 1,126.54 కోట్ల రూపాయలను 17.03 లక్షల మంది రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. బుధవారం నాటి వరకూ ఒక ఎకరం, సాగులో ఉన్న భూములకు రైతుభరోసా నిధులు చెల్లించినట్లు ఒక ప్రకటనలో వివరించారు. ఇంత వరకూ రాష్ట్రలోనే అత్యధికంగా నల్లగొండ జిల్లాలో 1,55,232 మందికి 88,48,08,319 రూపాయలను, అత్యల్పంగా మల్కాజిగిరి జిల్లాలో 4,825 మంది రైతులకు 3,74,26,967 రూపాయల మేర రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. తమ ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యత రైతే అని స్పష్టం చేశారు. వారికిచ్చిన మాట ప్రకారం రైతు భరోసా నిధులను నిర్ణీత కాల వ్యవధిలో చెల్లించుటకు కృతనిశ్చయంతో ఉన్నట్లు చెప్పారు. ఇకరుణమాఫీకి 20,616.89కోట్ల రూపా యలు, రైతు భీమాకు 3000 కోట్ల రూపా యలను విడుదల చేయడం జరిగిందన్నారు. అలాగే పంటలకు గిట్టుబాటు ధరల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వెల్లడిం చారు. ఎన్నడూలేని విధంగా 14,893 కోట్ల రూపాయలతో 20,11,954 మెట్రిక్ టన్నుల పత్తిని మద్ధతు ధరకు సేకరించినట్లు పేర్కొన్నారు. ఇక 406.24 కోట్ల రూపాయలతో సోయాబీన్, పెసళ్లు, కందులు పంటలను మార్క్ ఫెడ్ ద్వారా మద్ధతు ధరకు కొనుగోలు చేయడం జరిగిందని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ వానాకాలం రికార్డు స్థాయిలో వరి ఉత్పత్తులు. వరిపంటను మద్ధతు ధరకు కొనుగోలు చేస్తున్నామన్నారు. కాగా యాసంగిలో 48.06 లక్షల మెట్రిక్ టన్నులకు 10,547 కోట్ల రూపాయలు,ఖరీఫ్ లో 52.51 లక్షల మెట్రిక్ టన్నులకు 12,178.97 కోట్ల రూపాయల చొప్పున ధాన్యం కొనుగోలు చేయగా, సన్న రకాలకు బోనస్ కింద 1,154 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఈ యాసంగికి కూడా సన్నాలకు బోనస్ కొనసాగింపు ఉంటుందని స్పష్టం చేశారు. పసుపు, మిరప పంటలకు మద్ధతు ధర నిర్ణయించడానికి కేంద్రానికి విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. ఇదే సమయంలో వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరాతో పాటు, విత్తనాలు, ఎరువుల సరఫరాలో ఎటువంటి ఇబ్బం దులు తలెత్తకుండా పకడ్బంది చర్యలు తీసుకున్నామని మంత్రి తెలిపారు.

# రూ.10, 20 కాయిన్స్‌పై రిజర్వ్ బ్యాంక్ క్లారిటీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:** సాధారణంగా చిల్లర లావాదేవీలకు నిత్యం రూపాయి, 2 రూపాయిల నాణేలను వినియోగిస్తుంటారు. ఎవరైనా ఇచ్చిన కూడా సంకోచించకుండా తీసుకుంటారు. అయితే, అదే 10, 20 రూపాయిల నాణేల విషయానికి వచ్చేసరికి సందేహిస్తుంటారు. త్వరలో ఆ నాణేలు నిలిపివేస్తారంటూ నిత్యం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తల నేపథ్యంలో విస్తృత ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో కేంద్రం, రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా రూ.10, 20 నాణేలు, నోట్లపై క్లారిటీ ఇచ్చింది. కరెన్సీకి సంబంధించిన ఏవైనా నిర్ణయాలు అధికారిక ప్రకటనల ద్వారా మాత్రమే తెలియజేస్తామని కేంద్రం పేర్కొంది. నోట్ల ముద్రణ నిలిపివేత, నాణేలు చెల్లుబాటు కావంటూ వచ్చే వార్తల్లో నిజం లేదని స్పష్టం చేసింది. 10 రూపాయల నాణేలు, నోట్లు చెలామణిలో ఉంటాయని పేర్కొంది. అలాగే, అవసరమైతే కొత్త 10 రూపాయల నాణేలు మళ్లీ ప్రింట్ చేస్తామని వెల్లడించింది. అలాగే, రూ.20 నోట్లపై కూడా ఎలాంటి నిషేధం లేదని స్పష్టం చేసింది. అలాగే, రూ.20 నాణెం గురించి కూడా కేంద్రం తాజాగా వివరణ ఇచ్చింది. ప్రస్తుతం ఉన్న 10 రూపాయల నాణేలలా, 20 రూపాయల నాణేలు తయారవుతున్నట్లు చెప్పింది. అయితే, కొత్త 20 రూపాయల నాణెం మార్కెట్లో ఎప్పుడు వస్తుందో ఇంకా క్లారిటీ లేదు. కాగా, కేంద్ర ప్రభుత్వం 2020లో తొలిసారిగా రూ. 20 నాణేలను జారీ చేసింది. రూ.20 నాణెం 12 భుజాల బహుభుజిగా ఉంటుందని, దానిపై ధాన్యం ఆకారం ఉంటుందని, ఇది వ్యవసాయ రంగ ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తుందని ఆ సమయంలో చెప్పింది. ఇక సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ న్యూస్‌లు ప్రజలలో భయాన్ని కలిగిస్తున్నాయని, వాటిని నమ్మకూడదని అధికారులు సూచిస్తున్నారు.

## డాన్స్ చేస్తూ కుప్పకూలి ఇంటర్ విద్యార్థిని మృతి

**కురవి,ఫిబ్రవరి5,ప్రభాతవార్త:** మండలంలోని సీరోలు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ కళాశాలలో మంగళవారం రాత్రి పదొవతరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో సపావట్ రోజా(16) విద్యార్థిని డాన్స్ చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలింది. విషయం తెలుసుకున్న అద్యాపక బృందం సదరు విద్యార్థిని రోజాను మహబూబాబాద్ జనరల్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే విద్యార్థిని మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

## కృష్ణ, తుంగభద్ర నీటికోసం బెంగళూరు వెళ్లిన మంత్రి జూపల్లి

**హైదరాబాద్,ఫిబ్రవరి 5,ప్రభాతవార్త:** కృష్ణా,తుంగభద్ర నదులకు 6టిఎంసిల నీటి విడుదల చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు కర్నాటక రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్యను అభ్యర్థించారు. బుధవారం మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎఐసిసి కార్యదర్శి డా.సంపత్‌కుమార్ ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి,వాకిట శ్రీహరి లతో కలిసి కర్నాటక సిఎంతో బుధవారం సుదీర్ఘ చర్చలు చేశారు. తుంగభద్రనదికి ఒక టిఎంసి, కృష్ణ నదికి ఐదు టిఎంసిలు సాగుకు ఇవ్వాలని ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలకు అనివార్యమని తెలిపారు. అలంపూర్ ఆర్డిఎస్ ఆయకట్టు రైతులను ఆదుకోవడాలని సంపత్ ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కోరారు.ఐదు టిఎంసిలు కృష్ణాకు వదలడంతో గద్వాల, మక్తల్ కొల్లాపూర్, వనపర్తి రైతులకు సాగునీరు అందుతోందని సిద్దరామయ్యకు పవర్‌పాయింట్ ప్రసెంటేషన్‌తో వివరించారు. దీనితో కర్నాటక సిఎం సిద్దరామయ్య నీటి విడుదలకు సూత్రపాయంగా సమ్మతి తెలిపారు.

## ఐటి అధికారుల విచారణకు ఎఫ్‌డిసి చైర్మన్ దిల్ రాజు

**హైదరాబాద్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:** తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఎఫ్డీసీ) చైర్మన్, ప్రొడ్యూసర్ దిల్ రాజు ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు వివిధ సినిమాలకు సంబంధించిన బడ్జెట్ డాక్యుమెంట్నుు అందచేశారు. గేమ్ చేంజర్, సంక్రాంతికి వస్తున్నాం, డాకు మహారాజ్ సహా గత నెల రోజుల వ్యవధిలో విడుదలైన భారీ బడ్జెట్ సినిమాలకు సంబంధించిన వివరాలతో కూడిన డాక్యుమెంట్లను సమర్పించారు. ఐదేండ్ల ఐటీ చెల్లింపులు సహా తన ప్రొడక్షన్స్‌కు సంబధించిన ఆదాయ, వ్యయాలపై వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 3 గంటల వరకు దిల్ రాజును ఐటీ అధికారులు ప్రశ్నించారు. ఐటీ చెల్లింపుల వ్యత్యాసాలకు సంబంధించి స్టేట్మెంట్లను రికార్డ్ చేశారు. కాగా గత నెలలో పలువురు తెలుగు చలనచిత్ర పరిశ్రమకు చెందిన ప్రొడ్యూసర్స్, డైరెక్టర్లు, ఫైనాన్సియర్స్పై సోదాలు జరిగాయి. ఈ సోదాల్లో ఐటీ చెల్లింపులు, బ్యాంకు లావాదేవీల వివరాలపై ఐటీ అధికారులు ఆరా తీశారు.

## రెండున్నర కోట్ల బిసిలను అవమానించిన కాంగ్రెస్ దమ్ముంటే ఎల్బీస్టేడియంలో చర్చ పెట్టాలి : జాజుల శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 5,ప్రభాతవార్త:** అసెంబ్లీలో కులగణన పై మొక్కుబడిగా మాత్రమే చర్చ జరపడం దుర్మార్గమని రెండున్నర కోట్ల బిసిలను అవమానించేవిధంగా కాంగ్రెస్ వ్యవహరించిందని బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ఈమేరకు బుధవారం లక్డికపుల్ లోని సెంట్రల్ కోర్టులో బిసిసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశానికి రిటైర్డ్ ఐఎఎస్ అధికారి చిరంజీవులు, మాజీ బిసి కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌తో కలిసి మాట్లాడారు. ఈసందర్భంగా జాజుల మాట్లాడుతూ తెలంగాణలో కులగణన తప్పుల తడక ఉందని దీనిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడిన మాటల్లో ఒక్కటి కూడా నిజంలేదని దమ్ముంటే బిసి సంఘాలతో ఎల్బీ స్టేడియంలో చర్చకు సిద్ధమాఅని సవాల్ విసిరారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఒకటి చెప్పి ఇప్పుడు పార్టీ పరంగా 42శాతం సీట్లు ఇస్తామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. 2011లో జనాభా 3.6కోట్లు ఉంటే 14సంవత్సరాలలో దాదాపు 4.2కోట్ల వరకు పెరిగే అంచనా ఉంటే కేవలం 3.8 కోట్లుగా చూపిస్తారా మండిపడ్డారు. బిసిలు 60శాతం ఉంటే 46శాతంగా ఎలా చూపించారో అది మేము ఢిల్లీలో రాహుల్‌గాంధీ వద్దనే తేల్చు కుంటామన్నారు.

# ఇటు భద్రతా వారోత్సవాలు..అటు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు

## రోడ్డు ప్రమాదాల నివారణకు ఏవీ పటిష్ట చర్యలు?

## లక్ష్యాలను అందుకోని సర్కారు ప్రణాళిక



**హైదరాబాద్, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఓవైపు రోడ్డు భద్రతా వారోత్సవాలను పోలీసు, రవాణా శాఖలు ఘనంగా నిర్వహిస్తుంటే ఇదే సమయంలో వరుస గా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ప్రభుత్వ విభాగాల పనితీరును అపహాస్యం చేస్తున్నాయి. రోడ్డు భద్రతా వారోత్సవాలను ఘనంగా జరిపే సర్కారీ విభాగాలు ఇదే స మయంలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోక పోవడంతో వందలాది మంది ఒట్టి పుణ్యానికి ప్రాణాలు కోల్పోతుండగా వేల సంఖ్యలో ప్రయా ణీకులు క్షతగాత్రులవుతున్నారు. రోడ్డు ప్రమాదాలలో ఆర్టీసీ బస్సుల వాటా కూడా ఎక్కువవుతుండడం ఆందోళన కలిగించే అంశంగా చెప్పాలి.

రాష్ట్రంలో ఏటా నిర్వహించే రోడ్డు భద్రతా వారోత్సవాలు దండగల పండగ అన్నట్లుగా మారుతోంది. ప్రతీయేటా ఫిబ్రవరి నెలలో రోడ్డు భద్రతా వారోత్సవాలను ప్రభుత్వం అన్ని జిల్లాలలో ఘనంగా నిర్వహించడం తెలిసిందే. ఈ కార్యక్రమంలో పోలీసు, రవాణా శాఖలు కీలక భూమిక వహిస్తుండగా ఆర్టీసీ తన వంతు పాత్రను పోషిస్తోంది. ఈ వారోత్సవాలలో భాగంగా విద్యార్థులను, పాఠశాలల చిన్నారులు కూ డా పాలు పంచుకుంటున్నారంటే దీనికి ఎంత ప్రాముఖ్యత వుందో ఊహించుకో వచ్చు. రోడ్డు భద్రతా వారోత్సవాల సమయంలో రహదారి భద్రత గురించి అన్ని శాఖల అధికారులు ఘనంగా చెప్పుకుంటారు. ఇంత వరకు భాగానే వున్నా రోడ్డు భద్ర తా వారోత్సవాల అసలు లక్ష్యాలను ఏ విభాగం అధికారులు కూడా పూర్తి స్థాయిలో ప్ర జల్లో తీసుకు వెళ్లలేక పోతున్నారని చెప్పాలి. రోడ్డు భద్రతా వారోత్సవాల స మయంలో అది చేస్తాం ...ఇది చేస్తాం...అని చెప్పడం తపి ్పంచి ఆ తరువాత ఏమీ చేయడం లేదని ఆయా ప్రాంతాలో జరుగుతున్న భారీ ప్రమాదాలు బహిర్గతం చేస్తున్నాయి. వాస్తవ విషయానికి వస్తే రోడ్డు భద్రతా వారోత్సవాల అసలు లక్ష్యం రోడ్డు ప్రమాదాలను కనీస స్థాయికి తగ్గించడం. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకోవడం. ఘోర ప్రమాదాలకు కేరాఫ్‌గా మారిన జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు భ ద్రత గురించి అవగాహన కల్పించడంతో పాటు ప్రమాదాల నివారణకు ఎలా వ్యవహరించాలో చెప్పడం. ఈ మూడు అంశాలు రోడ్డు ప్రమాదాల నివారణలో కీలకంగా వున్నా వీటిపై ఏ విభాగం అధికారులు కూడా పట్టించుకోవడం లేదనే విమర్శలు వున్నాయి. ఇక రోడ్డు ప్రమాదాలకు కారణం మితిమీరిన వేగం, మద్యం తాగి వాహ నాలు నడపడం, నిద్ర లేమితో వాహనాలను నడపడం. వీటిపై వాహనదారులకు కచ్చితమైన అవగాహన కలిగించిదే 90 శాతం ప్రమాదాలను నివారించవచ్చని రవాణా రంగ నిపుణులు చెబుతున్నారు. ఇదే సమయంలో రోడ్డు ప్రమాదాలు పెరగడానికి జాతీయ రహదారులపై వున్న దాబాలలో 24 గంటలు మద్యం లభిస్తుండడం మరో కారణంగా చెప్పాలి. దాబాలలో మద్యం లభించే విషయం ఆయా ప్రాంతాల పోలీసులు, రవాణా శాఖ అధికారులకు తెలిసినా మామూళ్ల మత్తులో వారు జోగుతూ ప్ర జల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. దాబాలలో మద్యం సరఫరాపై ఉక్కుపాదం మోపిన ఏకైక డిజిపి దినేష్ రెడ్డి అని చెప్పాలి. ఆయన డిజిపిగా వున్నపుడు ఉమ్మడి ఎపిలో జాతీయ రహదారులపై వున్న అన్ని దాబాలలో మద్యం సరఫరాపై ఉక్కుపాదం మోపారు. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ, రాష్ట్రస్థాయి రహదారులపై వున్న దాదాపు అన్ని దాబాలలో మద్యం లభిస్తోందంటే అతిశయోక్తి కాదు. వరంగల్‌లో ఇనుప స్తంభాలతో వెళుతున్న లారీ ఆటోను ఢీకొనగా ముగ్గురు కూలీలు మరణించారు. ఈ లారీ డ్రైవర్ మద్యం మత్తులో పట్టపగలు లారీని నడిపి ముగ్గురి ప్రాణాలు బలిగొన్నాడు. ఈ తరహా ఘటనల్లో అధికారులు ఉదాసీనంగా వున్నంత వరకు ప్రమాదాలు ఎంత మాత్రం తక్కువ కావనేది నిర్వివాదాంశం. ఇక దీంతో పాటు రోడ్డు ప్రమాదాలు పెరగడానికి రహదారులు సవ్యంగా లేక పోవడం.రాష్ట్రంలో జాతీయ, రాష్ట్రస్థాయి రహదారులన్నీ గతుకులమయంగా మారాయి. బెంగళూరు, విజయవాడ, ముంబాయి, వరంగల్ జాతీయ రహదారులు ఇం దుకు ఓ ఉదాహరణ. ఆఖరుకు రాజధాని నగరంలోని రహదారులు కూడా గతుకుల మయంగా మారాయంటే పరిస్థితి ఎంత దరిద్రంగా వుందో ఊహించుకోవచ్చు. దీని వల్ల వాహనదారులు వేగంగా వెళుతూ ఒక్కసారిగా కిందపడిన అనుభవానికి గురవుతున్నారు. దీనిపై ఆయా ప్రాంతాల ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నా కాంట్రాక్టర్లకు ప్రభుత్వం డబ్బులు చెల్లించడం లేదు, అందుకే పనులు నిలిచిపోయాయని చెబుతున్నారు.

**ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ఎంత వరకు సురక్షితం...?**

ఆర్టీసీ బస్సుల్లో ఇటీవల కాలంలో వరుసగా ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ఎంత వరకు సురక్షితం...? అనే ప్రశ్న ఉత్పన్నమవు తోంది. ఆరేళ్ల క్రితం జగిత్యాల జిల్లా కొండగట్టు వద్ద ఆర్టీసీ బస్సు లోయలో పడిన దుర్ఘటనలో 65 మంది దుర్మరణం చెందిన ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం రేపింది. నాటి ఘటనలో ఉత్తమ డ్రైవర్‌గా ఎంపికైన బస్సు డ్రైవర్ కొండపై నుంచి బస్సును దిగువకు నడుపుతున్న సమయంలో న్యూ ట్రల్‌లో వుంచి తీసుకురావడం. అ నుకోకుండా ఎదురుగా మరో వాహనం రాగా బ్రేక్ వస్తే అది పనిచేయక పోవడంతో బస్సు ఒక్కసారిగా పల్టీకొట్టి అదిపెద్ద ప్రమా దానికి కారణమైంది. ఈ ప్రమాదం త రువాత ఆర్టీసీ అధికారులు ఇకముందు తమ బస్సులు ప్రమాదాలకు లోనవకుండా జాగ్రత్తలు తీసుకుంటామని చెప్పినా ప్రమా దాలు మాత్రం ఆగడం లేదు. అంతకు ముందు పలుచోట్ల నిద్ర మత్తులో వున్న ఆర్టీసీ డ్రైవర్లు తాము నడుపుతున్న బస్సులను ముందుగా వెళుతున్న వాహనాలను ఢీ కొని ప్రమాదాలకు కారకులయ్యారు. ఆర్టీసీ బస్సులు ఇలా వరుసగా ప్రమాదాలకు లోనవుతున్న నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు ఈ విషయంలో తీవ్రంగా దృష్టి సారించాల్సి వుంది.


తెలంగాణ ప్రభుత్వం

పురపాలక సంఘ కార్యాలయము-నాగారం, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా

నోటీసు నెం.ఇ1/ /2024-25 బహిరంగ వేలం తేది: 05.02.2025

కమిషనర్ నాగారం పురపాలక సంఘం, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వారు తమ ఆధీనంలో గల పనికి రాని పాడైపోయిన మెటీరియల్స్‌కు ఈరోజు జరిగిన బహిరంగ వేలంలో అనుకున్న విలువ రానందున తిరిగి తేదీ:10.02.2025 రోజున ఉదయం 12.30 గంటలకు కమిషనర్ గారిచే గాని లేక వారి అధికారము పొందిన వారిచే గాని బహిరంగముగా వేలము జరుపుటకు నిర్ణయించబడినది. కావున వేలములో పాల్గొనదలచిన వారు "Commissioner Nagaram Municipality" పేరు మీద రూ.1,50,000/- ధరావతు (EMD) సింగిల్ డీడీ రూపములో తేదీ: 10.02.2025 నాడు ఉదయం 11.30 గం.లోపు సమర్పించవలయును. ఇట్టి వేలం పాటకు ప్రభుత్వం వారి కనీస విలువ రూ.3,00,000/- మరియు కనీస పాట రూ.5000/- ఈ బహిరంగ వేలంలో పాల్గొను దరఖాస్తుదారులు నియమ నిబంధనలు మరియు ఇతర వివరాలకై నాగారం పురపాలక సంఘం కార్యాలయంలో కార్యాలయం పనిదినమున సంప్రదించగలరు.

DIPR.No.9980-PP/CL/Advt/1/2024-25, తేది: 05.02.2025 సం/- కమిషనర్, పురపాలక సంఘం

> మనిషి ఆకలితో ఉన్నప్పుడు, అభిమానం, కులం, విద్య, జ్ఞానం, హోదా, అనురాగం అన్నీ మర్చిపోతాడు.
>
> -అవ్వైయార్

# మృత్యు 'దారి' మారాలి..

మానవుడి సుఖానికి, సంతోషానికి అభివృద్ధి దోహదం కావాలి. సుఖం కోసమే అభివృద్ధి మార్గాలను అన్వేషిస్తాం. రోడ్లు అభివృద్ధికి సోపానాలు అనేది అందరికి తెలిసిందే. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి రహదారుల నిర్మాణానికి ముఖ్యంగా గత రెండు, మూడు దశాబ్దాలుగా అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. లక్షలాది కోట్ల రూపాయలు వ్యయం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ లెక్కల ప్రకారమే దేశంలో రహదారులు అరవైనాలుగు లక్షల కిలోమీటర్లకుపైగా ఉన్నాయి. మరికొన్ని ఇంకా నిర్మాణ దశలో కొనసాగుతున్నాయి. పూర్తయిన రోడ్లలో ఒక లక్షానలభైఆరువేల నూట నలభై ఐదు కిలోమీటర్లు జాతీయ రహదారులు, ఒక లక్షాఎనభై ఆరువేల ఐదువందలకుపైగా రాష్ట్ర రహదారులుంటే 60 లక్షల కిలోమీటర్లకుపైగా ఇతర రోడ్లు ఉన్నాయి. ఇంకా రహదారులు, వంతెనల నిర్మాణం శరవేగంగాచేస్తున్నారు. ఇవన్నీ అభివృద్ధికి ఎంతో బాటవేస్తున్నాయనే మాట వాస్తవం. కానీ మరోవైపు అభివృద్ధికి సోపానాలే మృత్యుమార్గాలు అయితే ఎవరికి చెప్పుకోవాలి? ఏమని చెప్పుకోవాలి? దేశంలో రహదారులు రక్తసిక్తం కాని రోజంటూలేదు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన మనిషి క్షేమంగా ఇంటికి వచ్చేది గ్యారంటీలేదు. అభద్రతాభావం రోజురోజుకు పెరిగిపోతున్నది. ఏ నిమిషానికి ఏమి జరుగునో అన్నట్లు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొచ్చి ప్రాణాలుపోతాయనో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. భారత్‌లో గత పదేళ్లలో దాదాపు పదిహేడున్నర లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో అసువులు బాశారు. ఇక క్షతగాత్రులైన వారి సంఖ్య లెక్కలకే అందకపోవచ్చు. నమోదైన గణాంకాలను పరిశీలిస్తే దేశంలో రోజూ పదమూడువందల అరవైకిపైగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దాదాపు నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంటుండగా ప్రతి నాలుగు నిమిషాలకు ఒక మరణం సంభవిస్తున్నది. 2022లో లక్షాఅరవై ఎనిమిదివేల నాలుగువందల తొంభైకిపైగారోడ్డు ప్రమాదాలు సంభవించగా వాటిలో అరవైఒక్కవేలకుపైగా జాతీయ రహదారులమీదనే చోటు చేసుకున్నాయి. ఇక రాష్ట్ర రహదారులపై నలభైఒక్కవేలకుపైగా ప్రమాదాలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వస్తే 2023లో పద్దెనిమిదివేల ఆరువందల ప్రమాదాలు జరగగా, ఎనిమిదివేల నూటముప్పైమందికిపైగా దుర్మరణం పాలయ్యారు. తెలంగాణలో 2023లో దాదాపు ఇరవైఒక్క వేల ప్రమాదాలు చోటుచేసుకోగా ఏడువేల మందికిపైగా మృతిచెందారు. ప్రమాదాల్లో గాయపడినవారు కొందరు అంగవైకల్యం పొంది కుటుంబానికే భారమై జీవనం సాగిస్తున్నారు. అభివృద్ధికి సోపానాలైన రోడ్లే మృత్యుమార్గాలై మానవాళిని కబళిస్తుంటే ఈప్రమాదాలను నివారించలేమా? ఇందుకు ఎవరు బాధ్యులు? లోపం ఎక్కడుందనే ప్రశ్నలకు జవాబులు అందరికి తెలిసినా ఆ కోణంలో చర్యలు తీసుకోలేకపోతున్నారు. అలాని ఏమీ చేయడంలేదనిచెప్పడంలేదు. చట్టాల మీద చట్టాలు చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపిన చోదకులకు జరిమానాలు వేస్తున్నారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన కట్టుదిట్టమైన చర్యల గూర్చి ఆదేశాలు జారీ చేస్తున్నారు. రోడ్డు, భద్రతా వారోత్సవాలను క్రమంతప్పకుండా ఘనంగా నిర్వహించుకుంటున్నారు. ఒకపక్క ఈ కార్యక్రమాలు జరుగుతుంటూనే మరొకపక్కప్రమాదాలు యధేచ్ఛగా జరుగుతున్నాయి. గతంలో ఎన్టీరామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ రోడ్డుప్రమాదాల కట్టడికి పటిష్టమైనచర్యలు తీసుకోవాలని ఆదేశించి స్వయంగా రంగంలోకి దిగినా ఏమీ చేయలేకపోయారు. స్వయాన ఆయన కార్యదర్శి విజయవాడలో ఒక రోడ్డుప్రమాదంలో మరణించినప్పుడు మొత్తం రాష్ట్ర ప్రభుత్వయంత్రాంగమే అక్కడికి కదలివెళ్లింది. ఎన్టీఆర్‌లో ఆవేశం కట్టలుతెంచుకున్నది. అప్పటికప్పుడు సీనియర్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ఈ రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన, అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో కొంతలోకొంతైనా మార్పువస్తుందని అందరూ ఆశించారు. మార్పు రాకపోగా ప్రమాదాలు మరింత పెరిగిపోతున్నాయి. ఆతర్వాత వచ్చిన పాలకులు కూడా అటు దేశవ్యాప్తంగా కానీ, ఇటు రాష్ట్రాల్లో కానీ ప్రమాదాలనివారణకు ఉపన్యాసాలుఇస్తూనే ఉన్నారు. చట్టాలుచేస్తూనే ఉన్నారు. అయినా ఇవి తగ్గడం లేదు. అధిక శాతం ప్రమాదాలు చోదకుల నిర్లక్ష్యం, తప్పిదం వల్లనే జరుగుతున్నాయని నిపుణుల అధ్యయనంలో అనేకసార్లు వెలుగుచూసింది. మరికొందరు డ్రైవర్లుమద్యం సేవించి వాహనాలు నడుపుతుండడంవల్ల కూడా ప్రమాదాల సంఖ్య పెరిగిపోతున్నాయి. మద్యాదాయమే మహాప్రసాదంగా అన్నట్లు పాలకులు జాతీయ రహదారులపై కూడా మద్యం విక్రయకేంద్రాలను అనుమతి ఇవ్వడం, ప్రమాదాలకు మరింత ఊతం ఇస్తున్నది. మద్యం వల్ల ఆదాయం వస్తుండవచ్చు. కానీ అందువల్ల జరుగుతున్న అనర్థాలను ప్రజా సంక్షేమం అని చెప్పుకునే పాలకులు పట్టించుకోకపోవడం దురదృష్టకరం. ఒక్కమాటలో చెప్పాలంటే ఆదాయం పెంచుకోవడంలో ఉన్న శ్రద్ధ, ఆసక్తి ప్రమాదాలను నివారించడంలో చూపించలేకపోతున్నారు. ఫలితంగా నిత్యం రహదారులు రక్తసిక్తమవుతున్నాయి. చేతికి అందివస్తున్న పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రుల గర్భశోకం, తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన పిల్లలు ఇలా లక్షలాది కుటుంబాల పరిస్థితి వర్ణనాతీతం. ఇదంతా పాలకులకు తెలియందికాదు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్రపాలకులు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యల చేపట్టాలి. ఆదాయమే లక్ష్యంకాకుండా మానవతా దృక్పథంతో నడుం కట్టాలి. ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం చేసినా వాహనాలు మృత్యుదేవతల్లా రోడ్లపై వీరవిహారం చేయక మానవు.

> తాను చేసిన తప్పుల పట్ల వివేకంతో కూడిన అవగాహన కలిగి ఉండటమే వివేకపు శక్తివంతమైన లక్షణం.



లారోష్ ఫోకాల్ట్

> ఘర్షణల వల్ల శక్తి వృథా అవుతుంది. హెచ్చుతగ్గులు వస్తాయి. ఆందోళనలు చెలరేగుతాయి. అశాంతి కలుగుతుంది.



ఐ.జాన్సన్

# ఆసియా దేశాలు డబ్ల్యుహెచ్‌ఓను నిలపాలి!

**ఖర్చులు తగ్గించుకొనే ప్రయత్నంలో భాగంగా హెడ్ క్వార్టర్స్ లో ఉన్న అనవసరపు ఉద్యోగస్థులను ఇతర దేశాలలో పనిలే కుండా ఉన్న వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ బ్రాంచిలను తీసివేసే కార్యక్రమం కూడా చేయకతప్పదు. నాలుగు సంవత్సరాల తర్వాత ట్రంప్ శకం అంతరిస్తుంది. మళ్లీ ఎప్పటి మాదిరే రాబోయే అధ్యక్షుడి సానుకూల నిర్ణయంతో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ స్థితిగతుల దశ తిరిగి పూర్వస్థాయికి వచ్చే అవకాశాన్ని కూడా కాదనలేం. ప్రపంచ ఆరోగ్య స్థితిగతులు, సహకారం ఏ ఒక్క దేశం మీదనో ఆధారపడకూడదు. ఆసియా, ఆఫ్రికా దేశాలు ముందుచూపుతో పరిస్థితులను చక్కదిద్ది ఈ వ్యవస్థను నిలుపుకోక తప్పదు.**



రావులపాటి సీతారాంరావు

ఆరోగ్యమే మహాభాగ్యం' అన్న తెలుగు సామెతను అమెరికా లాంటి భాగ్య దేశాలు అపహాస్యం చేస్తున్నాయా ఆరోగ్యాన్ని అన్న సందేహం యు.ఎస్.ఏ వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యుహెచ్‌ఓ) వ్యవస్థనుంచి తప్పుకోటాన్ని చూస్తే అనిపిస్తుంది. ట్రంప్ అధ్యక్షుడు అయిన తర్వాత ఎన్నో దురుసు నిర్ణయాలు తీసుకున్నారు. అందులో డబ్ల్యుహెచ్‌ఓ నుంచి అమెరికా తప్పుకుంటున్నదని ప్రకటించడం ప్రముఖమైన నిర్ణయంగా చెప్పుకోవచ్చు! అంతకు పూర్వం కూడా ఆయన మొదటి టర్మ్‌లో కోవిడ్ సమయంలో అలాంటి నిర్ణయమే తీసుకోవటం చాలామంది మర్చిపోలేదు. కారణాలు ఏమి చెప్పినా ధనం దేశానికి అయినా వ్యక్తికయినా అహం వీసమెత్తయినా కలిగేట్లు చేస్తుంది. ఇప్పుడున్న పరిస్థితులలో అమెరికా దేశంలోని భాగ్యం తరిగిపోతున్నదని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. అందుకోసమే ట్రంప్ రాగానే ఆ పరిస్థితినుంచి దేశాన్ని రక్షించుకోటానికి ఎగ్జిక్యూటివ్ నిర్ణయాల పేరిటసమూలంగా కొన్ని వ్యవస్థలను కదిలించే ప్రయత్నం చేశారు. వరల్డ్‌హెల్త్ ఆర్గనైజేషన్‌లోకి అమెరికా ట్రంప్‌పదవినుంచి దిగిపోయి బైడెన్‌రాగానే మళ్లీచేరటం అప్పట్లో ప్రపంచ ఆరోగ్యసంస్థలకు శుభసూచకంగా భావించారు. కానీ ట్రంప్ పదవిలోకి రాగానే తన ప్రతాపం ప్రపంచానికి మరొక్కసారి చూపించారు. అసలు కారణం అమెరికా ఆర్థిక పరిస్థితి అని కొందరు ఆర్థికవేత్తలు భావిస్తున్నారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ మూలాల్లోకి వెళ్తే ఈ సంస్థ ఆర్థిక స్థితిగతులు గురించి చెప్పుకోక తప్పదు. రెండు విధాలుగా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ నడపటానికి డబ్బు సమకూర్చటం జరుగుతున్నది. మొదటిది నిర్ణీత విరాళాలు దీనినే ఎసెస్డ్ కంట్రిబ్యూషన్ అని కూడా అంటారు. ప్రతి సభ్య దేశం యేడాదికొకసారి మెంబర్‌షిప్ ఫీజ్ ఈ ఆర్గనైజేషన్‌కు చెల్లించాలి. ఈ మధ్యకాలంలో అమెరికాను ఇబ్బందిపెట్టున్నా సమస్య ఇదే. ఇతర దేశాలతో పోల్చుకుంటే అమెరికా ఇచ్చే డబ్బు (ఫీజ్ రూపంలో) చాలా ఎక్కువ అని ఆ దేశం భావిస్తున్నది. ప్రస్తుతం ఉన్న ఆర్థిక సమస్యలను అధిగమించడానికి ఇంత పెద్ద మొత్తంలోవరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్‌కు ఎసెస్డ్ కంట్రిబ్యూషన్ ఇవ్వడం కుదరదు అన్నట్లుగా ట్రంప్ భావిస్తున్నారు. దీనినే ముఖ్యకారణంగా ట్రంప్ విత్ డ్రాయల్ సమయంలో ప్రకటించారు కూడా. అయితే దేశాలు యేడాదికొకసారి కచ్చితంగా ఫీజ్ రూపంలో వచ్చే డబ్బు వల్ల ఉద్యోగస్థుల జీతాలు సంస్థను నడపడానికి అవసరమైన ఖర్చులను భరించే వీలు కుదురు



తుంది. మరొక విధానం వల్ల కూడా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్‌కు డబ్బు సమకూరుతుంది. అది వలంటరీ కంట్రిబ్యూషన్ వల్ల! మొదటి విధానాన్ని ఎ.సి అని (ఎసెస్డ్ కంట్రిబ్యూషన్) రెండవ దానికి వి.సి అని (వాలంటరీ కంట్రిబ్యూషన్) షార్ట్‌ఫాంలో, డబ్బు పొందే విధానాన్ని వర్ణించటం జరుగుతుంది. ఆర్థికంగా పెద్దస్థాయిలో ఉన్న డోనర్స్, మెంబర్స్‌గా ఉన్న దేశాలు కూడా ఇష్టపూర్వకంగా, పనితీరును మరింత మెరుగుపర్చడానికి సమకూర్చే ఫండ్స్‌ను వి.సిగా పిలుస్తారు. అయితే ఈ డబ్బు నిర్ణీత కార్యక్రమాలకోసం టైంతో నిమిత్తం లేకుండా అప్పుడప్పుడూ మనకూరే డబ్బు అవటంవల్ల విధాయకంగా వస్తుందని అనుకోవటంకుదరదు. ఉదాహరణకు పోలియో నివారణ నిమిత్తం, వ్యాధిగ్రస్తుల రక్షణకోసం, ప్రాథమిక ఆరోగ్యభద్రత కోసం విరాళాలరూపంలో దేశాలు, డోనర్లు సమకూర్చే డబ్బుకావడం వల్ల విధాయకంగా జరిగే హెల్త్ కార్యక్రమాలను డబ్ల్యుహెచ్‌ఓ దీని మీద ఆధారపడి ఆర్థిక వనరుల వెసులు బాటును పరిగణనలోకి తీసుకోదు. అయితే అమెరికా ఈ వ్యవస్థ నుంచి తొలగిపోయే నిర్ణయం తీసుకోవటంతో వి.సి విధానం కూడా దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. చాలా మంది అమెరికాకు సంబంధించిన డోనర్ల సహాయం తరిగిపోవచ్చు. అసలు రాకుండానుపోవచ్చు. ఉదాహరణకు ఎప్పుడూ ఉండే యుయస్ ఎయిడ్ కూడా డోలాయమాన పరిస్థితిలో సహాయం సమకూర్చలేకపోవచ్చు. యు.యస్.ఏ విత్ డ్రాయల్ వల్ల ఆర్థికంగా వరల్డ్‌హెల్త్ ఆర్గనైజేషన్‌కు సంకట పరిస్థితులు ఏర్పడే ప్రమాదం హెచ్చుగాఉంది. ఇలాంటి పరిస్థితులలో ఆసియా దేశాలు యూరప్‌దేశాలు ముఖ్యంగాఇండియా, బ్రెజిల్, దక్షిణ ఆఫ్రికా, థాయ్‌లాండ్, ఈజిప్ట్ లాంటి దేశాలు వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్‌కు అక్కరకు రావాలి. పూర్తి సహకారం అందివ్వాలి. యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్ కూడా ముందుకు వచ్చి దేశాలకు మార్గదర్శకంగా ఆర్థిక వనరులు సమకూర్చే విధంగా ఉండకతప్పదు. ఆసియా, ఆఫ్రికా దేశాలలో ఆరోగ్యసమస్యలు హెచ్చుస్థాయిలో ఉన్నాయి. ఇప్పటి వరకూ డబ్ల్యుహెచ్‌ఓ ఇలాంటి సమస్యలను తొలగించే విధానంతో పనిచేయడం వల్ల ఈ దేశాలు డబ్బుతక్కువగా సమకూరుస్తున్నప్పటికీ కావల్సిన సహాయ సహకారాలు లభించడం జరుగుతున్నది. తక్షణ చర్యలు తీసుకోకపోతే ఆరోగ్య పరంగా ఎదుర్కోవాల్సిన ఇబ్బందులతోపాటు అందుతున్న సహాయం కుంటుపడే ప్రమాదం కూడా ఉంది. ఖర్చులు తగ్గించుకొనే ప్రయత్నంలో భాగంగా హెడ్ క్వార్టర్స్‌లో ఉన్న అనవసరపు ఉద్యోగస్థులను ఇతర దేశాలలో పనిలేకుండా ఉన్న వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ బ్రాంచిలను తీసివేసే కార్యక్రమం కూడా చేయకతప్పదు. నాలుగు సంవత్సరాల తర్వాత ట్రంప్ శకం అంతరిస్తుంది. మళ్లీ ఎప్పటి మాదిరే రాబోయే అధ్యక్షుడి సానుకూల నిర్ణయంతో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ స్థితిగతుల దశ తిరిగి పూర్వస్థాయికి వచ్చే అవకాశాన్ని కూడా కాదనలేం. ప్రపంచ ఆరోగ్య స్థితిగతులు, సహకారం ఏ ఒక్క దేశం మీదనో ఆధారపడకూడదు. ఆసియా, ఆఫ్రికా దేశాలు ముందు చూపుతో పరిస్థితులను చక్కదిద్ది ఈ వ్యవస్థను నిలుపుకోక తప్పదు. ●

# మరణశిక్ష ఎంతవరకు సబబు!

కిరణ్ ఫిషర్

ప్రాచీన కాలం నుండి రాచరిక వ్యవస్థ వరకు, మధ్యయుగం నుండి నేటి ఆధునిక కాలం వరకు రాజ్యంలో న్యాయ వ్యవస్థలో వివిధ రకాలుగా ఆ రోజుల్లో నేరస్తులను ఆయా కాలాలకు అనుగుణంగా తీర్పులు ఇచ్చి శిక్షలు విధించే న్యాయపాలన నడుస్తోంది. నేటి ఆధునిక కాలంలోకూడా మరణ శిక్ష భారత దేశంలో అవసరమేనా అనే విషయంపై చర్చ కొనసాగుతున్నదే. దేశ న్యాయ వ్యవస్థలో తప్పు చేస్తే దండించడానికి ప్రభుత్వమే చట్టాలకు రూపకల్పన చేసింది. భారత దేశంలో బ్రిటిష్ వాళ్ల పాలిస్తున్న రోజుల్లో వారు కొన్ని క్రిమినల్ చట్టాలు చేశారు. అందులో ఇండియన్ పీనల్ కోడ్ 1860 ( భారతీయ న్యాయ సంహిత 2023) ప్రకారం ఎవరైనా తప్పు చేస్తే కేసులు నమోదు చేసి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ప్రకారం 1973 (భారతీయ నాగరిక్ సురక్ష్ సంహిత 2023) ఆయా తప్పులకు శిక్షలు విధిస్తుంటారు. అయితే ఇందులో కూడా కొన్ని కేసులకు మాత్రమే మరణ శిక్ష విధించే అవకాశం ఉంటుంది. అందులో చూస్తే సెక్షన్స్, 120బి,121, 132, 194, 302, 303, 305, 354ఎ, 376ఎ, అలాగే 31ఏ నార్కోటిక్స్ డ్రగ్స్ వంటి చట్టాల్లో కూడా శిక్షలు విధించే అవకాశం ఉంది. వాస్తవానికి మరణ శిక్ష అనేది కేవలం కొన్ని నేరాలకు మాత్రమే ఉంది. మరణ శిక్ష విధింపు వల్ల నిందితునిల్లో పరివర్తన కలిగి కొన్ని నేరాలు తగ్గుతాయనే న్యాయ వ్యవస్థ, ప్రజలు నమ్ముతారు. అయితే గతంలో మనం చూశాం ఢిల్లీలో జరిగిన నిర్భయ కేసులో వాళ్లకు శిక్ష ఖరారు చేసిన వెంటనే మరో పక్క తెలంగాణలో దిశ అనే రేప్ కేసు నమోదై అతి కిరాతకంగా చంపారు. వాళ్లను పోలీసులు ఎన్కౌంటర్‌లో చంపే విషయం మనకు తెలిసిందే. అయితే ఇటీవల కాలంలో కూడా బెంగాల్‌లో మెడికల్ విద్యార్థి పైన కూడా రేప్ చేసి మరీ చంపిన ఘటన మనం చూసాం, ఇలా చెప్పుకుంటూ పోతే దేశవ్యాప్తంగా చాలానే ఉన్నాయి. అయితే మరణ శిక్ష విధించిన మాత్రాన నేరస్తుల్లో ఎంతవరకు పరివర్తన కలుగుతుందో చెప్పలేం. అలాంటి తీవ్రమైన కేసులో మరణ శిక్ష కంటే యావజ్జీవ కారాగార శిక్ష విధించే విధానం చేయాలి. దేశంలో ఎంతోమంది న్యాయ నిపుణులు, మేధావులుసైతం మరణ శిక్షను విభేదించారు. గతంలోచూస్తే 262వ లా కమిషను రిపోర్ట్ 2015లో కూడా స్పష్టంగా చెప్పింది. మరణ శిక్ష కేవలం టెర్రరిజం వంటి కేసులలో మాత్రమే విధించాలని సూచించింది. అదేవిధంగా ప్రభుత్వాలు కూడా కొన్ని సంస్కరణలు చేయాలి అని తెలిపింది. అందులో పోలీస్ సంస్కరణలు, సాక్షులను రక్షించే చర్యలు, బాధితులకు నష్ట పరిహారం వంటివి తేవాలని సూచించింది. అయితే సుప్రీం కోర్టు కూడా అతికొద్ది కేసులకు మాత్రమే శిక్షను ఖరారు చేయాలని చెప్పింది. అయితే కమిషను సైతం మరణశిక్ష రద్దుపై ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి నిర్ణయం తీసుకోవాలి అని గతంలో తెలిపింది. ఇది జీవించే హక్కుకు విరుద్ధం అని తెలిపింది. ప్రపంచ దేశాలలో చూస్తే 1960 దశకంలో"ఇంటర్నేషనల్ కోవెనేంట్ సివిల్ పొలిటికల్ రైట్స్" వంటి సంస్థ మరణ శిక్ష రద్దు గురించి గ్లోబల్ లెవల్‌లో ప్రయత్నాలు చేస్తూనే ఉంది. యునైటెడ్ జనరల్ అసెంబ్లీ ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కుల రక్షణ కొరకు 2007 నుండి 2018 వరకు రిజల్యూషన్ తీసుకుంటూనే ఉంది. అయితే 2007లో యూఎన్‌లోకూడా భారత్ మిగతా కొన్ని దేశాలు ఇంకా రద్దు చేయలేదు. ఇందులో అమెరికా కూడా ఉంది. అంటే దాదాపు ప్రపంచవ్యాప్తంగా చూస్తే 70 శాతం మేర మరణ శిక్షను రద్దుచేసింది. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ 2020 ప్రకారం 108దేశాలు మరణ శిక్షను రద్దు చేసినట్లు వెల్లడించింది. గత పదేళ్లుగా 28 దేశాలు వాస్తవానికి రద్దు చేశాయి. కానీ ఇంకా అవిఅమలుకు నోచుకోలేదు. ఇంకా 55 దేశాలు తేలికపాటి కేసులకు సైతం మరణ శిక్ష విధిస్తోంది. అయితే మరణ శిక్ష విధిస్తున్న దేశాలలో ఇండియా, చైనా, బంగ్లాదేశ్, ఈజిప్ట్, ఇండోనేషియా, సౌదీఅరేబియా, సౌత్ కొరియా, ఇరాన్, జపాన్, శ్రీలంక, తైవాన్, అమెరికా, ఇథియోపియా, నైజీరియా, వంటి దేశాలున్నాయి. నిజానికి మరణ శిక్ష అంతిమ శిక్షకాదు, అయితే నేరంచేసిన వ్యక్తులకు జీవితాంతం కఠిన కారాగారశిక్ష విధించి ఎలాంటి "పెరోల్" అవకాశం లేకుండాచేయాలి. అతడు సహజ మరణంపొందే వరకు అక్కడే ఉంచాలి. అయితే అదేవిధంగా నేరస్థులను మార్చే ప్రయత్నంచేయాలి. నేరస్తులను వారివారి వృత్తులరీత్యా వాడుకొని వాళ్ల సత్ప్రవర్తకులుగా మారే అవకాశాలు కల్పించాలి. శిక్షను పొడిగిస్తూ ఉండాలి. కొన్నిఏళ్ల నుండి వస్తున్న మరణశిక్షకు బదులు యావజ్జీవ శిక్షను చేర్చాలి. టెర్రరిజం వంటి కేసుల్లో మరణశిక్షను విధించే విధంగా చేయాలి. కొన్ని కేసుల్లో మాత్రమే మరణ శిక్షను విధించాలి. మిగతా వాటికి వేరే ప్రత్యామ్నాయం వెతకాలి. దీనిపై ప్రభుత్వం, మేధావులు, న్యాయనిపుణులు, ప్రజలందరూ చర్చించాలి. మరణ శిక్షకు బదులు యావజ్జీవ కారాగారశిక్షను విధించడమే మేలు. ●

# ప్రజావాక్కు



## పేట్రేగిపోతున్న అవినీతి

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ శాఖల్లో అవినీతి పెట్రేగిపోతుంది. ఏ కార్యాలయం వెళ్లిన లంచం ఇవ్వనిదే పని కావడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఒక్క జనవరి నెల లోనే ఇరవై మంది ఏ.సి.బి కి చిక్కడం సంచలనం సృష్టించింది. ప్రజలతో నేరుగాసంబంధం ఉండే రెవెన్యూ, మున్సిపల్, విద్యా, ఆర్థిక, పశుసంవర్ధక, పోలీస్, పంచాయతీరాజ్‌శాఖల్లో అవినీతి ఎక్కువగాఉన్నట్లు తెలుస్తుంది. కొంత మంది లంచావతారులు చేతికి మట్టి అంటకుండా ప్రైవేట్ వారిని నియమించుకుని లంచాలకు మరిగినారు. ప్రజల్లో అవినీతి మీద అవగాహన పెరిగిన మార్పు రావడం లేదు. సోషల్ మీడియాలో కూడా ఏ.సి.బి కి పలు ఫిర్యాదులు అందుతున్న లంచాలు తగ్గడం లేదు. అవినీతి అధికారులు ఇకనైనా మారండి. ప్రజలకు అవినీతి రహిత సేవలు అందించాలని పౌర సమాజం కోరుతుంది.

-కామిడి సతీష్ రెడ్డి జయశంకర్ భూపాలపల్లి జిల్లా

## దివ్యాంగులకు ప్రత్యేక స్థానం

జాతీయఅవార్డులలో దివ్యాంగులకు ప్రత్యేకస్థానం కల్పించాలి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పద్మశ్రీ, పద్మభూషణ్ వంటి జాతీయ స్థాయి అవార్డులలో దివ్యాంగులకు ప్రత్యేకమైన స్థానంకల్పించాలి. వివిధరంగాలలో నైపుణ్యం కలిగిన వారిని గుర్తించి ప్రోత్సహించడం ద్వారా దివ్యాంగులను చైతన్య పరిచిన వాళ్లం అవుతాం. అవార్డులు ప్రకటించడంద్వారా వారిలో కూడా ఆత్మస్థైర్యం పెరిగి పోటీతత్వం ఏర్పడి అన్ని రంగాలలో వారు రాణించగలరు. గతంలోఉన్న అవార్డులను కూడా కేంద్ర ప్రభుత్వం తగ్గించిందని వారి వాదన. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని దివ్యాంగులకు జాతీయ అవార్డులలో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకమైన స్థానం కల్పించాలి.

-మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

## వేతన జీవికి ఊరట

ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్రబడ్జెట్ వేతన జీవులకు ఊరట కలిగించింది. ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని రూ.7లక్షలనుండి రూ.12లక్షల వరకు పెంచారు, దీంతో మధ్యతరగతి వర్గాలకు ఆర్థిక ఉపశమనం లభించనుంది. రూ. 12 లక్షలకు మించిన పెట్టుబడులకు అవకాశం ఉంది. ఉపాధి అవకాశాలు కూడా పెరగవచ్చు.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## హత్యల్లో వినూత్న పద్ధతులు

ఈ మధ్య హత్యలు వినూత్న పద్ధతులను సంతరించుకుంటున్నాయి. ఒకాయన భార్యను చిత్రహింసలుపెట్టి చంపేసి ముక్కలు ముక్కలు చేసి కుక్కర్లో ఉడక పెట్టేసి, ఆ తరువాత ఆ ముక్కల్ని ఎండ పెట్టి రోట్లో వేసి మొత్తగా దంచేసి ఆ పొడిని ఓ బకెట్లో నింపి ఓ చెరువులో కలిపేసాడట. అయ్య బాబోయ్ అంత ఓపిక అంత కసిని ఏలా పెంచు కున్నాడో. పోలీసులే ఇంతవరకు ఇలాంటి కేసును చూడలేదని అమితాశ్చర్య పోయారట. ఈ హత్యలు దృశ్యం సినిమాను మించిపోయాయి. సెల్ ఫోన్లలో రకరకాల హత్యా పద్ధతులను చూసి ఇటువంటి దుర్మార్గాలకు పాల్పడుతున్నారు. నీతి నియమాలు కడగంటి పోతున్నాయి. మానవత్వం రానురాను మృగ్యమైపోతోంది.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## పనుల వేగం పెరగాలి!

రాష్ట్ర రాజధాని అమరావతికి 57 కిలో మీటర్ల రైలు మార్గం నిర్మాణం పూర్తి కావడానికినాలుగు సంవత్సరాలు పడుతుందని రైల్వేశాఖ ప్రకటించింది. 57కిలోమీటర్ల మార్గానికి అంతసుదీర్ఘ కాలం పట్టడం ఆశ్చర్యంగా ఉంది! వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే ముఖ్యమంత్రి బుల్లెట్ ట్రైన్ అంటూ ప్రకటనలు చేయడం విడ్డూరంగాఉంది! నిజానికి ఈ ప్రతిపాదిత మార్గం ఒక రైలు మార్గం నుంచి మరో మార్గానికి అనుసంధానించడమే, అదీ పూర్తిగా మైదాన ప్రాంతం! ఒక్క కృష్ణానదిపై రైల్వే బ్రిడ్జి తప్పితే మిగిలిన పనులు ఒకటి, రెండు సంవత్సరాల్లో పూర్తి చేయవచ్చు! రైల్వేబ్రిడ్జి కూడా ఇప్పుడు మొదలుపెడితే రెండు సంవత్సరాల్లో పూర్తిచేయవచ్చు? భూసేకరణ ఇప్పటికే ప్రారంభం అయింది. నిర్మాణ పనులను విభజించి టెండర్ల ప్రక్రియ పూర్తి చేయడానికి కాలయాపన చేయడం తగ్గించి పనుల్లోవేగం పెంచితే రెండుసంవత్సరాల్లో పూర్తిచేయవచ్చు. ప్రజాప్రతినిధులు, రాష్ట్రప్రభుత్వం రైల్వేశాఖపై పనులవేగానికి ఒత్తిడి పెంచాలి !

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు,ఏలూరు జిల్లా

## వాట్సాప్ పాలన తేవాలి

ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని దేశంలో మొదటిసారి వాట్సాప్ పాలన తీసుకొచ్చారు. అందుకు అవసరమైన అన్ని రంగాలతో కూటమి ప్రభుత్వం కలగలిసి ఆ సేవలను అందిస్తోంది. ఇదిముమ్మాటికీ హర్షణీయం. ప్రజలకు ఎంతో మేలు చేస్తుంది. ఈరకమైన సేవలద్వారా ప్రజలవిలువైన సమయం, ధనం ఆదా అవుతుంది. కావునా తెలంగాణాలో వాట్సాప్ పాలన తేవాలి.

-శ్రిష్టి శేషగిరి, సికిందరాబాద్

మనవి: ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ఆదివాసీ సంపద దోపిడి ఆగేదెప్పుడు?

పి.అప్పలనర్స

జమ్మూకాశ్మీర్ 370 ఆర్టికల్‌ను ఎలా తొలగించారో అలానే 18 రాష్ట్రాల్లో వున్న 5,6వ షెడ్యూల్డ్‌లను తొలగించడానికి కేంద్ర ప్రభుత్వం వ్యూహాన్ని ఖరారు చేసింది. అభివృద్ధి పేరిట షెడ్యూల్డ్ ప్రాంతాల్లో వున్న ప్రత్యేక రాజ్యాంగ హక్కులను, చట్టాలను బలహీనపర్చే చర్యలకు ఉపక్రమించింది. ఆధునిక సమర్థవంతమైన మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయడం, విదేశీ మూలధనం కోసం కొత్త రంగాలను ప్రారంభించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని వరల్డ్ బ్యాంక్ నిర్వహించిన డూయింగ్‌లో పేర్కొన్నది. 2022 నాటికి తయారీ రంగంలో 25 శాతానికి జీడిపి చేరుకుంటుందని అంచనా వేసినప్పటికీ 2023-2024లో 15.9 మించి పెరగకపోవడంతో ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను వేగవంతంగా అమలు చేస్తూ దేశ సహజ సంపదను కార్పొరేట్లకు అప్పణంగా అప్పగించింది. పరిశ్రమలు ప్రైవేట్‌పరం చేయడం, ఎస్ఐ పేరుతో భూములు అప్పగించడం, ఇండస్ట్రీయల్ కారిడార్ పేరుతో ఔషధ పరిశ్రమలకు సముద్రపరివాహక ప్రాంతాలను అప్పగించారు. ఇక మిగిలింది అటవీ ప్రాంతాలే. భారతదేశంలో 15 శాతం భూభాగంలో 5 శాతం మంది అదివాసీ ప్రజలు 8, 6వ షెడ్యూల్డ్ ఏరియాలల్లో 705 తెగల వారు నివసిస్తున్నారు. గణనీయమైన ఎస్టీ జనాభా కలిగిన ఒరిస్సా, చత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలల్లో 70 శాతం బొగ్గు, 50 శాతం ఇనుము, 60 శాతం బాక్సైట్, 100శాతం గ్రానైట్ మొదలగు ఇతర ఖనిజాలున్నాయి. సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్ కేంద్రం లెక్కల ప్రకారం ఖనిజాలను ఎక్కువ ఉత్పత్తి చేసే జిల్లాలలో సగం గిరిజన జిల్లాలే. ఈజ్ ఆఫ్ డూయిండ్ బిజినెస్‌కు ఆదివాసీల హక్కులు, చట్టాలు అడ్డంగా వున్నందున వాటిని బలహీనపర్చాలనే ఆలోచనతో కేంద్ర సర్కార్ సిద్ధమైంది. వీటికోసం కొన్ని రాష్ట్రాలను ప్రత్యేకంగా కేంద్రీకరించి జమ్మూకాశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు, మణిపూర్లో కుకీలు, మైతీలు మధ్య చిచ్చు, తెలుగు రాష్ట్రాల్లో జి.ఓ నెం.3ని (నూరుశాతం ఉద్యోగ రిజర్వేషన్) ను సుప్రీంకోర్టు ద్వారా రద్దు చేయించడం, ఆదివాస్ తెగల మధ్య మతచిచ్చు, తెగల అస్తిత్వాన్ని, సంసృతిని దెబ్బతీసే సనాతన ధర్మం ప్రచారం, బలహీనవర్గాల ఆత్మాభిమానాన్ని, మనోభావాలను దెబ్బతీయడానికి డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను తీవ్రంగా అవమానించడం మొదలగు ప్రయత్నాలన్నీ కార్పొరేట్లకు అడవిని సులభంగా అప్పజెప్పేందుకే. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం అడుగుల్లో మడుగులొత్తుతూ ఈజ్ ఆఫ్ డూయిండ్ బిజినెస్‌ను వేగవంతంగా అమలుచేసి స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబులు 2047 విజన్‌ను ప్రకటించారు. దీనికోసం ప్రపంచవ్యాప్తంగా వున్న తెలుగు వాళ్ల పి 4 (పబ్లిక్ (ప్రైవేట్ ప్రజలు పార్టిస్పెషన్) విధానంలో భాగస్వాములను కావాలని చంద్రబాబుగారు పిలుపు ఇవ్వడంతో జనవరి27న విశాఖపట్నంలో ప్రపంచ ప్రాంతీయ పెట్టుబడుల సదస్సును రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించి ఎజెన్సీప్రాంతంలోటూరిజం అభివృద్ధి, పర్యాటకులకు మౌలిక సదుపాయాలు కల్పించుటకు 1/70 చట్టాన్ని సవరించాలని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న



పాత్రుడు వ్యాఖ్యానించడం శోచనీయమైనది. రాజ్యాంగ విరుద్ధమైనది. స్పీకర్‌వ్యాఖ్యలపై నేటికి రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో ఆదివాసీలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. చిత్తశుద్ధి వుంటే ఐటిడిఏ ద్వారా చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటుచేసిఉపాధి, నూరుశాతం రిజర్వే షన్ను పునరుద్ధరించి ఉద్యోగవకాశాలు కల్పించాలి. 200 సంవత్సరాలకు పైబడి ఆదివాసీల భూరక్షణ, ఆదివాసీ స్వయంపాలిత కోసం రక్తంచిందించిన పోరాటాల ఫలితంగా భారత రాజ్యాంగంలోని 10వ భాగంలో పేర్కొన షెడ్యూల్డ్ ఆదివాసీప్రాంతాలను ఆర్టికల్ 244, 244 (ఎ) ప్రకారం 5,6వ షెడ్యూల్డ్ 1950 రాజ్యాంగంలో నిర్మాణమైంది. 5వ షెడ్యూల్డ్ పేరా 1లో చాలా స్పష్టంగా షెడ్యూల్డ్ ఏరియాలో ఉద్యోగాలు, అభివృద్ధి, రాజ్యాధికారం మొదలగు అంశాలపై ఆదివాసీలకు స్వతంత్రాలు దాఖలైంది. అమలు కాని తెలుగు రాష్ట్రాల్లో శ్రీకాకుళం ఆదివాసీ రైతాంగపోరాట ఫలితంగా ఆంధ్రప్రదేశ్ భూబదలాయింపు నిషేధిత, నియంత్రణ 1970 చట్టం అమలులోకి వచ్చింది, క్లాజ్ 3 ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గిరిజనేతరులకు స్థిర నివాసం, స్థిరా స్తులు కలిగివుండటం రాజ్యాంగ విరుద్ధం. అయినప్పటికీ వారికే ఉద్యోగాలు కల్పించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం రాజ్యాంగ ధిక్కరణ కాదా? 5వ షెడ్యూల్డ్ ప్రాంతం ఆర్టికల్ 244 క్లాజ్ 1, క్లాజ్ 2 ప్రకారం స్వయం పాలన అమలులో వున్న ప్రాంతాల్లో బయట వాళ్లకు పాలించే అధికారంవుందని న్యాయ స్థానాలు, పాలకులు ఎలా అంటారు.? 1996 సమత వర్సెస్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తీర్పు ద్వారా షెడ్యూల్డ్ ఏరియాలో రాష్ట్ర ప్రభుత్వం మైనింగ్ తవ్వకాలకు అను మతి లేదని సుప్రీంకోర్టు పేర్కొన్నది. "ఆదివాసీలదే ఈ దేశం' అనే ప్రస్తావనతో కైలాస్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో జస్టిస్ మార్కండేయ ఖట్జూ, జ్ఞానసుధా మిశ్రాల తీర్పు కానీ, సర్వాధికారాలు పెసా గ్రామ సభలదే అన్నా ఒరిస్సా తీర్పు వంటివి అనేకం వునప్పటికీ వాటిని పరిగణించకుండా టూరిజం అభివృద్ధి పేరుతో ప్రైవేట్ కంపెనీలకు భూమి అప్పగించడమే అవుతుంది తప్ప ఇది ఆదివాసీ అభివృద్ధి ఎలా అవుతుంది. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో వలసలు వచ్చిన గిరిజనేతరుల సమాజాన్ని పావుగావాడి ఆదివాసీ ప్రాంతాల ధ్వంస రచనకు వ్యూహంగా కనిపిస్తుంది. ఏజెన్సీ ప్రాంతంలో లాడ్జిలు, రిసార్టు, భవనాలు, హోటల్స్, భూములన్నింటిలోనూ అమాయక ఆదివాసీలను, రాజకీయ నిరుద్యోగులను బినామీలుగా మార్చి ఏజెన్సీప్రాంతంలో పెట్టుబడిదారీ విధానాన్ని ప్రభుత్వం అమలుచేస్తుంది. ఎస్‌డిసి వ్యవస్థను నిర్వీర్యం చేయడం, టూరిజం, పోలవరం, ఆయుధ కర్మాగారం, జాతీయ పారజాతీయ రహదారురులు, హైడ్రోపవర్‌ప్రాజెక్టు పేరుతో 1/70 చట్టాన్ని ప్రభుత్వం ఉల్లంఘిస్తుంది. నాగిరెడ్డి వన్మెన్ కమీషన్ ఉత్తర్వులు ప్రకారం ఏజెన్సీ పంచాయితీల ఇవ్వవలసిన25శాతం నిధులు కూడా టూరిజంశాఖ చెల్లించడంలేదు, చట్టాలను అమలు చేయవలసిన అధికారులే రిసార్టు, లాడ్జిలు నిర్మిస్తున్నారు. గిరిజన హక్కులు, చట్టాలు రక్షణకై గిరి జన సంఘం అగ్రభాగన వుంది. సరళీకరణ ఆర్థిక విధానా లు అమలైనప్పటి నుంచి అటవీ సంపదపై కార్పొరేట్ల కన్నుపడింది. బాక్సైట్ తవ్వకాల కోసం 1/70 చట్టాన్ని సవరించాలని గిరిజన సలహా మండలి (టిఏసీ)లో 2002 సంవత్సరంలో తీర్మానం పెట్టగా నాటి సిపిఎం పార్టీ భద్రాచలం ఎమ్మెల్యే మాత్రమే తీవ్రంగా వ్యతిరేకించారు. పెద్దఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహించగా ప్రభుత్వం వెనుకడుగేసింది. 1/70 చట్టం న్యాయ సమీక్షకు అతీతంగా భారత రాజ్యాంగం 9వ షెడ్యూల్లో పొందుపర్చబడింది. అయినప్పటికీ చట్టాన్ని సవరించాలని నేటిఅసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించడం వెనకాల అనకాపల్లి జిల్లా కాల్సైట్ మైనింగ్ వుంది. ఇదివరకుపాలకవర్గాలు బినామీ పేర్లతో దోచుకుంటున్నారు. నేడు టూరిజం అభివృద్ధి పేరుతో 1/70చట్టాన్ని సవరించాలనే కుట్రవెనుకాల ఆదివాసీ సంపదను కొల్లగొట్టడమే. కుట్రలను ఛేదించడానికి హక్కుల సంఘాలు, ప్రజా సంఘాలు, దళిత వర్గాల ప్రజానీకం ఆదివాసీ పక్షాననిలవాలి. ఆదివాసీ మేధావులు ఐక్యఉద్యమాన్ని ప్రోత్సహించాలి. పోరాటమే ఆదివాసీలకు రక్షణ కవచం. ●

# మెరుగైన రేపటి కోసం బడ్జెట్




## మునుపెన్నడూ లేని విధంగా మధ్యతరగతి సాధికారత

ఆదాయపు పన్ను లేదు: సంవత్సరానికి రూ.12 లక్షల వరకు మరియు జీతం కలిగిన తరగతికి సంవత్సరానికి రూ.12.75 లక్షల వరకు ఆదాయం (రూ.75,000 స్టాండర్డ్ డిడక్షన్‌తో సహా)

పన్ను చెల్లింపుదారులు ఇప్పుడు రెండు స్వీయ-ఆక్రమిత ఆస్తులకు NIL వార్షిక విలువను క్లెయిమ్ చేయవచ్చు.

అప్‌డేట్ చేయబడిన రిటర్న్‌ను ఫైల్ చేయడానికి వ్యవధి 24 నుండి 48 నెలలకు పొడిగించబడింది.

నేషనల్ సేవింగ్స్ స్కీమ్ (NSS) ఉపసంహరణలు 29 ఆగస్ట్, 2024 తర్వాత చేసిన డిపాజిట్లపై పన్ను రహితంగా ఉంటాయి.

NPS ఖాతా వంటి పన్ను ప్రయోజనాలను పొందడానికి NPS వాత్సల్య సహకారాలు.

## TDS/TCS నియమాలలో ఉపశమనం

సీనియర్ సిటిజన్లకు వడ్డీపై పన్ను మినహాయింపుల పరిమితి రూ.50,000 నుండి రూ.1 లక్షకు రెట్టింపు చేయబడుతుంది.

అద్దెపై TDS కోసం వార్షిక పరిమితి రూ.2.40 లక్షలు ఇప్పుడు రూ.6 లక్షలు అవుతుంది, ఇది చిన్న పన్ను చెల్లింపుదారులకు ప్రయోజనం చేకూరుస్తుంది.

RBI యొక్క లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీమ్ (LRS) కింద రెమిటెన్స్‌లపై మూలం వద్ద పన్ను (TCS) వసూలు చేసే థ్రెషోల్డ్ రూ.7 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచబడింది.

విద్యా ప్రయోజనాల కోసం చెల్లింపులపై TCS తొలగింపు.

త్రైమాసిక TCS స్టేట్‌మెంట్‌ను దాఖలు చేయడానికి నిర్దేశించిన సమయానికి లేదా అంతకు ముందు ఎప్పుడైనా చెల్లించినట్లయితే ఆలస్యమైన TCS కోసం ప్రాసిక్యూషన్ ఉండదు.

పాన్ యేతర కేసుల్లో మాత్రమే అధిక TDS తగ్గింపు వర్తిస్తుంది.

## వ్యాపారాలకు ఇంధనం అందించడానికి పన్ను సంస్కరణలు

బదిలీ ధరల ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి మూడు సంవత్సరాల బ్లాక్ వ్యవధి కోసం అంతర్జాతీయ లావాదేవీ యొక్క ఆయుధాల పొడవు ధరను నిర్ణయించడం ప్రతిపాదించబడింది.

వ్యాజ్యాన్ని తగ్గించడానికి మరియు అంతర్జాతీయ పన్నుల విషయంలో ఖచ్చితత్వాన్ని అందించడానికి సేఫ్ హార్బర్ నియమాలను విస్తరించారు.

ఎలక్ట్రానిక్ తయారీలో నిమగ్నమై ఉన్న రెసిడెంట్ కంపెనీకి సేవలు లేదా సాంకేతికతను అందించడంలో నిమగ్నమైన నాన్-రెసిడెంట్ల కోసం కొత్త ఊహాత్మక పన్ను విధానం.

పేర్కొన్న ఎలక్ట్రానిక్స్ తయారీ యూనిట్లకు సరఫరా కోసం భాగాలను నిల్వ చేసే నాన్-రెసిడెంట్స్ కోసం కొత్త సేఫ్ హార్బర్ రూల్.

## సమ్మతి భారాన్ని తగ్గించడం

చిన్న ఛారిటబుల్ ట్రస్ట్‌లు/సంస్థలకు సమ్మతి భారాన్ని తగ్గించడానికి, రిజిస్ట్రేషన్ వ్యవధి 5 సంవత్సరాల నుండి 10 సంవత్సరాలకు పెంచబడింది.

## ఉపాధి మరియు పెట్టుబడిని పెంచడం

ఇన్‌ల్యాండ్ వెస్సెల్స్ యాక్ట్ 2021 కింద రిజిస్టర్ చేయబడిన ఇన్‌ల్యాండ్ వెస్సెల్స్‌కు టన్నుల పన్ను పథకం విస్తరించబడింది.

సెక్షన్ 80 IAC కింద ప్రయోజనం ఐదేళ్లపాటు పొడిగించబడింది మరియు ఏప్రిల్ 1, 2030కి ముందు పొందుపరచబడిన అర్హత కలిగిన స్టార్టప్‌లు ప్రయోజనాన్ని క్లెయిమ్ చేయవచ్చు.

మౌలిక సదుపాయాల నిధులను పెంచే చర్యగా, సావరిన్ వెల్త్ ఫండ్‌లు మరియు పెన్షన్ ఫండ్‌లలో పెట్టుబడి పెట్టడానికి గడువు 31.03.2030 వరకు పొడిగించబడింది.

IFSCలో ఏర్పాటు చేయబడిన గ్లోబల్ కంపెనీల షిప్-లీజింగ్ యూనిట్లు, బీమా కార్యాలయాలు మరియు ట్రెజరీ కేంద్రాలకు నిర్దిష్ట ప్రయోజనాలు.

ప్రయోజనాలను క్లెయిమ్ చేయడానికి, IFSCలో ప్రారంభించడానికి కటాఫ్ తేదీ కూడా 31.3.2030కి 5 సంవత్సరాలు పొడిగించబడింది.

సెక్యూరిటీల నుండి వచ్చే లాభాలపై ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మరియు ఇతర రంగాలలో పెట్టుబడుల కోసం క్యాట్ I మరియు క్యాట్ II AIF లకు ఖచ్చితంగా పన్ను విధించబడుతుంది.

వెబ్‌సైట్ కొరకు

ఆదాయపు పన్ను శాఖ
సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్

FAQల కొరకు

CBC 15401/13/0017/2425

@IncomeTaxIndia @IncomeTaxIndia.Official @IncomeTaxIndiaOfficial @IncomeTaxIndiaOfficial www.incometax.gov.in

# తీన్మార్ మల్లన్నకు కాంగ్రెస్ షోకాజ్ నోటీసులు

## కులగణన నివేదికను దగ్ధం చేయడంపై పార్టీ నేతల ఆగ్రహం

**హైదరాబాద్, ఫిబ్రవరి 5,ప్రభాతవార్త:** కులగణన సర్వేను ఎమ్మెల్సీ చింతపండు నవీన్(తీన్మార్ మల్లన్న) కాల్చివేయడంపై కాంగ్రెస్ పార్టీ సీరియస్ అయ్యింది. కులగణ నివేదికను ఎందుకు కాల్చేయాల్సి వచ్చిందో చెప్పాలంటూ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. షోకాజు నోటిసులు జారీ చేసిన క్రమశిక్షణసంఘం అధినాయకత్వం మల్లన్న ఇచ్చే సమాధానం ఆధారంగా ఆయనపై చర్యలు తీసుకోవాలా, వద్దా? నిర్ణయించనుంది. అయితే ప్రస్తుతం తీన్మార్ మల్లన్న వ్యవహారం కాంగ్రెస్ పార్టీకి మింగుడు పడడం లేదు. పార్టీలో ఉంటూనే సొంత ప్రభుత్వం చేసిన సర్వేను ఆయన వ్యతిరేకిస్తూ హాట్ టాపిక్‌గా మారారు. బీసీల జనాభాను తగ్గించి చూపారంటూ రాష్ట్ర ప్రభుత్వంపై మల్లన్న ఫైర్ అయ్యారు. ఈ మేరకు కులగణన సర్వే ప్రతులను ఆయన తగలబెట్టారు. టిపిసిసి క్రమశిక్షణ కమిటితో గాంధీభవన్‌లో పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ చర్చించనున్నారు. టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ అందరితో చర్చించిన తరువాత తీన్మార్ మల్లన్నపై క్రమశిక్షణ చర్యలు తీసుకొంటారని ప్రచారం జరుగుతోంది. మల్లన్నపై ఏలాంటి చర్యలు తీసుకొంటారని బిసి వర్గాలు కూడా ఆసక్తితో ఎదురు చూస్తున్నాయి. తీన్మార్ మల్లన్నకు తగిన ప్రాధాన్యత లభించడంలేదని బిసిలు బలంగా నమ్ముతున్నారు. మల్లన్న కూడా తనకు ప్రాధన్యాత ఇవ్వడంలేదని బహిరంగానే వ్యాఖ్యానిస్తూ బిసిలను తన నాయకత్వం కింద సంఘటితం చేసుకొనే యత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్‌లోని బిసిలను తనవైపు తిప్పుకొంటున్న ధోరణిపై టిపిసిసి కూడా దృష్టిని కేంద్రీకరించింది. పార్టీ అధిష్ఠానానికి మల్లన్నపై ఫిర్యాదులు అందాయని తెలిసింది.

రాహుల్‌గాంధీ కాంగ్రెస్ పార్టీని పదికా లలపాటు కాపాడుకోవాలని సామాజిక న్యాయం కోసం పనిచేస్తుంటే రాష్ట్ర నాయకత్వం మాత్రం తన ఆలోచన విధానంకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని మల్లన్న అన్నారు.



బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్

# క్రమశిక్షణా రాహిత్యంపై కఠిచర్యలు

### ఎంతటి వారైనా పార్టీ నియమావళికి కట్టుబడి పనిచేయాల్సిందే

### కులగణన ఎస్సీ వర్గీకరణతో దశాబ్దాల స్వప్నం సాకారం: టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్




బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మహేష్‌కుమార్ గౌడ్

**హైదరాబ్,ఫిబ్రవరి 5,ప్రభాతవార్త:** క్రమశిక్షణా రహిత్యంను కాంగ్రెస్‌పార్టీ ఎంతమాత్రం సహించదని కఠినచర్యలు ఉంటాయని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ హెచ్చరించారు. గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌లో ఎంతటివారైనా పార్టీ నియమావళికి కట్టుబడి పనిచేయాల్సి ఉంటుందని పార్టీ నియమావళి పాటించకపోతే మూల్యం చెల్లిస్తారని అన్నారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల చొరవతో కులగణన ఎస్సీ వర్గీకరణతో బిసి ఎస్సీల దశాబ్దాల స్వప్నం సాకారమైందని ఆయన అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత బిసి కులగణన జరిగిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మహేష్‌గౌడ్ స్వోత్కర్షనలు చెప్పుకొన్నారు. బీహార్ రాష్ట్రం కులగణ చేపట్టినా కార్యరూపం దాల్చలేదని వివరించారు. ఏ లెక్కల ఆధారంగా కులగణన తప్పని అంటున్నారో ప్రతిపక్షాలు చెప్పాలి. మీరు చేస్తున్న ఆరోపణలకు ఆధారాలు చూపండి. రాజకీయ నాయకుల ఉచ్చులో బీసీ సంఘాలు, బీసీ నాయకులు పడవద్దని విజ్ఞప్తి చేస్తున్నా. బీసీలను అనగదొక్కిన పార్టీలు, నాయకుల మాటలు నమ్మి మోసపోకండి. బీసీ లెక్కలు తగ్గాయని మాట్లాడుతున్న వారికి ప్రామాణికం ఏంటి?. దేన్ని ఆధారం చేసుకుని వారు మాట్లాడుతున్నారు అని ఆగ్రహం వ్యక్తంచేశారు. తప్పుడు మాటలతో బీసీ ప్రజలను ప్రతిపక్షాలు తప్పుదోవ పట్టిస్తున్నాయి. గత పదేళ్లలో బీసీలకు ఏం న్యాయం చేశారో బీఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలి అని మహేష్ నిలదీశారు.

**స్థానిక సంస్థల్లో బీసీల జనాభా తగ్గించింది బీఆర్ఎస్ కాదా?**

ఎన్నో సంవత్సరాలుగా బీసీ కులగణన కోసం ఆ వర్గం నేతలు, ప్రజలు ఎదురుచూశారు. అది కాంగ్రెస్ ప్రభుత్వం నేరవేర్చింది. బీసీల ఆకాంక్ష నేరవేర్చామని ప్రతిపక్షాలకు కడుపుమంట. అడ్డగోలుగా కుటుంబంలో నలుగురికి మంత్రి పదవులు ఇచ్చే పార్టీ మాది కాదు. సమగ్ర కుటుంబ సర్వే మంచిదే అయితే దాన్ని ఎందుకు టేబుల్ చేయలేదో సమాధానం చెప్పాలి. ఇన్ని రోజులూ ఎడారిలో ఉన్నాం. బిందెడు నీళ్లు దొరికితే వాటిని కాపాడుకోవాలి. గురువారం మా కుటుంబ (కాంగ్రెస్‌పార్టీ) మీటింగ్ జరుగుతుంది. కులగణనపై ఎవరికైనా అనుమానాలు ఉంటే అన్ని విషయాలూ అక్కడ మాట్లాడుకుంటాం. కాంగ్రెస్ నేతలు ఎంత చిన్నవారైనా, పెద్దవారైనా పార్టీ క్రమశిక్షణకి లోబడే ఉండాలి. పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు. ఎవరైనా కులగణనకు ఇంకా వివరాలు ఇవ్వకపోతే ఇప్పటికైనా ఇవ్వండి" అని మహేష్‌కుమార్ చెప్పారు. కులగణ సర్వే కోసం బిసిసంఘాలు చాల ఏళ్ళు ఎదురుచూశాయి. ఇది గొప్ప కార్యక్రమం అని కాంగ్రెస్ ప్రభుత్వంను అభినందించాలని అని ఆయన అన్నారు. భవిష్యత్‌లోజరిగే జనాభా గణనలోనూ కులగణన అంశాన్ని చేర్చాలని ఆయన అన్నారు. బిజెపి జనగణనతోపాటు కులగణనచేస్తామని తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 3.66 శాతం మంది మాత్రమే సర్వేలో పాల్గొనలేదని వివరాలు ఇవ్వని వారిలో అధికులు హైదరబాద్‌లోనే ఉన్నారని ఆయనఅన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అభినందిం చాల్సిందిపోయి ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు.

# కులగణన ఓ చరిత్ర.. దాని అమలు అడ్డుకొంటే బిసిలకే నష్టం: మంత్రి కొండా సురేఖ

**హైదరబాద్,ఫిబ్రవరి 5,ప్రభాతవార్త:** కులగణన ఒక చరిత్ర దాని అమలు అడ్డుకొంటే వెనుకబడిన అణగారిన వర్గాలకు నష్ఠం అని అటవీ పర్యా వరణ శాఖ మంత్రి కొండా సురేఖ అభిప్రాయ పడ్డారు. గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లా డుతూ కులగణనపై నెగెటివ్ ప్రచారం చేస్తున్నారని ఆవేదన చెందారు. సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించి బిసిల కోసం ఏమైనా చేశారా కనీసం రిపోర్టు కూడా బయటపెట్టలేదని విమర్శించారు. రెండు కులాల ప్రతినిధిగా చెప్తున్నా బిసిల సంఖ్య పెరుగుతున్నా వారికి సామాజిక న్యాయం జరగ డంలేద న్నారు. రాహుల్ ఆలోచనతో కులగణన చేశామని ఆమె వివరించారు.

అసెంబ్లీలో స్టేట్ మ్మెంట్ ఇచ్చి డిస్కషన్‌కి అనుమతించామని అసెంబ్లీ సమావేశాల మధ్యలోనే ప్రతిపక్షం వెళ్ళి పోవడం బిసిలపై వారి ఉన్న ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతుందని ఆయన అన్నారు.

# ఈటలను బయటకు పంపి బిసిలను ఎదగకుండా కుట్రచేసిన బిఆర్ఎస్: మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్,ఫిబ్రవరి 5,ప్రభాతవార్త:** బిసినేత ఈటెలను బయటికి పంపి బిసిలను రాజకీయంగా ఆర్థికంగా ఎదగకుండా బిఆర్ఎస్ కుట్ర చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. గాంధీభవన్‌లో బుధవారం మంత్రి మాట్లాడుతూ కులగణన సర్వేపై మీకు విమర్శలు చేసే నైతికత లేదని బిఆర్ఎస్ నాయకత్వాన్ని ఆయన నిందించారు. దేశచరిత్రలోనే తొలిసారి సర్వే చేసిన వారిపై విమర్శలు చేస్తారా అని మండిపడ్డారు. కులగణన ఫ్లాప్ చేయడానికి కుట్రలు చేశారని విమర్శించారు. బిసినేత ఈటెలను ఎందుకు బిఆర్ఎస్ నుంచి గెంటేశారని దుయ్యబట్టారు. బిఆర్ఎస్‌లో మూడు కీలక పదవులు ఒకరికే ఉంటే అడిగే దమ్ముందా! కుల గణనలో పాల్గొనని వారికి ఏం నైతికత ఉందని దుయ్యబట్టారు. కులగణనలో ఏం పొరపాటు జరిగిందో చెప్పాలన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బిసిలపై చిత్తశుద్ధిచాటుకొందని పొన్నం కొనియాడారు. పదేళ్ళు బిసిలకు బిఆర్ఎస్ ఏం చేసిందో చర్చించడానికి మేంసిద్ధం అని పొన్నం అన్నారు. చర్చకు అసెంబ్లీకా? చార్మినార్‌కి రమ్మంటారా? బల్కంపేట ఎల్లమ్మగుడి దగ్గర చర్చచేద్దామా అని పొన్నం సవాల్ విసిరారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం అన్ని హామీలు అమలు చేస్తున్నామని ఆయన అన్నారు.




బుధవారం ట్యాంక్‌బండ్ వద్ద రాస్తారోకో చేస్తున్న నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

# రాస్తారోకో చేస్తున్న నేతల అరెస్టు

**హైదరాబాద్ (సైఫాబాద్), ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు వ్యతిరేకంగా రాస్తారోకో నిర్వహిస్తున్న అనేక మంది మాలలను బుధవారం ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట పోలీసులు అరెస్టు చేశారు. మాల సంఘాల జెఎసి ఆధ్వర్యంలో అనేక మంది కార్యకర్తలు తొలుత అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రోడ్డు మీదకు వచ్చి రాస్తారోకో నిర్వహించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. అంతకు ముందు మాల సంఘాల జెఎసి ఛైర్మన్ జి.చెన్నయ్య, కో-ఛైర్మన్‌లు బూర్గుల వెంకటేశ్వర్లు, చెరుకు రాం చందర్, గోపతి రమేష్ తదితరులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న మాలలను నటేట ముంచిందని ఆరోపించారు. 2011 జనాభా లెక్కల్లో ఉప కులాల గణన జరగలేదని తప్పుడు లెక్కలతో వర్గీకరణను చేశారని, సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం చేయకుండా మంత్రి వర్గ ఉప సంఘంతో వర్గీకరణ చేశారని, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కూడా మాలలకు ద్రోహం చేశారని వారు ధ్వజమెత్తారు.

ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు కరణం కిషన్, మన్నె శ్రీధర్‌రావు, అంగరి ప్రదీప్, మంచాల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.



బుధవారం న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య తదితరుతు

# రిజర్వేషన్లు పెంచకుండా పార్టీ టికెట్లు ఇస్తారా?: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, ఫిబ్రవరి 5,ప్రభాతవార్త:** స్థానిక సంస్థల బీసీ రిజర్వేషన్ 42 శాతంకు పెంచకుండా పార్టీపరంగా టికెట్లు ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించడం బీసీలను దగా చేయడమేనని ఆర్.కృష్ణయ్య విమర్శించారు. ఈమేరకు బుధవారంఢిల్లీలోని తెలంగాణ భవన్‌వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో 42 శాతంకు పెంచుతామని చెప్పిన కాంగ్రెస్ తీరా ఇప్పుడు తప్పించుకోవడానికి కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ప్రత్యేక అసెంబ్లీ పెట్టిన సిఎం రేవంత్‌రెడ్డి 42 శాతం రిజర్వేషన్లు పెంచడానికి ఏమి అవరోధాలు ఉన్నాయో చెప్పాలని ప్రశ్నించారు. మీరు ఎన్ని కుట్రలు చేసిన 42 శాతం రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక ఎన్నికలను ఒప్పుకునేది లేదన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి మొదటినుంచి బిసివ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నాడని మంత్రివర్గంలో కూడా బీసీలకు అన్యాయం చేసి కేవలం ఇద్దరికే అవకాశం కల్పించారన్నారు. అలాగే బీసీ కార్పొరేషన్ ద్వారా 14 నెలల కాలంలో ఒక్కరికి కూడా రుణాలు ఇవ్వలేదని, ఛైర్మన్ లను నియమించలేదన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి బీసీ వ్యతిరేక చర్యలు మార్చుకోవాలని లేకుంటే బిసిల తిరుగుబాటు తట్టుకోలేరని కృష్ణయ్య హెచ్చరించారు. ఈ సమావేశంలో జాతీయకన్వీనర్ గుజ్జకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల పహారాలో డంపింగ్ యార్డ్ పనులు

## కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి నాయకుల ముందస్తు అరెస్టులు

**గుమ్మడిదల, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** వేలాది మంది పోలీసు బలగాల పహారాలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు పనులను బుధవారం రాత్రి నుండి ప్రారంభించారు. గుమ్మడిదల మండలం నల్లవల్లి పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ భూముల్లో ఈ డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడంతో అటవీ ప్రాంతంలో ఉన్నటువంటి వన్యప్రాణులతో పాటు వ్యవసాయ ఆధారిత గ్రామాలు కలుషితం అవుతాయని గత ఐదు సంవత్సరాల నుండి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు నిలిపివేయగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మళ్లీ డంపింగ్ యార్డ్ పనులను ప్రారంభించడం సబబు కాదని ఆయా గ్రామాల రైతు సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే డంపింగ్ యార్డ్ ఏర్పాటు పనులను నిలిపివేసి వ్యవసాయ ఆధారిత ప్రాంతాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని హెచ్చరించారు. ఈ సందర్భంగా గుమ్మడిదల బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కుమార్ గౌడ్, కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డిలతో పాటు పలువురు నాయకులు గతంలో జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి వినతి పత్రాలు ఇచ్చినప్పుడు సాధ్యమైనంత వరకు వ్యవసాయ ఆధారిత ప్రాంతాన్ని కాపాడుకుం టామని హామీ ఇచ్చి గుమ్మడిదల ప్రజలను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా గ్రామంలో పోలీసు యంత్రాంగం తిరు గుతూ గ్రామం అంతా 144 సెక్షన్ అమల్లో ఉం డడంతో ఎక్కడ కూడా ప్రజలు గుమి కూడి నిల బడద్దని హెచ్చరికలు జారీ చేయడంతో గ్రామ స్తులంతా ఆందోళన చెందుతున్నారు. వెంటనే సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ఈ డంపింగ్ యార్డ్‌ను వెంటనే నిలిపివేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతూ మహిళలు, రైతులు భారీ సంఖ్యలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



బుధవారం నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

**మండల నాయకులను ముందస్తు అరెస్టులు.. సంగారెడ్డిలోని చిదురుప్ప పోలీస్ శిక్షణ కేంద్రానికి తరలింపు:** మంగళవారం అర్ధరాత్రి మండలంలోని అన్ని గ్రామాల నాయకులను ముందస్తు అరెస్టు చేసి సంగారెడ్డి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లకు, అలాగే చిదురుప్ప పోలీస్ శిక్షణ కేంద్రానికి తరలించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, మద్ది ప్రతాప్ రెడ్డి, మద్ది వీరారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నుండి మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, తాజా మాజీ జెడ్పీటీసీ కుమార్ గౌడ్, అన్ని గ్రామాల నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. అర్ధరాత్రి నుండి డంపింగ్ యార్డ్ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు అడిషనల్ కమీషనర్ రఘుప్రసాద్, ఎక్స్‌క్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డిలోతో పాటు పోలీస్ వివిధ ఉన్నత స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గీతం నూతన విసిగా డాక్టర్ ఎర్రోల్ డిసౌజా

**పటాన్‌చెరు,ఫిబ్రవరి 5,ప్రభావార్త:** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఉప కులపతి (వీసీ)గా ప్రముఖ విద్యావేత్త, బహుముఖ ప్రజ్ఞావంతుడు, ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ అహ్మదాబాద్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ ఎర్రోల్ డిసౌజా నియమితు లయ్యారు. గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ బుధవారం ఆన్ లైన్‌లో నిర్వహించిన టౌన్ హాల్ సమావేశంలో ఈ విషయాన్ని సిబ్బందికి వెల్లడించి, నూతన వీసీని అందరికీ పరిచయం చేశారు. డాక్టర్ డిసౌజా నియామకం పట్ల గీతం అధ్యక్షుడు శ్రీభరత్ తన హర్షాన్ని వ్యక్తంచేస్తూ,"ప్రొఫెసర్ డిసౌజాతో నా సంభాషణలలో, మా కొత్త దృక్పథంతో ఆయన ఎంత దగ్గరగా ఉన్నారో చూసి నేను ముగ్ధుడయ్యాను. మార్పు తీసుకురావడాని నిజాయితీ, కరుణలతో ముందుకు సాగే గీతం, అసాధారణమైన జ్ఞానఆధారిత సంస్థ అవుతుంది. ముఖ్యంగా నిజాయితీ, కరుణ విలువల పట్ల ఆయన నిబద్ధత-నేను ఎంతో గౌరవించే సూత్రాలు-మమ్మల్ని ముందుకు నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తాయి అని వ్యాఖ్యానించారు.



# సిఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపిన పిడమర్తి రవి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, ఫిబ్రవరి5:** ఎస్సీ ఉప కులాల వర్గీకరణను అసెంబ్లీలో ఆమోదించిన నేపథ్యంలో జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి పలువురు నేతలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఈ క్రమంలో బుధవారం సిఎంను కలిసి పిడమర్తి రవి, ఖమ్మం జిల్లా నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

# వ్యక్తిగత సిబ్బందిని సన్మానించిన టిపిసిసి చీఫ్ మహేష్

**హైదరాబాద్, ఫిబ్రవరి 5,ప్రభాతవార్త:** గాంధీభవన్‌లో కులగణపై జరిగిన సంబరాలలో ఎనిమిది సెల్‌ఫోన్‌లను దొంగిలించిన దొంగను చాకచక్యంగా పట్టుకొన్న టిపిసిసి చీఫ్ వ్యకిగత సిబ్బందిని టిపిసిసి చీఫ్ మహేష్‌గౌడ్ సన్మానించారు. బుధవారం శాలువతో సన్మానం చేశారు. గాంధీభవన్‌లో జరిగిన సంబరాల్లో దొంగ ప్రవేశించి తన హస్తలాఘవం ప్రదర్శించాడు. ఫోటోగ్రాఫర్ హరీష్ సలహాతో గన్‌మెన్ దేవరాజ్ దొంగను విచారించగా ఎనిమిది సెల్‌ఫోన్‌లు దొంగిలించినట్లు ఒప్పుకొని వాటిని అప్పగించారు.

# వడ్డీవ్యాపారుల నుంచి రక్షణ కల్పించండి

## గాంధీభవన్‌లో సీతక్కకు విన్నపాల వెల్లువ

**హైదరాబాద్,ఫిబ్రవరి 5,ప్రభాతవార్త:** వడ్డీవ్యాపారుల నుంచి రక్షణకల్పించాలని మహిళా చిరు వ్యాపారులు పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్కను ఆశ్రయించారు. బుధవారం గాంధీభవన్‌లో జరిగిన మంత్రులతో ముఖాముఖి కార్యక్రమానికి మంత్రి సీతక్క హాజరుకాగా పార్టీశ్రేణులు,ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి వారి సమస్యలు వివరించి పరిష్కారం చూపాలని వేడుకొన్నారు. మంత్రి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులకు ఫోచేసి వాటిని పరిష్కరిచాలని ఆదేశాలు జారీచేశారు. సహచర మంత్రి మండలిలోని మంత్రులకు సంబంధించిన అంశాలను ఆయా మంత్రులకు ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని సూచిస్తూ సిఫార్సు చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి మహిళా వ్యాపారులు పెద్దఎత్తువచ్చి అప్పుల ఉబిలో ఎలా కూరుకుపోయామో వివరించి వడ్డీవ్యాపారులను కట్టడి చేయాలని కోరారు. టిఆర్ఎస్ ర్యాలీలో తన భర్త ప్రమాదవశాత్తు మణించారని తనకు ఉద్యోగం ఇవ్వాలని కల్వకుర్తికి చెందిన మనీషా వినతి పత్రం అందించారు. ప్రైవేట్ కళాశాల ఫీజులు రాయితీ తగ్గింపు కోసం ప్రైవేటు రంగంలో ఉపాధి అవకాశాలు కోసం వచ్చి ఆమెను వేడుకొన్నారు.



బుధవారం గాంధీభవన్‌లో ప్రజలనుంచి విన్నపాలను స్వీకరిస్తున్న మంత్రి సీతక్క

ధరణివల్ల నష్టపోయిన రైతులు కొంత మంది మహబూబ్‌నగర్ నుంచి వచ్చి తమ గోడు వెల్లబోసుకున్నారు. మారుమూల గ్రామాల్లో పనిచేస్తున్న కొంత మంది హైదరాబాద్‌కు బదిలీచేయాలని కోరుకున్నారు. తమగ్రామాలలో అంగన్‌వాడీలను కొత్త రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలని కొంత మంది కోరారు. 2016లో రుణం తీసుకొన్నవారికి కూడా రుణమాఫి చేయాలనికొంత మంది అభ్యర్థించారు. హోంగార్డులు తమను విధుల నుంచి తొలగించారని తిరిగి విధులలోకి తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. రోడ్డువసతి కావాలని కొన్ని గ్రామాలకు చెందినవారు వినతి పత్రం సమర్పించారు.

# బిసి హక్కులు అడ్డుకొనే మేకవన్నె పులులు బిఆర్ఎస్ నేతలు: మంత్రి సీతక్క

**హైదరాబాద్,ఫిబ్రవరి 5,ప్రభాతవార్త:** బిసిల హక్కులను అడ్డుకొనేందుకు మేకవన్నెల పులిలా బిఆర్ఎస్ నేతలు పొంచి ఉన్నారని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళాశిశుసంక్షేమం మంత్రి సీతక్క హెచ్చరించారు. గాంధీభవన్‌లో మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో బుధవారం పాల్గొని అనంతరం విలేఖరులతో ఆమె మాట్లాడినారు. 1931లో కులగణన జరిగిందని ఆ తరువాత అత్యంత శాస్త్రీయంగా ఇప్పుడు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి నాయకత్వంలో సమగ్రంగా సర్వే జరిగిందని కితాబు ఇచ్చుకున్నారు. బిసిల లెక్క 56శాతంకు పైగా తేలిందిన ఎవరికి నష్టం జరగలేదని ఆమె వివరించారు. గతంలో చేసిన సమగ్ర కుటుంబ సర్వే అశాస్త్రీయంగా అసంబద్ధంగా ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. లిమ్కా బుక్ రికార్డుకోసం ఒక్క రోజు సర్వే పేరుతో పైపైనే సర్వేచేశారని ఆమె విమర్శించారు. సొంత కుటుంబ గణన కెసిఆర్ చేశారు తప్ప కుల గణన చేయలేదు అని అన్నారు. మేము చేపట్టిన కులగణన బహిష్కరించాలని టిఆర్ఎస్ పిలుపునిచ్చిందని గుర్తుచేశారు. ఇప్పుడు కులగణన లెక్కల గురించి అడిగే హక్కు బిఆర్ఎస్‌కు లేదని ఆమె అన్నారు. ముఖ్యమంత్రి పదవి పార్టీ అధ్యక్షపదవి ఒకే సమాజికవర్గంకు గతంలో ఎందుకు ఇచ్చారని బిసి సమాజం బిఆర్ఎస్‌ను ప్రజలు నిలదీయాలని ఆమె కోరారు. కనీసం 20ఏళ్ళలో ఒక్క బిసి నేతకు పదవులు ఇవ్వలేదని ఆమె గుర్తుచేసుకున్నారు. బిసిలు ఎదిగితే వారిని పార్టీ నుంచి సాగనంపినారని ఆమె విమర్శించారు. నరేంద్ర నుంచి మొదలు కొని రాజేంద్ర వరకు అవమానాల పాలు చేశారని అన్నారు. టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఇప్పుడు సర్వేను ప్రశ్నించడం కాదు మీ హయాంలో ఎందుకు కులగణ సమగ్రం చేయలేదో ఆలోచించుకోవాలని ఆమె కోరారు. తలసాని శ్రీనివాస యాదవ్ కులగణనలో ఎందుకు పాల్గొనలేదని ఆమె నిలదీశారు. దొరలు తమ వివరాలు నమోదు చేసుకోకపోతే వారికి నష్టం లేదు వారి మాటలు నమ్మి కులగణన సర్వేల్లో నమోదు చేసుకోని బిసిలు నష్టపోతారు అని ఆమె అన్నారు. కులగణన సమాచారం ఆధారంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఆమె తెలిపారు. కులగణన ఎక్కడ లెక్క తప్పలేదు ఆయా సమాజిక వర్గాల లెక్కలు పక్కాగా తేలాయి అని ఆమె తెలిపారు. కులగణన సర్వే సరిగాలేదని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడటం ఆయన విజ్ఞత కే వదిలేస్తున్నాం అని అన్నారు. అభ్యంతరాలు ఉంటే పార్టీ వేదికపై మాట్లాడాలి కానీ ఇలా బహిరంగంగా మాట్లాడటం మంచిది కాదని ఆమె అన్నారు. ఆయన సంగతి పార్టీ చూసుకొంటది అని అభిప్రాయపడ్డారు. ప్రజల సంతోషాన్ని చూడలేక కొందరు వక్రీకరణ చేస్తున్నారు. 30 ఏళ్ళ ఎస్సీ వర్గీకరణ పంచాయతీని తెంచాము ఎవరి వాటా వారికి పంచాము అని ఆమె తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 21వేల కోట్లు రుణాలను మాఫి చేశామని ఆమె అన్నారు. కెసిఆర్ హయాంలో రుణమాఫి కానీ రైతులు తమకు రుణమాఫి చేయాలని దరఖాస్తులు చేసుకుంటున్నారని సీతక్క చెప్పారు. గ్రామస్థాయి నుంచి గాంధీభవన్‌స్థాయి వరకు మంత్రులు దరఖాస్తులు ప్రజల నుంచి తీసుకొంటున్నామని అన్నారు. రెండో పర్యాయం గాంధీభవన్‌కు ముఖా ముఖి పాల్గొనేందుకు వచ్చానని చెప్పారు. భూసామజిక సమస్యలు వంటివి వచ్చాయని ఆమె తెలిపారు. భూమి ఒకరిది మరొకరికి నమోదైందని ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. పదేళ్ళలో ఒక్కరికి ఇల్లు ఇవ్వలేదు, రేషన్‌కార్డులు ఇవ్వలేదని ఆమె ఆరోపించారు.

# కులగణన అసమగ్రంగా, అశాస్త్రీయంగా ఉంది: బిజెపి ఎంపి డా.లక్ష్మణ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన నివేదిక పూర్తిగా తప్పుల తడకగా ఉందని బిజెపి ఎంపి డా.లక్ష్మణ్ మండిపడ్డారు. ఢిల్లీలో ఎంపి డా.లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. కులగణన అసమగ్రంగా, అశాస్త్రీయంగా ఉందన్నారు. వాస్తవాలకు దూరంగా ఉందన్నారు. నిజంగా కాంగ్రెస్ పార్టీకి, రేవంత్ రెడ్డికి సామాజిక న్యాయం పట్ల చిత్తశుద్ధి ఉన్నట్లయితే ఉంటే చట్టరూపంలో తీసుకొచ్చి అమలు చేసేందుకు, అందులో ఉన్నటువంటి లోటుపాట్లను సరిదిద్ది బిల్లురూపంలో తీసుకురావాల్సింది బదులు మొక్కుబడిగా, తూతూమంత్రంగా చేశారు. మండల్ కమిషన్‌లోనూ 51, బిఆర్ ఎస్ సమగ్రకుటుంబ సర్వేలోనూ 52 బిసిలు న్నారని వెల్లడైంది. మరి ఈ సంఖ్య ఎలా 46కి వచ్చిందని ప్రశ్నించారు. 4కోట్ల జనాభాలో దాదా పు 6 తగ్గుదల బిసిలకు చేస్తున్న ద్రోహానికి అద్దం పడుతుందన్నారు. 12 ముస్లింల జనాభాను చూపిస్తూ 2 ముస్లిం బిసిలు, ముస్లిం ఓసిలు అని చూపించడందేనికి నిదర్శనం. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మతపరమైన రిజర్వేషన్లు ఉండవని చెప్పినా వీళ్లు మాత్రం దానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. రాహుల్ గాంధీ రాజ్యాంగం చేతిలో పట్టుకుని తిరుగుతున్నారు. కానీ దాన్ని ఏనాడూ తెరిచి చూడలేదని అర్థమవుతోంది. రాహుల్ గాంధీ సమక్షంలో గతేడాది నవంబర్ 6నఈ సర్వేను ప్రారంభించారు. ఈ సర్వేదే శానికి ఓ రోల్ మాడల్ అని చెప్పారు. బిసిల ఓట్లను తగ్గించి ముస్లింలకు కట్టబెట్టడమే రోల్ మాడలా? గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో 150 సీట్లలో 50 సీట్లు బిసిలకు రిజర్వ్ చేస్తే.. ఇం దులో 18 మాత్రమే బిసిలకు ఇచ్చి మిగిలినవి ముస్లింలకు కట్టబెట్టడం అత్యంత దారుణం.32 బిసి సీట్లలో ముస్లింలుగా గెలిచారు. సుప్రీంకోర్టు నిర్ణయానికి అనుగుణంగా 50లోపే రిజర్వేషన్లు ఉండాలి. మండల్ కమిషన్ స్పష్టంగా 1990లో ముస్లింలలోని రెండుతెగలు(దూదేకుల,మెహ తర్) నుబిసిల్లో రిజర్వేషన్లు పొందుతున్నారు. దీన్ని రాజశేఖర్ రెడ్డి4కోసం ప్రయత్నిస్తే.. కెసిఆర్ ఏకంగా 12రిజర్వేషన్లు ముస్లింలకు ఇస్తామని చెప్పారు.

# హైదరాబాద్‌లో మరోసారి భారీగా సింథటిక్ డ్రగ్ పట్టివేత

## నైజీరియన్ అరెస్టు, రూ.1.60 కోట్ల ఎండిఎంఎ డ్రగ్ జప్తు



నైజీరియన్ వద్ద పట్టుబడ్డ ఎండిఎంఎ డ్రగ్ గురించి వివరాలు వెల్లడిస్తున్న దక్షిణ, పశ్చిమ మండల డిసిపి చంద్రమోహన్. చిత్రంలో టాస్క్‌ఫోర్స్ డిసిపి సుధీంద్ర తదితరులున్నారు.

**హైదరాబాద్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో మరోసారి భారీగా సింథటిక్ డ్రగ్ పట్టుబడింది. దేశంలో 12 ఏళ్లకు పైగా అక్రమంగా వుంటున్న నైజీరియన్ ఓ లివర్ అలిమాస్ జాన్సన్ ఊరఫ్ జాన్ (44)ను హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్, దక్షిణ, పశ్చిమ మండల పోలీసులు బుధవారం ఉదయం దాడిచేసి ప ట్టుకున్నారు. ఈ సందర్భంగా అతని వద్ద నుంచి కోటీ 60 లక్షల రూపాయల విలువచేసే ఎండిఎంఎ డ్రగ్‌ను జప్తు చేశారు. నైజీరియాలోని ఇమో ప్రాంతానికి చెందిన ఓలివర్ 2009 ఫిబ్రవరి నెలలో బిజినెస్ వీసాపై భారత్‌కు వచ్చాడు. 2013లో అతని వీసా గడువు ముగియగా పాస్‌పోర్టు గడువు కూడా ముగిసినా భారత్‌లోని ప లు నగరాలలో అక్రమంగా తిరుగుతూ డ్రగ్స్ స్మగ్లింగ్ చేస్తున్నాడు. 2013లో ఢిల్లీలో హెరాయిన్ స్మగ్లింగ్ కేసులో అరెస్టయిన ఇతను ఐదేళ్ల తొమ్మిది నెలల పాటు జైల్లో వున్నాడు. 2019లో ఇతను జైలు నుంచి విడుదలయ్యాక ఇతను తన మకాంను ముంబాయికి మార్చాడు. అప్పటి నుంచి ఇతను పోలీసులకు చిక్కకుండా అనేక మార్గా లలో మాదకద్రవ్యాలను స్మగ్లింగ్ చేయసాగాడు. ఢిల్లీలో అక్రమంగా వుంటున్న మరో నైజీరియన్ స్మగ్లర్ ఓయిబో నుంచి ఓలివర్ తక్కువ ధరకు తరచూ డ్రగ్స్ కొంటూ దానిని దేశంలోని ఇతర నగరాలలో వుండే నైజీరియన్ స్మగ్లర్లకు ఎక్కువ ధరకు అమ్మసాగాడు. ఈ క్రమంలో ఓలివర్ దండిగానే సంపాదించాడు. ఇటీవలో ఓలివర్ ఓ యిబో నుంచి 1.300 కిలోల ఎండిఎంఎ డ్రగ్‌ను ప్రతీ గ్రాము 300 రూపాయలకు కొని దానిని 600 రూపాయల నుంచి వెయ్యి రూపాయలకు అమ్మసాగాడు. ఓయి బో వద్ద కొన్న 1.300 కిలోల డ్రగ్‌ను ఓలివర్ మూడు ప్యాకెట్లలో దాచివుంచి హైదరాబాద్‌లోని లంగర్‌హౌజ్‌లో అతను సూచించిన కస్టమర్‌కు అందించేందుకు మంగ ళవారం రాత్రి వచ్చాడు. బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఓలివర్ లంగర్‌హౌజ్ వద్ద గల బాపుఘాట్ వద్ద కస్టమర్ కోసం వేచివుండగా దీనిపై పక్కా సమాచారం అందుకున్న హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్, దక్షిణ, పశ్చిమ మండల పోలీసులు ఒక్కసారిగా దాడిచేసి పట్టుకున్నారు. ఇతని వద్ద నుంచి 1.300 కిలోల ఎండిఎంఎ డ్రగ్‌తో పాటు సెల్‌ఫోన్‌ను జప్తు చేశారు. కాగా ఇతనికి ఈ డ్రగ్ అందించిన ఓయిబో కోసం గాలింపు చేబట్టారు. నిందితుడిని లంగర్‌హౌజ్ పోలీసులకు అప్పగించారు. ఇతన్ని మరింతగా విచారించేందుకు కస్టడీకి తీసుకుంటామని డిసిపి చంద్రమోహన్ తెలిపారు. పట్టుబడ్డ డ్రగ్ విలువ కోటీ 60 లక్షల రూపా యలని ఆయన తెలిపారు.

**అక్రమంగా వుంటున్న ఇద్దరు ఆఫ్రికన్లు అరెస్టు, ఇద్దరికి డిపోర్టేషన్:** ఇదిలావుండగా ఓలివర్ పట్టుబడ్డ సమయంలోనే లంగర్‌హౌజ్ పరిధిలో మరో ఇద్దరు ఆఫ్రికన్లు అక్రమంగా వుంటూ పట్టుబడ్డారు. ఇందులో నైజీరియాకు చెందిన ఇకే చుక్వు సిల్వెస్టర్ ఎంబా (40), గునియాకు చెందిన మౌసా కమెరా (38). వీరిలో సిల్వెస్టర్ 2012లో భారత్‌కు బిజినెస్ వీసాపై వచ్చి ఇక్కడ తక్కువ ధరకు లభించే దుస్తులను కొనుగోలు చేసి వాటిని తన దేశానికి పంపేవాడు. అయితే ఇందులో ఆశించినంతగా లాభాలు రాకపోవడంతో పక్కదారి పట్టి డ్రగ్స్ దందాలో దిగాడు. 2019 లో ఇతను పాస్‌పోర్టు, వీసా గడువు ముగిసినా భారత్‌లో వున్నందుకు ముంబాయి పోలీసులకు పట్టుబడగా జైలు పాలయ్యాడు. కొన్నిరోజుల క్రితం ఇతను హైదరాబా ద్‌కు మకాం మార్చి డ్రగ్స్ దందాలో దిగేందుకు యత్నిస్తుండగా బుధవారం నాడు పోలీసులకు పట్టుబడ్డాడు. మరో ఘటనలో లంగర్‌హౌజ్‌లోనే గునియా దేశానికి చెం దిన కమరా దొరికిపోయాడు. 2020లో మెడికల్ వీసాపై భారత్‌కు వచ్చిన ఇతను వస్తూనే ముంబాయి విమానాశ్రయంలో కొకైన్‌తో దొరికిపోగా పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఆరు నెలల జైలు శిక్ష తరువాత ఇతను జైలు నుంచి విడుదలయ్యాడు. అప్పటి నుంచి భారత్‌లో అక్రమంగా వుంటూ డ్రగ్స్ దందాలు చేస్తున్నాడు . గత ఏడాది ఇతను బెంగళూరుకు మకాం మార్చి బుధవారం హైదరాబాద్‌కు రాగా పోలీసులకు పట్టుబడ్డాడు. ఇతని వద్ద సెల్‌ఫోన్‌ను జప్తు చేశారు. వీరిద్దరిపై హైదరా బాద్‌లో ఎలాంటి కేసులు లేక పోవడంతో ఇద్దరిని స్వదేశానికి పంపుతున్నామని డిసిపి చంద్రమోహన్ తెలిపారు. కాగా డ్రగ్స్ దందాలు సాగించే వారి గురించి స్థానికుల వద్ద సమాచారం వుంటే పోలీసులకు తెలపాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో టాస్క్‌ఫోర్స్ డిసిపి సుధీంద్రతో పాటు గోల్కొండ ఎసిపి ఫయాజ్ తదిత రులు పాల్గొన్నారు.

**అఫ్జల్‌గంజ్ కాల్పుల ఘటనలో నిందితుల కోసం గాలింపు జరుగుతోంది...టాస్క్‌ఫోర్స్ డిసిపి సుధీంద్ర వెల్లడి:** కాగా అఫ్జల్‌గంజ్ వద్ద ఇటీవల జరిగిన కాల్పుల ఘటనలో నిందితుల కోసం గాలింపు జరుగుతోందని టాస్క్‌ఫోర్స్ డిసిపి సుధీంద్ర తెలిపారు. వీరిద్దరు నిందితులు అంతకు ముందు బీదర్‌లో జరిగిన కాల్పుల ఘటనలో నిందితులని ఆయన తెలిపారు. వీరిని త్వరలోనే పట్టుకుంటామని ఆయన వెల్లడించారు. అక్రమ ఆయుధాలు వి నియోగించే వారిపై కఠినంగా వుంటామని ఆయన హెచ్చరించారు.

# ఎపిలో ఇక తెలుగులో ఉత్తర్వులు

### ప్రభుత్వం కీలక నిర్ణయం

### తొలుత ఇంగ్లీషు, తర్వాత తెలుగులో జారీ

**విజయవాడ.ఫిబ్రవరి5,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగు భాషలో కూడ జారీ చేయనుంది. గత నెలలోనే ఈ ప్రక్రియను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించగా, కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఆలస్యమైంది. ప్రస్తుతం ఈ ప్రక్రియను హోంశాఖ ప్రారంభించింది. తొలి సారిగా ఒక ఖైదీ పెరోల్‌కు సంబంధించిన జిఒను తెలుగు భాషలో విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం స్థానిక ప్రజల కోసం కీలకమైన చర్యగా భావిస్తున్నారు. ప్రతి జిఒ మొదట ఇంగ్లీషులో విడుదల కానుంది. ఆ తర్వాత రెండు రోజుల్లోపు అదే జిఒను తెలుగు భాషలో జారీ చేస్తారు. ఈ విధానం ద్వారా ప్రభుత్వ నిర్ణయాలు, ఉత్తర్వులు ప్రజలకు సులభంగా అందుబాటులోకి రానున్నాయి. ప్రభుత్వ ఉత్తర్వులు రెండు భాషల్లో జారీ చేయాలనే ఈ నిర్ణయం ఆంధ్రప్రదేశ్ ప్రజలకు మరింత పారదర్శకతను, భాష పట్ల గౌరవాన్ని అందచేస్తుందని భావిస్తున్నారు. తెలుగు భాషలో ఉత్తర్వుల ప్రక్రియ త్వరితగతిన కొనసాగేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.



# 11 నుంచి త్రైమాసిక మెట్లోత్సవం

### మూడు రోజులు సామూహిక భజనలు

**తిరుమల,ఫిబ్రవరి 5ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 11వతేదీ మంగళవారం నుండి 13వతేదీ గురువారం వరకు మూడురోజులు త్రైమాసిక మెట్లోత్స వం జరుగుతుంది. తిరుపతిలో 11,12తేదీల్లో మధ్యాహ్నం 1 గంట నుండి సాయంత్రం 4గంటల వరకు భజన మండళ్ళు సామూహిక భజన కార్యక్రమాలు , నామసంకీర్తన, ధార్మికసందేశాలు, మహనీయులు మానవాళికి ఉపదేశాలు తెలియజేస్తారు. సాయంత్రం సంగీత విభావరి, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. 13న ఉదయం 8.30గంటలకు సామూహిక నామసంకీర్తన, 9.30గంటల నుండి స్వామీజీల ధార్మిక సందేశాలు ఇవ్వనున్నారు. 12న ఉదయం 4.30గంటలకు అలిపిరి పాదాలమండపం వద్ద మెట్లపూజ నిర్వహిస్తారు. అనంతరం వేలసంఖ్యలో వచ్చే భజన మండళ్ళ సభ్యులతో సాంప్రదాయ భజనలు చేస్తూ ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటారు. గతంలో ఎందరో మహనీయులు భక్తిప్రపత్తులతో వేంకటాద్రి పర్వతాన్ని కాలినడకన అధిరోహించి స్వామివారి అనుగ్రహం పొందారు. అలాంటివారి అడుగు జాడల్లో నడిచి ఆ దేవదేవుని కృపకు పాత్రులు కావాలని తలంపుతో దాస సాహిత్య ప్రాజెక్టు మెట్లోత్స వం కార్యక్రమం నిర్వహిస్తోంది.

# కుల గణనపై ప్రజల్ని తప్పుదోవ పట్టించొద్దు

### రాజకీయాల కోసం అపోహలు స్పష్టించొద్దు

### సర్వేను పారదర్శకంగా.. శాస్త్రీయంగా నిర్వహించాం

### మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**హైదరాబాద్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణనపై ప్రజల్ని తప్పుదోవ పట్టించొద్దని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఒక ప్రకటనలో కోరారు. ఇది రాజకీయాలు చేసేందుకు సరైన సమయం కాదంటూ ప్రతిపక్షాలకు హితవు పలికారు. కులగణన సర్వేను అత్యంత పకడ్బందీగా నిర్వహించాం. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ ఇంటింటికెళ్లి వివరాలను సేకరించాం అన్నారు. ఈ సమాచారం ఆధారంగానే నివేదికను రూపొందించాం. అయినా.. కొందరు పనిగట్టుకుని నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నార్థు అని విమర్శించారు. అప్పటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వేను అశాస్త్రీయంగా నిర్వహించింది. పారదర్శకతకు పాతరేసి తప్పుల తడకగా నివేదికను తయారు చేసింది. సర్వే చేయించిన వారు ఆ వివరాలను ప్రజల ముందు పెట్టలేకపోయారు. శాసనసభలో పెట్టే సాహసం చేయలేదు. ఆ సర్వేకు ఎటువంటి ప్రామాణికత లేదు. అయినా దాని ప్రస్తావన 9 ఏళ్ల తర్వాత ఇప్పుడు తెస్తున్నారు. ఆ తప్పును మేం సరిదిద్దాం. అందుకు మమ్మల్ని అభినందించాల్సింది పోయి విమర్శించడం ఎంత వరకు సమంజసం అంటూ ప్రశ్నించారు. ప్రతిపక్షాలు బిసిలపై ఇప్పుడు కపట ప్రేమను ప్రదర్శిస్తున్నాయి. ఇప్పటికీ.. ఎప్పటికీ బిసిలకు అండగా నిలబడేది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. మాటల్లో కాదు.. చేతల్లో చేసి చూపిస్తాం. రాహుల్ గాంధీ ఆకాంక్షల మేరకు రూపొందించిన బిసి డిక్లరేషన్‌ను నూటికి నూరు శాతం అమలు చేసి తీరుతాం. ఇందులో ఎలాంటి సందేహం లేద్దు అని స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పరంగా బిసిలకు 42 శాతం సీట్లను కచ్చితంగా కేటాయిస్తాం. కాంగ్రెస్‌కు బిసిల పట్ల ఉన్న చిత్త శుద్ధిని నిరూపించుకుంటాం అన్నారు. బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలు ఈ మాట చెప్పగలవా..? అంటూ ప్రశ్నించారు. రెండు దఫాలుగా అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ చేయలేని ఎన్నో పనులను ఏడాదిలోనే మేం చేశాం. అందులో కుల గణన కూడా ఒకటి. అది చూసి బిఆర్‌ఎస్ నేతలు తట్టుకోలేక నిరాధార ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. వారికి బిజెపి నేతలు కూడా వంత పాడుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చు తాం. ప్రతిపక్షాల ఉచ్చులో పడొద్దని ప్రజలను కోరుతున్నా. మీ రాజకీయాల కోసం ప్రజల్లో అపోహాలు స్పష్టించొద్దు అని ప్రతిపక్షాలకు సూచించారు.

# పాఠశాల భవనంపై నుంచి దూకి టెన్త్ విద్యార్థి ఆత్మహత్య

### షాద్‌నగర్ లో ఘోరం...

### ప్రిన్సిపాల్ తిట్టాడని మనస్తాపం చెందిన విద్యార్థి నీరజ్



నీరజ్ (ఫైల్)

**షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 5ప్రభాత వార్త:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ప్రైవేట్ శాస్త్ర స్కూల్ భవనంపై నుండి అదే పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న నీరజ్ అనే విద్యార్థి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న నీరజ్ మల్లికార్జున కాలనీకి చెందిన మరో విద్యార్థి బాల్కనీలో సాయంత్రం సమయంలో ఏదో మాట్లాడుతుండగా ప్రిన్సి పల్ ఇరువురిని తన గదిలోకి పిలిచి తీవ్రంగా మందలించినట్లు కుటుంబ సభ్యులు బాధితులు తెలిపారు. దీంతో మనస్థాపానికి గురైన నీరజ్ టాయిలెట్ కోసం వెళ్తున్నట్లు చెప్పి అక్కడే భవనం పైకి ఎక్కి మొదటి అంతస్తు నుండి దూకాడు. భవనం పై నుండి కింద పడిన విద్యార్థి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే విద్యార్థిని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా నీరజ్ అప్పటికే చనిపోయాడు.

**మిన్నంటిన కుటుంబ సభ్యుల రోదనలు**

నీరజ్ కుమార్ భవనంపై నుంచి పడ్డాడు అన్న విషయం తెలుసుకున్న విద్యార్థి తండ్రి బీజేపీ పార్టీ చెందిన పట్టణ అధ్యక్షుడు హరిభూషన్ కుటుంబ సభ్యులు పాఠశాల వద్దకు చేరుకున్నారు. తీవ్రగాయాలతో పడి ఉన్న విద్యార్థిని ఆసుపత్రికి తరలించేలోగానే మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ సంద ర్భంగా అందె బాబయ్య మీడియాతో మా ట్లాడుతూ హరిభూషన్‌కు ఉన్న ఒక్కగానొక్క కొడుకు ఇలా అర్ధంతరంగా చనిపోవడం చాలా బాధకరమైన విషయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**పూర్తి విచరణ చేపడుతాం: ఎంఇఒ మనోహార్**

సంఘటన స్థలానికి చేరుకున్న స్థానిక ఎంఈఓ మనోహార్ మీడియాతో మాట్లాడుతూ విద్యార్థి మనస్థాపన చెంది భవనంపై దూకి చనిపోయాడాని, ఈ సంఘటనకు సంబంధించి పూర్తి విచారణచేపట్టి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థి మృతి చెందిన సంఘటన తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

# ప్రభుత్వ విజిలెన్స్ నివేదికలపై టిటిడిలో అంతా గప్‌చుప్

**తిరుపతి,ఫిబ్రవరి 5ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో నిబంధనలకు విరుద్ధంగా ఇంజనీరింగ్ పనులకు భారీ మొత్తంలో నిధుల కేటాయింపుపై అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై గత ఏడాది విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం లోతుగా దర్యాప్తు చేపట్టింది. ఇందులో భాగంగా టిటిడి వార్షిక బడ్జెట్ 5వేల కోట్ల రూపాయలు అంచనా అయితే అందులో గత ఏడాదిలోనే నాలుగునెలల కాలంలోనే 1,500కోట్ల రూపాయలు ఇంజనీరింగ్ విభాగంలో పనులకు గత ప్రభుత్వం నిధులు కేటాయించడం పెద్ద దుమారాన్ని రేపింది. గత వైసిపి ప్రభుత్వంలోని టిటిడి ధర్మకర్తలమండలి ఆదేశాలతో ఇంజనీరింగ్ పనుల్లో అక్రమాలు జరిగాయని, అవినీతిమయమైందని ఆరోపణలపై గతంలోనే 58మంది ఇంజనీరింగ్ అధికారులతో బాటు ఇద్దరు మాజీ ఛైర్మన్‌లు మాజీ ఇఒలు విశ్రాంత సిఎస్ డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి, మాజీ విశ్రాంత ఇఒ ఏవి ధర్మారెడ్డిలతో బాటు టిటిడి ఎఫ్ఎసిఎఒ బాలాజీలకు ప్రభుత్వ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నోటీసులు కూడా జారీచేసిన విషయం విదితమే. ఈ నోటీసులపై ఇంజనీరింగ్ అధికారులు తలలుపట్టుకుని ధర్మకర్తలమండలి, ఉన్నతాధికారుల ఆదేశాలతోనే తామిలా చేయాల్సివచ్చిందని సమాధానాన్ని విజిలెన్స్ అధికారులకు విన్నవించుకున్నట్లు తెలిసింది. ఇదే అంశంపై గత ఏడాదిలోనే నోటీసులు అందుకున్న మాజీ ఛైర్మన్‌లు ,మాజీ విశ్రాంత ఇఒలు ,ఎఫ్ఎసిఎఒలు విజిలెన్స్ అధికారులకు తగిన సమాధానం లేకపోయిందనేది కొసమెరుపు. గత ఏడాది నవంబర్‌లోనే ఈ వ్యవహారం ఎక్కడకు దారితీస్తుందనేది టిటిడిలో సంచలనంగా మారింది. గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వంలోని టిటిడి ధర్మకర్తలమండలి ఛైర్మన్‌లుగా సుబ్బారెడ్డి నాలుగుసంవత్సరాలు, ఛైర్మన్‌గా ఆఖరు ఏడాదిలో భూమన కరుణాకర్‌రెడ్డి వ్యవహరించారు. వీరి పాలనలో టిటిడి ఇఒలుగా విశ్రాంత మాజీ సిఎస్ జవహర్‌రెడ్డి, ధర్మారెడ్డిలు బాధ్యతలు నిర్వర్తించారు. వీరిరువురూ టిటిడిలో సర్వంతామై చక్రం తిప్పారని, దర్శన టిక్కెట్ల నుండి చివరకు ఇంజనీరింగ్ పనులకు భారీ మొత్తంలో నిధులు కేటాయించడం, శ్రీవాణి ట్రస్ట్ పేరుతో విరాళాల రూపంలో నిధులు సేకరణ తదితర వాటిపై తిరుపతికి చెందిన బిజెపి నేత,టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, బిజెపినేత నవీన్‌కుమార్‌రెడ్డి, జనసేననేత కిరణ్‌రాయల్ ప్రభుత్వానికి ఆధారాలతో ఫిర్యాదు కూడా చేశారు. దీంతో కూటమి ప్రభుత్వం గతంలో టిటిడిలో జరిగిన అక్రమాలు, అవకతవకలపై ప్రభుత్వ విజిలెన్స్‌ను ఆదేశించడం, దాదాపు 20మందివరకు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు గత ఏడాది తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలో సోదాలు చేశారు. ఇంజనీరింగ్ విభాగం, ఆర్జితసేవా టిక్కెట్ల కార్యాలయం, సిఇ కార్యాలయం ,రోడ్లనిర్మాణానికి సంబంధించి కార్యాలయాల్లో కంప్యూటర్లు తనిఖీ చేశారు. రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అయితే వీటన్నిటిపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదికల చర్యలు ఏంటనేది అంతా గప్‌చుప్‌గానే మిగిలిందని టిటిడి ఉద్యోగులు గుసగుసలు.

# టిటిడిలో అన్యమత ఉద్యోగులపై బదలీవేటు

### ఛైర్మన్ తొలి హామీపై ఉత్తర్వులు జారీ , 18 మందిని విధులకు దూరంపెట్టిన పాలకమండలి

**తిరుమల,ఫిబ్రవరి 5ప్రభాతవార్తప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో హిందూయేతర ఉద్యోగుల బదిలీ,స్వచ్ఛంద పదవీవిరమణ చేయించి ఇంటికి సాగనంపుతామని టిటిడి పాలకమండలి ఛైర్మన్‌గా బిఆర్ నాయుడు ప్రమాణస్వీకారానికి ముందే చెప్పిన హామీని తాజాగా ఇప్పుడు అమలుచేయించారు. దేవుని పవిత్రతను దెబ్బతీస్తున్న కొందరు ఉద్యోగులను గుర్తించిన టిటిడి పాలకమండలి దీనికి సంబంధించి 2024 నవంబర్ 18వతేదీ బోర్డులో తీర్మానం చేశారు. ఆ మేరకు ఇప్పుడు టిటిడిలోని పలు కీలక విభాగాల్లో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 18మంది అన్యమత ఉద్యోగులను ఎట్టకేలకు బదిలీచేస్తూ టిటిడి ఇఒ జె.శ్యామలరావు ఉత్తర్వులు జారీచేశారు. అంతేగాక హిందూమతేతర కార్యక్రమాల్లో పాల్గొంటూనే టిటిడి నిర్వహించే దేవుని ఉత్సవాల్లోనూ హాజరవుతున్న 18మంది ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశాలు వెలువడ్డాయి. వీరిలో డిప్యూటీ ఇఒ స్థాయి అధికారితోబాటు ఇద్దరు కళాశాలల ప్రిన్సిపాళ్ళు కూడా ఉండటం గమనార్హం.

# పద్మవిభూషణ్ గ్రహీత ఆగాఖాన్ కన్నుమూత పట్ల సిఎం రేవంత్‌రెడ్డి సంతాపం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఫిబ్రవరి5:** ప్రపంచ ఇస్మాయిలీ ముస్లింల ఆధ్యాత్మిక గురువు, పద్మవిభూషణ్ గ్రహీత ఆగాఖాన్ కన్ను మూశారు. ఆయన మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు. ఇస్మాయిలీ ముస్లింల వారసుడిగా ఆధ్యాత్మిక గురువుగా నియమితులైన కరీం అల్‌హుస్సేనీ ఆగా ఖాన్ IV గారి మరణం మానవాళికి తీరని లోటు అని ముఖ్యమంత్రి అన్నారు. గొప్పసామాజిక వేత్త, మానవతావాదిగా ఆయన ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును అందుకున్నారని అన్నారు. ఆగాఖాన్ నెట్ వర్క్ ద్వారా వివిధ దేశాల్లో ఆస్పత్రులు, విద్యా, సాంస్కృతిక సంస్థలను నెలకొల్పి మానవాళికి తన సేవలను అందించారని గుర్తు చేశారు. పేదరిక నిర్మూలన, వారసత్వ సంపద పరిరక్షణకు, వైద్య సేవలు, విద్యా రంగంలో ఆయన అందించిన సేవలు మరిచిపోలేనివని, హైదరాబాద్ కేంద్రంగా ఆగా ఖాన్ సంస్థలు నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఎంతో గొప్పవని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఆయన జీవితాంతం మానవ జాతి గౌరవం పెంచే ఉన్నత విలువలను ఆచరించారని కొనియాడారు. వారి వారసులకు, కుటుంబ సభ్యులకు, అనుచరులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**ఎంపి ఈటల రాజేందర్ సంతాపం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** ప్రపంచ ఇస్మాయిలీ ముస్లింల ఆధ్యాత్మిక గురువు, పద్మవిభూషణ్ గ్రహీత ఆగాఖాన్ మరణం పట్ల మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ సంతాపం వ్యక్తం చేశారు. ఇస్మాయిలీ ముస్లింల వారసుడు కరీం అల్హుస్సేనీ ఆగాఖాన్ మరణం తీరనిలోటని అన్నారు. ఆగాఖాన్ ఫౌండేషన్ ద్వారా వివిధ దేశాల్లో ఆస్పత్రులు, విద్యాసంస్థలను ఏర్పాటుచేసి ఎంతోమందికి సేవలను అందించారాన్నారు. ఈ సందర్భంగా ఆగాఖాన్ కుటుంతతతబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# కెసిఆర్‌ను కలిసిన బిఆర్‌ఎస్ నూతన విప్‌లు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఫిబ్రవరి5:** బిఆర్ఎస్ పార్టీ విప్‌లు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. శాసనసభ, శాసన మండలిలో బీఆర్ఎస్ పార్టీ విప్‌లుగా నియమితులైన కేపీ వివేకానందగౌడ్, సత్యవతి రాథోడ్‌లు బుధవారం ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌ను కలుసుకుని పార్టీ విప్‌లుగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారిని కేసీఆర్ సన్మానించారు. అసెంబ్లీ, మండలిలో అధికార పక్షం తప్పులను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని, అసెంబ్లీలో జరిగే చర్చల్లో పార్టీ సభ్యులు పాల్గొనేలా చూడాలని కొత్తగా నియమితులైన విప్‌లకు కేసీఆర్ సూచించారు.

# దానం ఇంట్లో ఫిరాయింపు ఎమ్మెల్యేల కీలక సమావేశం

### ఢిల్లీకి వెళ్లి అక్కడ సమాలోచనలు చేయాలని నిర్ణయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఫిబ్రవరి4:** కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంతో, పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు బుధవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇంట్లో భేటీ అయ్యారు. వీరిలో కడియం శ్రీహరి, అరికెపూడి గాంధీ, కాలే యాదయ్య, సంజయ్ కుమార్, ప్రకాశ్ గౌడ్, బండ్ల కృష్ణమోహన్, గూడెం మహిపాల్ రెడ్డి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, తెల్లం వెంకట్రావు ఉన్నారు. వీరితోపాటు ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి కూడా భేటీలో పాల్గొన్నారు. ఫిరాయింపుల వ్యవహారంలో ఎలా వ్యవహరించాలనే అంశంపై వీరు ప్రధానంగా చర్చిస్తున్నారు. అందరూ ఢిల్లీకి వెళ్లి అక్కడ సమాలోచనలు చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమి పాలయింది. దీంతో, 10 మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోకి వచ్చారు. ఈ ఫిరాయింపులపై తెలంగాణ హైకోర్టును బీఆర్ఎస్ పార్టీ ఆశ్రయించింది. హైకోర్టులో అనుకూలంగా తీర్పు రాకపోవడంతో సుప్రీం కోర్టుకు బీఆర్ఎస్ వెళ్లింది. బీఆర్ఎస్ పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించింది. ఈ క్రమంలోనే వీరందరికీ నోటీసులు జారీ అయ్యాయి. వాస్తవంగా సుప్రీంకోర్టులో కెటిఆర్ పిటీషన్ దాఖలు చేయక ముందు ముగ్గురు ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులపై పిటీషన్ దాఖలైంది. ఆ ముగ్గురికి సంబంధించి నోటీసులు జారీ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించినట్లు సమాచారం. ఈనెల 10 సుప్రీం కోర్టు పాత పిటీషన్‌తో పాటు కెటిఆర్ పిటీషన్‌ను కలిపి విచారణ జరుపనుంది.

# బిసిలకు కాంగ్రెస్‌తోనే అన్యాయం: గంగుల కమలాకర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఫిబ్రవరి5:** బీసీ జాతికి కాంగ్రెస్ తీరని అన్యాయం చేసిందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవాలను దాచిపెట్టి కావాలనే బీసీ జనాభాను తగ్గించేశారంటూ ఆరోపించారు. తెలంగాణ భవన్ లో మండలి విపక్ష నేత మధుసూదనచారితో కలసి బుధవారం మీడియా మాట్లాడారు. కాంగ్రెస్ మొదటి నుంచి బీసీల వ్యతిరేకి అని, అసెంబ్లీలో పెట్టిన కులగణన రిపోర్టు ఓ బోగస్ అని, కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పులతో బీసీ జాతికి అన్యాయం జరిగిందన్నారు. అసెంబ్లీలో రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి బీసీల లెక్కలపై మమ్మల్ని బుల్డోజ్ చేసే ప్రయత్నం చేశారని, బుల్డోజ్ చేస్తే భయపడటానికి మేము గొర్రెలమా అని మండిపడ్డారు. అలాగే పదేళ్లకు జనాభా పెరుగుదల 13శాతం ఉంటుందని, ఆ ప్రకారం 4 కోట్ల 25 లక్షల జనాభా ఉంటుందని, కానీ 3 కోట్ల 75 లక్షల జనాభాకు కులగణన పరిమితం చేసిందని చెప్పారు. దాదాపు 50లక్షల బీసీ జనాభాను మింగేశారని, ముస్లింలు కలపకుండానే బీసీల జనాభా 56శాతం పైనే ఉంటుందని, కానీ కేవలం 46శాతం చూపారని తెలిపారు. అన్ని కులాల శాతం పెరిగి, బీసీల జనాభా కావాలనే పది శాతం తగ్గించారని, పాలకులకు బీసీలంటే భయమని ఆరోపించారు. మిగతా కాంగ్రెస్ ప్రభుత్వాలు బీసీలను తొక్కేసినట్టే రేవంత్ సర్కారు కూడా తొక్కేస్తోందన్నారు. మళ్ళీ సర్వే చేస్తే బీసీల జనాభా 56శాతం వస్తుందని, రాష్ట్ర ప్రభుత్వానికి దమ్ముంటే కులాలవారీగా జనాభా ఎంతో బయట పెట్టాలని డిమాండ్ చేశారు. నిజంగా మీకు బీసీల మీద ప్రేమ ఉంటే, సర్వేలో బీసీలను 46శాతం నుంచి 56శాతానికి పెంచితే రేవంత్ రెడ్డి తామే శాలువా కప్పి సత్కరిస్తామని గంగుల చెప్పారు.

# రాహుల్‌గాంధీ కాదు..ఎన్నికల గాంధీ: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఫిబ్రవరి5:** కాంగ్రెస్ ప్రభుత్వంపై మరోసారి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీ తనపేరును ఎన్నికల గాంధీగా మార్చుకోవాలని కెటిఆర్ దుయ్యబట్టారు. కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ వంద శాతం అబద్ధమని మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం కెటిఆర్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. కాంగ్రెస్.. హామీలు, ప్రకటనలన్నీ రాజకీయ నాటకాలేనని రుజువైందన్నారు. బీసీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్‌కు స్పష్టత లేదని, సమర్పించిన డేటాపై ప్రభుత్వానికి అవగాహన లేదని తప్పుపట్టారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఇచ్చే ఉద్దేశం లేదని తెలుస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా యూటర్న్ తీసుకుందని, యూటర్న్ తీసుకుని కేంద్రంపై నెపం పెడుతున్నారని ఆరోపించారు.

# ఫిబ్రవరిలోనే భగ్గుమంటున్న భానుడు

### తెలంగాణలో 4 డిగ్రీలు పెరిగిన ఉష్ణోగ్రత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,ఫిబ్రవరి5:** గాలుల కారణంగా తెలంగాణలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే రాష్ట్రంలో క్రమంగా తేమ శాతం తగ్గుతుందని చెప్పింది. సాధారణం కంటే మూడు నుంచి నాలుగు డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవతున్నాయని పేర్కొంది. ప్రస్తుతం రాష్ట్రంలో 32 డిగ్రీల నుంచి 36 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. నాలుగైదు రోజుల పాటు ఇదే వాతావరణం కొనసాగనుంది. ఆ తర్వాత తగ్గుముఖం పట్టే అవకాశముందని తెలిపింది. హైదరాబాద్, నిజామాబాద్, హనుమకొండ, మెదక్ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయని పేర్కొంది. ఉత్తర, ఈశాన్య, వాయువ్య జిల్లాల్లో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని వివరించింది. ప్రధానంగా తూర్పు, ఆగ్నేయ దిశల నుంచి వేడిగాలులు వీస్తున్నాయని, ఆ ప్రభావం వల్లే ఎండ తీవ్రత పెరుగుతోందని వాతావరణ కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.


# కొండపై అన్యమత వాహన వివాదం

**తిరుమల,ఫిబ్రవరి 5ప్రభాత వార్తప్రతి నిధి:** తిరుమల కొండపై మరోసారి అన్యమతవాహనం వివాదాన్ని రేపింది. తిరుమలలో గోవిందుని నామం, గోవిందుని ఫోటోతప్ప మరెలాంటి నామం ఉచ్ఛరణ చేయకూడదని, అన్యమతస్థులు ఉండరాదని ఆదేశాలు. ఈ నేపథ్యంలో తిరుమలలో బుధవారం ఉదయం ఓ కారు ఏకంగా అన్యమతస్టిక్కర్ ఉండటం పెద్ద దుమారాన్ని రేపింది. కారుకు ఉన్న స్టిక్కర్‌తో అలిపిరి తనిఖీ కేంద్రంలో భద్రత సిబ్బంది పంపేయడం ఇప్పుడు సంచలనంగా మా రింది. సాధారణంగా అలిపిరి తనిఖీల్లో నిషేధత వస్తువులు ఉన్నా, అన్యమత ప్రతిమలు, పేర్లు, రాజకీయపార్టీల గుర్తులతో ఉన్న వాహనాలను అనుమతించరు అలాంటిది బుధవారం ఓ కారును ఎలా తిరుమలకు పంపారనేది ప్రశ్నా ర్థకం. ఈ కారు బుధవారం ఉదయం స్వేచ్ఛగా తిరుమలలో తిరుగుతుండటంతో భక్తులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమిళనాడు భక్తులు ఈ కారులో దర్శనానికి వచ్చినట్లు కనుగొన్నారు.



# నా కెరీర్‌లో బిగ్గెస్ట్ మూవీ 'తండేల్'

యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య, సాయి పల్లవి హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'తండేల్'. చందూ మొండేటి దర్శకత్వంలో మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై ఫ్యాషనేట్ ప్రొడ్యూసర్ బన్నీవాసు నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 7న ప్రపంచ వ్యాప్తంగా భారీగా విడుదల కానుంది. ఇప్పటికే రిలీజైన ప్రమోషన్స్ కంటెంట్ హ్యూజ్ బజ్‌ని క్రియేట్ చేసింది. ఈ సందర్భంగా హీరో అక్కినేని నాగచైతన్య విలేకరుల సమావేశంలో 'తండేల్' విశేషాలు పంచుకున్నారు.




**'తండేల్' సినిమాపై ఆడియన్స్ లో చాలా అంచనాలు వున్నాయి. మీలో ఎలాంటి ఎక్సయిట్మెంట్ వుంది?** నా కెరీర్‌లో బిగ్గెస్ట్ ప్రొడక్షన్, హై బడ్జెట్ మూవీ. క్యారెక్టర్, స్టోరీ అన్ని రకాలుగా బిగ్ స్పాన్ వున్న సినిమా ఇది. చాలా ఎక్సయిట్మెంట్ వుంది. ఆల్రెడీ సినిమా చూశాం. చాలా కాన్ఫిడెంట్‌గా వున్నాం. సెకండ్ హాఫ్ అయితే యునాని మాస్‌గా చాలా బాగా చెప్పారు. నాకు కూడా ఎమోషనల్ హై ఇచ్చింది. చివరి ముప్పై నిమిషాలు వెరీ సాటిస్ఫాక్షన్. క్లైమాక్స్ గ్రేట్ ఎమోషనల్ హై ఇస్తుంది. **'తండేల్' కథ ఎలా వచ్చింది?**
దూత సమయంలో ఈ కథ విన్నాను. వాసు గీత ఆర్ట్స్‌లో ఈ కథని హోల్డ్ చేశారని తెలిసింది. డెవలప్ చేసి మంచి సేఫ్ వస్తే చెప్పమన్నాను. నేను మొదట విన్నప్పుడు ఒక డాక్యుమెంటరీలా వుంది. సినిమాటిక్ లాంగ్వేజ్‌లోకి తీసుకు రావడానికి వర్క్ చేయాలి. అలా వర్క్ చేసిన తర్వాత అద్భుతంగా వచ్చింది.
**శ్రీకాకుళం వెళ్లి అక్కడి వారిని కలవడం ఎలా అనిపించింది?**
ఈ కథ మొదట ఓ ఐడియాగా చెప్పారు. పాత్రకు తగ్గట్టుగా మారాలంటే వాళ్ళ లైఫ్ స్టయిల్ తెలుసుకోవాలి. అలా తెలుసుకోవడానికి వాళ్ళని నేరుగా కలవాలని వెళ్లాం. మొత్తం హోం వర్క్ చేశాక నేను చేయగలనని కన్విన్స్ అయిన తర్వాత జర్నీ మొదలైయింది.
**మీరు ఈ సినిమాకి ప్రాణం పెట్టి వర్క్ చేశారని బన్నీ వాసు చెప్పారు. యాక్టర్ గా నెక్స్ట్ లెవల్ కి వెళ్తారని అంటున్నారు?**
ప్రతి సినిమాతో ఇంకా బెటర్ అవ్వాలని ప్రతి యాక్టర్‌కి వుంటుంది. అయితే ఈ కథ రియల్ లైఫ్ క్యారెక్టర్ దొరికింది కాబట్టి ఇంకా మోటివేట్ అయ్యాను. యాక్టర్‌గా నెక్స్ట్ స్టెప్ వెళ్ళే అవకాశం ఈ సినిమాలో కనిపించింది. దాదాపు ఎనిమిది నెలలు స్క్రిప్ట్, నా ట్రాన్స్ ఫర్మేషన్ మీదే వున్నాను. శ్రీకాకుళం యాస గురించి ట్యూషన్ తీసుకున్నాను. యాస రియల్లీ ఛాలెంజింగ్‌గా అనిపించింది.
**రాజు పాత్రని ఎంచుకోవడానికి కారణం?**
నాకు ఎప్పటి నుంచో రియల్ లైఫ్ స్టోరీస్ ఆధారంగా సినిమా చేయాలని వుండేది. పైగా ఇది మన తెలుగోళ్ళ కథ. ఇది నాకు స్ఫూర్తిని ఇచ్చింది. రూటెడ్‌గా వుండే కథలు చేయడానికి ఇష్టపడతాను.
**డైరెక్టర్ చందూ గురించి?**
చందుతో నాకు ఇది మూడో సినిమా. తనతో ట్రావెల్ అవ్వడం ఇష్టం. నన్ను కొత్తగా ప్రజెంట్ చేయడానికి ప్రయత్నిస్తాడు. నా కోసమే ఆలోచిస్తుంటాడు. ఈ సినిమా కమర్షియల్‌గా తీసుకు రావడానికి చాలా కష్టపడ్డాడు.

# డేల్' సాంగ్స్‌కి భారీ రెస్పాన్స్

యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య, సాయి పల్లవి హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'తండేల్'. చందూ మొండేటి దర్శకత్వంలో మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో గీతాఆర్ట్స్ బ్యానర్‌పై ఫ్యాషనేట్ ప్రొడ్యూసర్ బన్నీవాసు నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 7న ప్రపంచ వ్యాప్తంగా భారీగా విడుదలకానుంది. ఇప్పటికే రిలీజైన ప్రమోషన్స్ కంటెంట్ హ్యూజ్ బజ్‌ని క్రియేట్ చేసింది. రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ అందించిన పాటలు చార్ట్ బస్టర్ హిట్స్‌గా టాప్ ట్రెండింగ్‌లో వున్నాయి. ఈ సందర్భంగా దేవిశ్రీ ప్రసాద్ విలేకరుల సమావేశంలో 'తండేల్' విశేషాలు పంచుకున్నారు.
**'తండేల్' పాటలన్నీ చాలా పెద్ద హిట్స్ అయ్యాయి.. పాటలకి వస్తున్న రెస్పాన్స్ చూస్తే ఎలా అనిపిస్తోంది?** చాలా హ్యాపీ అండి. చాలా రోజుల తర్వాత వస్తున్న లవ్ స్టోరీ. బుజ్జితల్లి రిలీజైన వెంటనే ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. సుకుమార్ పాట విని నీ ఆల్ టైం టాప్ ఫైవ్ లో ఉంటుదని చెప్పారు. అలాగే శివుని పాట, హైలెస్సో పాటలు గొప్పగా జనాల్లోకి వెళ్ళాయి. ఆడియన్స్ సాంగ్స్‌ని చాలా ఎంజాయ్ చేస్తున్నారు.
**లవ్ స్టోరీ అనగానే మీపేరే వినిపిస్తుంటుంది? ఎలా అనిపిస్తుంది?**
బిగినింగ్ లో చేసిన నువ్వు వస్తావంటే నేనొద్దంటానా?, వర్షం, ఆర్య, 100% లవ్ లాంటి లవ్ స్టోరీస్ తో పాటు శంకర్ దాదా, మాస్ లాంటి కమర్షియల్ సినిమాలుకు కూడా అంతే అద్భుతమైన రెస్పాన్స్ ఆడియన్స్ నుంచి వచ్చింది. ఎలాంటి సినిమా అయినా చేయగలననే పేరు రావడం, అందులో లవ్ స్టోరీస్‌కి నేనైతే బావుంటనని అందరూ భావించడం గాడ్ బ్లెస్సింగ్‌గా భావిస్తాను. **సముద్రం బ్యాక్ డ్రాప్‌లో మీరు చేసిన ఉప్పెన పెద్ద హిట్. 'తండేల్'లో కూడా సముద్రం బ్యాక్ డ్రాప్ వుంది. కథ విషయంలో ఎలాంటి డిఫరెన్స్ వుంటుంది?** నాకు కంప్లీట్ రస్టిక్ ఫోక్ స్టోరీ వున్న సినిమా చేయాలనే వుండేది. ఆ కోరిక రంగస్థలంతో తీరింది. అందులో పాటలన్నీ జానపద మూలల్లో నుంచి చేసినట్లుగా వుంటుంది. మళ్లీ అలాంటి ఫోక్ టచ్ వున్న సినిమా ఉప్పెన. అయితే అందులో కంపోజిషన్ కాస్త సూఫీ స్టయిల్, క్లాస్ మిక్స్ చేసినట్లుగా వుంటుంది. కథలు పరంగా రెండిటికి పొంతనలేదు. 'తండేల్' కూడా అంతే. ఇది ప్యూర్ లవ్ స్టోరీ. పాకిస్తాన్ సరిహద్దులలో చిక్కుకున్న మన మత్స్యకారుల కథ. **ఈ సినిమాలో మిమ్మల్ని ఎట్రాక్ట్ చేసిన అంశాలు ఏమిటి?**
డైరెక్టర్ చందూ గ్రేట్ విజన్‌తో సినిమా తీశాడు. చాలా అద్భుతంగా ప్రజెంట్ చేశాడు. చైతు ఈ సినిమా కోసం చాలా హార్డ్ వర్క్ చేశారు. ఆయన ట్రాన్స్ఫర్మేషన్, పెర్ఫార్మెన్స్ చాలా సర్‌ప్రైజింగ్ గా వుంటుంది. ఎమోషన్స్ చాలా అద్భుతంగా పండించారు. కొత్త నాగచైతన్యని చూడబోతున్నారు. సాయి పల్లవి అద్భుతమైన నటి. ఇందులో కూడా సాయి పల్లవి పెర్ఫార్మెన్స్ ఎక్స్‌ట్రార్డినరీగా వుంటుంది. కళ్ళతో కూడా పెర్ఫార్మెన్స్ ఇచ్చారు, ఈ ఇద్దరి కెమిస్ట్రీ అదిరిపోయింది. సెకండ్ హాఫ్ లో వచ్చే ఓ సీక్వెన్స్ చాలా అద్భుతంగా వుంటుంది. అది బిగ్ స్క్రీన్‌పై చూడాల్సిందే.
**బుజ్జితల్లి పాట ఎలా పుట్టింది?**
కథ చెప్పినప్పుడే కొన్ని ట్యూన్స్ వచ్చేస్తాయి. బుజ్జితల్లి ట్యూన్ కూడా అలా వచ్చింది. హమ్ చేస్తూ పియానో ప్లే చేశాను. ఆ వీడియో చందూ షూట్ చేసి పోస్ట్ చేశాడు. అప్పుడు వచ్చిన ట్యూన్ అది. **మీది చాలా లాంగ్ కెరీర్ కదా.. ఈ జర్నీ ఎలా అనిపిస్తుంది?** ఇది బ్యూటీఫుల్ జర్నీ. చాలా యంగ్ ఏజ్‌లో కెరీర్ స్టార్ట్ చేశా. నేనే నా మ్యూజిక్ వింటూ పెరిగాను. (నవ్వుతూ). అన్ని జోనర్ సినిమాలు చేసే అవకాశం వచ్చింది. అన్ని ఏజ్ గ్రూప్స్‌కి నచ్చే మ్యూజిక్ ఇవ్వడం అదృష్టంగా భావిస్తున్నాను.




# జూనియర్ ఎన్టీఆర్ ప్రత్యేక ప్రకటన

తనపై అభిమానులు చూపిస్తున్న అపారమైన ప్రేమ, గౌరవానికి జూనియర్ ఎన్టీఆర్ హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. తనను కలుసుకోవాలని ఎదురు చూస్తున్న అభిమానుల ఆసక్తిని అర్థం చేసుకుని, త్వరలో ఒక సజావుగా ఏర్పాటు చేసిన సమావేశంలో వ్యక్తిగతంగా వారిని కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని అన్ని అనుమతులు పొందుతూ, పోలీస్ డిపార్ట్‌మెంట్ మరియు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని శాంతి భద్రతల సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇంత పెద్ద సమావేశం నిర్వహించటానికి కొంత సమయం అవసరం అవుతుంది కాబట్టి, అభిమానులు ఓర్పుగా ఉండాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో, అభిమానులు తనను కలుసుకోవడానికి పాదయాత్ర వంటివి చేయరాదని జూనియర్ ఎన్టీఆర్ విజ్ఞప్తి చేస్తున్నారు. తన అభిమానుల ఆనందమే కాదు, వారి సంక్షేమం కూడా తనకు అత్యంత ప్రధానం అని ఆయన మరోసారి స్పష్టం చేస్తున్నారు.



# కోర్టు నన్ను నిర్దోషిగా తేల్చింది..

నేనొక ఫిల్మ్ ఫైనాన్షియర్‌ని. సినిమా అంటే పాషన్‌తో నిర్మాతగా మారాను. సినిమా నాకు తల్లి లాంటిది. మహాబలిపురంలో ఉన్న నా 10 ఎకరాల స్థలాన్ని ఒకరికి తెలియకుండా మరొకరికి.. ఇలా పలువురు వ్యక్తులకు అమ్మానని నాపై కేసు పెట్టారు. 14 ఏళ్ల పాటు న్యాయ పోరాటం చేశాను. అది తప్పుడు కేసని తేలింది. న్యాయస్థానం నన్ను నిర్దోషిగా తేల్చింది. తప్పుడు కేసులు కోర్టు ముందు నిలబడవు. నా న్యాయ పోరాటం గెలిచింది అన్నారు నిర్మాత శింగనమల రమేష్ బాబు. 'కొమరంపులి', 'ఖలేజా' లాంటి బిగ్ స్టార్ చిత్రాలని నిర్మించిన ఆయన ఓ కేసు నిమిత్తం 14 ఏళ్ల పాటు న్యాయపోరాటం చేశారు. ఈ కేసును విచారించిన కోర్టు ఇటీవల ఆయన్ని నిర్దోషిగా తేల్చి, కేసు కొట్టి వేసింది. ఈ క్రమంలోనే ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.




**రమేష్ బాబు మీపై కేసు పెట్టిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనుకుంటున్నారు?**
నాకు ఎలాంటి కక్ష సాధింపులు లేవు. ఏదైనా న్యాయ పరంగానే పోరాటం చేస్తా. **భవిష్యత్‌లో సినిమాల్లో కొనసాగుతారా?** నేనొక ఫిల్మ్ ఫైనాన్షియర్‌ని. సినిమా అంటే పాషన్‌తో నిర్మాతగా మారాను. సినిమా నాకు తల్లి లాంటిది. భవిష్యత్తులోనూ ఇదే రంగంలో కొనసాగుతా. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారిద్దరూ హీరోలుగా చేశారు. హిట్ అందుకున్నారు. ఇప్పుడు డైరెక్షన్ రైటింగ్ చేయాలని అనుకుంటున్నారు. నేను కూడా నిర్మాతగా చేస్తా. ఫైనాన్షియర్‌గా చేస్తాను. **మీ మీద కేసు పెట్టింది ఎవరు? వాళ్లకు సినీ రంగంతో సంబంధం ఉందా?** నాపై కేసు పెట్టిన వాళ్లు ఇండస్ట్రీ చెందిన వారు కాదు.
**అగ్ర హీరోల చిత్రాలను నిర్మించి నష్టపోయారా?**
అప్పట్లో సినిమాలు ఆరు నెలలు, లేదా సంవత్సరంలోగా పూర్తయ్యేవి. కానీ నా దురదృష్టం కొద్దీ నేను తెరకెక్కించిన కొన్ని పెద్ద హీరోల చిత్రాలు దాదాపు మూడేళ్ల సమయం చిత్రీకరణలోనే గడిచిపోయింది. అందుకు చాలా కారణాలు ఉన్నాయి. ఆ రెండు చిత్రాలకు రూ.100 కోట్ల వరకూ నష్టపోయా. **అసలు మీపై పెట్టిన కేసు ఏమిటి?**
రూ.14 కోట్లు మోసం చేశానని నా మీద అభియోగం. మహాబలిపురంలో ఉన్న నా 10 ఎకరాల స్థలాన్ని ఒకరికి తెలియకుండా మరొకరికి.. ఇలా పలువురు వ్యక్తులకు అమ్మానని కేసు పెట్టారు. సుదీర్ఘంగా న్యాయ విచారణ జరిగింది. న్యాయస్థానం నన్ను నిర్దోషిగా తేల్చింది. ఇప్పటికీ ఆ ఆస్తులు నా పేరు మీదే ఉన్నాయి. **మీ స్టోరీనే సినిమా కథలా వుంది.. సినిమా చేసే అవకాశం ఉందా?** వెబ్ సిరీస్ చేస్తే వెయ్యి ఎపిసోడ్ పెట్టొచ్చు. అయితే నా కథ ఎవరు చూస్తారు(నవ్వుతూ) **ఫైనాన్స్ బిజినెస్ ఎంత లాభదాయకం ?** మేము సంపాదించింది ఫైనాన్స్ బిజినెస్ వలనే. నాన్న నుంచి అది నాకు వచ్చింది. ఐతే సినిమా మేకింగ్ అనేది ఎప్పటికీ ఓజూదమే. ఆ గ్యాంబ్లింగ్ వలనే నాకు రెండు సినిమాల్లో వంద కోట్లు పోయింది.




# 'డబ్ల్యూ/ఓ అనిర్వేష్' చిత్ర బృందానికి అభినందనలు

గజేంద్ర ప్రొడక్షన్స్ పతాకంపై మహేంద్ర గజేంద్ర సమర్పణలో గంగ సప్తశిఖర దర్శకత్వంలో వెంకటేశ్వర్లు మెరుగు, శ్రీ శ్యామ్ గజేంద్ర నిర్మాతలుగా జబర్దస్త్ రాంప్రసాద్, జెమినీ సురేష్, కిరీటి, సాయి ప్రసన్న, సాయి కిరణ్, నజియా ఖాన్, అద్వైత చౌదరి తదితరులు నటించిన డబ్ల్యూ/ఓ అనిర్వేష్ చిత్రం యొక్క కొన్ని సన్నివేశాలను చూసి దర్శకుడు గంగ సప్తశిఖరను ప్రశంసించారు హీరో అల్లరి నరేష్. కొత్త తరహా స్క్రీన్ ప్లేతో అలరించబోతున్న ఈ సినిమాకి స్క్రీన్ ప్లే అందించింది సీనియర్ రైటర్ బాబీ కె ఎస్ ఆర్. ఒక కొత్త రకమైన క్రైమ్ థ్రిల్లర్ స్టోరీని ఎంగేజింగా ప్రేక్షకులకు త్వరలో చూపించ బోతున్నటువంటి ఈ చిత్రం కచ్చితంగా విజయం చేకూర్చుతుందని అల్లరి నరేష్ అన్నారు. సంగీత దర్శకుడు షణ్ముఖ మ్యూజిక్ ఈ సినిమాకి ప్రాణం పోసిందని, వి ఆర్ కె నాయుడు కెమెరామెన్‌గా తన ప్రతిభను చూపించారని కొని ఆడారు చిత్ర దర్శకుడు గంగ సప్తశిఖర. ఈ చిత్రాన్ని ఎస్ కె ఎం ఎల్ మోషన్ పిక్చర్స్ ద్వారా ఆంధ్ర తెలంగాణలో త్వరలో రిలీజ్ చేయబోతున్నారు.




# 'ఒక పథకం ప్రకారం' హీరో ఇంటర్వ్యూ

స్టార్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ తమ్ముడు, టాలీవుడ్ హీరో సాయి రామ్ శంకర్ నటించిన కొత్త సినిమా ఒక పథకం ప్రకారం. మలయాళ డైరెక్టర్ వినోద్ కుమార్ విజయన్ దర్శకత్వం వహించారు. గార్లపాటి రమేష్, వినోద్ కుమార్ విజయన్ నిర్మించారు. ఫిబ్రవరి 7న రిలీజ్ కాబోతున్న ఈ మూవీలో శృతి సోది, ఆషిమా నర్వాల్, సముద్రఖని కీలక పాత్రలు పోషించారు. ఇందులో సాయి రామ్ శంకర్ మల్టిపుల్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించబోతున్నారు. సినిమా రిలీజ్ సందర్భంగా ఇచ్చిన తాజాగా ఇంటర్వ్యూలో పలు ఇంట్రెస్టింగ్ విషయాలు షేర్ చేసుకున్నారు సాయిరాం శంకర్. ఆ విశేషాలు తెలుసుకోండి.
**విలన్ ఎవరో ఇంటర్వెల్‌కు చెబితే రూ. 10,000 పట్టుకెళ్ళండి, పట్టుకుంటే 10 వేలు అంటున్నారు. అసలు ఈ ఐడియా ఎవరిది? రెస్పాన్స్ ఎలా ఉంది? దీనికి ముందు ఇంకేమైనా ఆలోచించారా?** రెస్పాన్స్ అయితే అద్భుతంగా ఉంది. సినిమా పేరు, రిలీజ్ అవుతుందన్న విషయం తెలియడానికి ఇది బాగా ఉపయోగపడింది. మొదటి నుంచి ఇదొక్కటే అనుకున్నాం. సినిమా చూశాక మా యూనిట్‌లో కీలక సభ్యులు పట్టుకుంటే పదివేలు అని చెప్పడంతో దీన్నే ఫిక్స్ అయ్యాము.
**ఒక పథకం ప్రకారం అంటున్నారు.. టైటిల్ జస్టిఫికేషన్ ఏంటి?**
ఒక పథకం ప్రకారం అంటే 80% క్రైమ్ జానర్ కథలకు వాడతాం. ఈ సినిమాలో ఉండే ప్రతి పాత్రకు ఎవరి ప్లానింగ్ వారికి ఉంటుంది. కాబట్టి ఒక పథకం ప్రకారం అనే టైటిల్ సెలెక్ట్ చేసుకున్నాం. **దర్శకుడికి ఇదివరకే ఇంటర్నేషనల్ అవార్డు వచ్చింది. ఆయన ఎక్స్‌పీరియన్స్ ఈ సినిమాకు ఎంత వరకు ఉపయోగపడుతుంది?**
ఆయన 17 ఏళ్లకే డైరెక్టర్ అయ్యారు. ఆయన నా ఫస్ట్ మూవీ తర్వాత నుంచి నా ఫ్రెండ్. మేం 2005 నుంచి చేద్దాం చేద్దాం అనుకున్నాం. అన్నిటి మీద అవగాహన ఉన్న మంచి టెక్నీషియన్. ఆయన దర్శకనిర్మాతగా ఫాహద్ ఫాజిల్‌తో రెండు సినిమాలు నిర్మించారు. తెలుగులో అలాగే దర్శక నిర్మాతగా సినిమాలు చేద్దామని చెప్పారు. మా ఇద్దరికీ ఉన్న కామన్ ఫ్రెండ్ వినీత్ ఉన్నారు. వీళ్లిద్దరూ కలిసి తెలుగులో చేద్దాం అనుకున్నపుడు నా పేరును అనుకున్నారు.
**సముద్రఖనితో వర్క్ చేశారు కదా. ఏం నేర్చుకున్నారు?**
ఆయన ఆల్రెడీ సక్సెస్ ఫుల్ క్యారెక్టర్ ఆర్టిస్ట్, నటుడు. డైరెక్టర్ కి ఏం కావాలో అదే చేస్తారాయన. **పూరి జగన్నాథ్ ట్రైలర్ చూశారా? ఆయన రియాక్షన్ ఏంటి?**
సాయి రామ్ శంకర్: అన్నయ్య ట్రైలర్ చూశారు. కొత్తగా ఉందని అన్నారు. అలాగే పట్టుకుంటే రూ. 10,000 గురించి కూడా చెప్పాను.
**ఈ సినిమాలో మీ పాత్ర ఏంటి?** సాయి రామ్ శంకర్: మూవీ 50 సెంటర్స్‌లో రిలీజ్ అవుతుంది. ఇందులో నా పాత్ర క్రిమినల్ లాయర్. నెమ్మదిగా నా క్యారెక్టర్‌లో ఒక్కో షేడ్ బయట పడుతుంది. క్రిమినలా లేకపోతే క్రిమినల్ లాయరా అనిపించేలా ఉంటుంది. అయితే ఈ సినిమాలో నా పాత్ర కోసం వన్ మంత్ ట్రైనింగ్, వర్క్ షాప్స్ కూడా చేశాను.
**సినిమాలో యాక్షన్‌కి స్కోప్ ఉందా?** ఆయన మలయాళ డైరెక్టర్ అయినప్పటికీ తెలుగు సినిమాలు, ఇక్కడి స్టైల్ బాగా ఇష్టం. మలయాళంలో ఓ పాయింట్ పట్టుకుని వెళ్ళిపోతారు. కానీ ఇక్కడ అలా కుదరదు, కష్టం అంటారు డైరెక్టర్ విజయన్. కాబట్టి తెలుగు ఆడియన్స్ తగ్గట్టుగా ఫైట్ సీన్స్‌ని, సాంగ్స్ ను డిజైన్ చేశారు. తమిళ ఫైట్ మాస్టర్ ఢిల్లీ బాబు ఫైట్స్ డిజైన్ చేశారు.
**సినిమా అంతా క్రైమ్ జానర్‌లో సాగుతుందా? లవ్ స్టోరీ కూడా ఉంటుందా?**
ఇది లవ్ స్టోరీ బెస్ట్ క్రైమ్ మూవీ.
**షూటింగ్ చేసేటప్పుడు ఏదైనా మర్చిపోలేని అనుభవం?** షూటింగ్ కోసం 25 డాగ్స్ తెచ్చాము. ఆ క్లైమాక్స్ సీక్వెన్స్ ఏకంగా 4 రోజులు చేశారు. ఆ టైంలో డాగ్ పైకి బయటకు రావడంతో, గ్రిల్ ఎక్కేశాను. లక్కీగా ఎస్కేప్ అయ్యాను. ఆ ఫైట్ చాలా బాగుంటుంది. ముందుగా ఒక క్లైమాక్స్ సీన్ తీసి, సరిపోట్లేదని మళ్లీ ఎక్స్టెండెడ్ వెర్షన్ తీశారు డైరెక్టర్. ఏడెనిమిది రోజులు క్లైమాక్స్ కోసమే షూటింగ్ చేశాం. **ఈ మూవీ తర్వాత సాయి రామ్ శంకర్ కంటిన్యూగా సినిమాలు చేస్తారా?** నాకు ఈ సినిమా మీద గట్టి నమ్మకం ఉంది.




# నూతన హీరో మారిశెట్టి అఖిల్ చిత్రం షూరు

హీరో కావాలన్న తన తనయుడు మారిశెట్టి అఖిల్ అభిరుచిని గమనించి, అతనిని హీరోగా పరిచయం చేసేందుకు పూనుకున్నారు అనకాపల్లి జిల్లాకు చెందిన ప్రముఖ రాజకీయవేత్త, మారిశెట్టి శ్రీకాంత్. మారిశెట్టి అఖిల్ హీరోగా, భానుశ్రీ హీరోయిన్‌గా శ్రీధన్ దర్శకత్వంలో ఎ.కె. టెక్ మార్కెటింగ్ మూవీ క్రియేషన్స్ పతాకంపై మారిశెట్టి శ్రీకాంత్. నిర్మించే నూతన చిత్రం చిత్రీకరణ అనకాపల్లి జిల్లా చోడవరం మండలంలోని నిర్మాత సొంత గ్రామమైన లక్ష్మీపురంలోని రామాలయంలో ప్రారంభమైంది. టైటిల్ నిర్ణయించాల్సిన ఈ చిత్రం ముహూర్తపు సన్నివేశానికి సీనియర్ నిర్మాత నట్టి కుమార్ క్లాప్‌నిచ్చిన అనంతరం మాట్లాడుతూ, సినిమా పరిశ్రమ ఆంధ్ర ప్రదేశ్‌కు తరలి రావాలని, షూటింగులు ఆంధ్ర ప్రదేశ్‌లో చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఏదైతే ఆకాంక్షించారో అందుకు అనుగుణంగా చిన్న సినిమా నిర్మాతలు ఆంధ్ర ప్రదేశ్ కు తరలివచ్చి, షూటింగులు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. అలా వచ్చిన నిర్మాతలకు సింగిల్ విండో సిస్టం లో పర్మిషన్‌లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదా?. తెలియజేయాలని కోరుతున్నాను. టూరిజం లోకేషన్స్‌ను మరింతగా అభివృద్ధి చేయాలి. పాడేరు, అరకు, విశాఖ వంటి తదితర లోకేషన్స్‌లో షూటింగ్‌లకు అనువైన లోకేషన్స్ ను గుర్తించి, వాటి అభివృద్ధితో పాటు నిర్మాతలకు అక్కడ షూటింగులు చేసుకునేందుకు సింగిల్ విండో సిస్టమ్ కింద త్వరితగతిన అనుమతులు ఇవ్వాలి. చిన్న సినిమాల మనుగడకు తగిన చర్యలను తీసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడుని, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ని, ఐటీ మంత్రి నారా లోకేష్‌ని, సినిమాటోగ్రఫీ మంత్రి దుర్గేష్‌ని కోరుతున్నాను. అనకాపల్లి రాజకీయాలలో మంచి పేరున్న మారిశెట్టి శ్రీకాంత్ తన కుమారుడి ఆసక్తిని గమనించి, సినిమా నిర్మాణానికి పూనుకోవడం అభినందనీయం' అని అన్నారు. నిర్మాత మారిశెట్టి శ్రీకాంత్ మాట్లాడుతూ, 'ఈ చిత్రం చిత్రీకరణ ఈ చుట్టు పక్కల ఐదు రోజులపాటు జరుగుతుంది. ఇందులో భాగంగా ఒక పాట, ఒక ఫైట్ చిత్రీకరణ జరుపుతాం. ఆ తర్వాత హైదరాబాద్, విశాఖపట్నం, అరకు తదితరప్రదేశాలలో షూటింగ్ చేస్తాం. హైదరాబాద్‌లో పెట్టబోయే ప్రెస్‌మీట్‌లో మిగిలిన అన్ని విషయాలను వెల్లడిస్తాం' అని చెప్పారు. హీరో మారిశెట్టి అఖిల్ మాట్లాడుతూ, మొదట్నుంచి నాకు సినిమా రంగమంటే ఎనలేని మక్కువ. హీరో కావాలన్న నా అభిరుచికి మా నాన్న మద్దతు పలికారు. దాంతో హైదరాబాద్‌లోని అన్నపూర్ణా ఫిలిం యాక్టింగ్ స్కూల్‌లో నటనలో శిక్షణ పొందాను.



# పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోకి హమాస్ ఎంట్రీ!



## అప్రమత్తం అయిన భారత్ నిఘా సంస్థలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:** ఇజ్రాయెల్ దాడుల్లో తీవ్రంగా దెబ్బతిన్న పాలస్తీనీ మిలిటెంట్ సంస్థ హమాస్ ఇపుడు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ప్రవేశిస్తోందన్న ప్రచారంపెరిగింది. దీనితో భారత నిఘావర్గాలు ఒక్కసారిగా అప్రమత్తం అయ్యాయి. కాశ్మీర్ సంఘీభావ దినం సందర్భంగా బుధవారం పిఒకేలో ఆల్ అక్సా ఫ్లడ్స్ పేరిట ఏర్పాటుచేసిన ఓ కార్యక్రమంలో హమాస్‌కు చెందిన సీనియర్‌నేత ప్రసంగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సభను రావల్కోట్‌లోని సబీర్ స్టేడియంలో ఏర్పాటుచేసారు. ఉగ్ర సంస్థలు లష్కరే తాయిబా, జైషేమహ్మద్, సీనియర్ నాయకులు ఈ సభలో పాల్గొంటారని ప్రచారంచేసారు. హమాస్ ప్రతినిధి ఖలీద్ కద్దౌమి ప్రసంగిస్తారని కరపత్రాలు ఇతర మార్గాల్లో ప్రచారం చేస్తున్నారు. ఆతడు కాశ్మీర్‌లోపోరాటాన్ని పాలస్తీనాతో ముడిపెట్టి మాట్లాడవచ్చని ఇంటెలిజెన్స్ వర్గాలు చెపుతున్నాయి. జీహాదీసంస్థలు తమ వాదనకు బలం చేకూరేలా వాదనలు సృష్టించేందుకు దీన్ని వాడుకోవచ్చన్న అంచనాలున్నాయి. మసూద్ అజర్‌సోదరుడు తల్హాసైఫ్, అస్గర్‌ఖాన్, ఇలియాస్ మసూద్ వంటి ఉగ్రవాదులు ఈ సభకు వస్తున్నట్లుప్రచారంచేస్తున్నారు. ఆ సమయంలో భారత హోంమంత్రి అమిత్‌షా జమ్ముకాశ్మీర్‌పై ఉన్నతస్థాయి సమావేశంనిర్వహించారు. అక్కడి భద్రతా పరిస్థితులు కౌంటర్ టెర్రరిజం ఆపరేషన్ల పరిస్థితిని ఆయన పరిశీలించారు. ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌నున బలోపేతంచేయడం, సీమాంతర చొరబాట్లను అడ్డుకోవడం వంటిఅంశాలపై దృష్టిపెట్టాలని అధికారులకు సూచించారు. కాశ్మీర్‌లో వాహన తనిఖీలనుకూడా తీవ్రతరం చేయాలని ఆదేశించారు. గత ఏడాది ఆగస్టులో హమాస్‌నేతలతో లష్కరే ఉగ్రవాది సైఫుల్లా ఖలీద్ భేటీ అయ్యాడు. ఖతార్ రాజధాని దోహా వేదికగా ఈ భేటీ జరిగింది. 2018లో సైఫుల్లాను అమెరికా ఉగ్రజాబితాలోచేర్చింది. లష్కరే వ్యవస్థాపకుడు హాఫీజ్‌సయీద్‌కు ఆతడు అత్యంత సన్నిహితుడని కూడా అమెరికా ప్రకటించింది.



# గాజాను పూర్తిగా స్వాధీనం చేసుకుంటాం

## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్

**వాషింగ్టన్, ఫిబ్రవరి 4:** ఇజ్రాయెల్ దాడులతో అతలాకుతలం అయిన గాజాను పూర్తిగా స్వాధీనం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ప్రకటించారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూతో భేటీ అనంతరం ఆయన ఈ ప్రకటన జారీచేసారు. ఇజ్రాయెల్ గాజా యుద్ధం నేపథ్యంలో తాజా పరిస్థితిపై నెతన్యాహుతో ట్రంప్ చర్చలుజరిపారు. గాజాను అమెరికా స్వాధీనం చేసుకుంటుంది. అక్కడ ధ్వంసమైన భవనాలను పునరుద్ధరిస్తాం. ఆ ప్రాంతాన్ని ఆర్థికంగా అభివృద్ధిచేస్తే అక్కడి ప్రజలకు అపరిమిత సంఖ్యలో ఉద్యోగాలు కల్పించవచ్చు. ఇళ్లు నిర్మించవచ్చని ట్రంప్ అన్నారు. ట్రంప్‌ప్రకటన చరిత్రను మారుస్తుందని నెతన్యాహూ అన్నారు. గాజాలో ఉద్రిక్తతల కారణంగా నిరాశ్రయులుగా మారిన పాలస్తీనీయులకు అరబ్‌దేశాలు ఆశ్రయం కల్పించాలని ట్రంప్‌ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. ఈప్రతిపాదనను ఆదేశాలు ఖండించాయి. అలాచేస్తే తమ ప్రాంత అస్థిత్వం, స్థిరత్వం దెబ్బతింటుందని ఈజిప్టు, జోర్డాన్, సౌదీ అరేబియా, యుఎఇ, ఖతార్, పాలస్తీనా అతారిటీ, అరబ్‌లీగ్‌లు సంయుక్తప్రకటన చేసాయి. ఈ క్రమంలోనే గాజాను స్వాధీనం చేసుకుని అభివృద్ధిచేస్తామని ట్రంప్‌ప్రకటించారు. అయితే ట్రంప్‌ప్రకటనపై హమాస్ తీవ్రంగా ఖండించింది.

ఆయన గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని మిలిటెంట్ సంస్థకు చెందిన ఒక సీనియర్ అధికారి అన్నారు. ఈ ప్రాంతంలో గందరగోళం ఉద్రిక్తతలు సృష్టించడానికే ట్రంప్ ఈప్రకటనచేసారు. మా ప్రజలు ఎంతమాత్రం ఆమోదించరని వారి భూమినుంచి వారిని తరలించడమే కాకుండా ఈ దురాక్రమణను అడ్డుకోవాల్సి ఉందని హమాస్ నేత సమీ అబు జుహ్రీప్రకటించారు.



## బావిలో పడిన భర్తను ప్రాణాలకు తెగించి కాపాడిన భార్య..

### కేరళలో చోటు చేసుకున్న ఘటన!

**తిరువనంతపురం, ఫిబ్రవరి 5:** భర్త తన కళ్ల ముందే ప్రమాదానికి గురైతే ఆ భార్య కన్నీళ్లు పెట్టుకుంటూ కూర్చోలేదు. ప్రాణాలకు తెగించి ఆ భర్తను కాపాడుకుంది. బావిలో పడిపోయిన అతడిని గట్టిగా ఒడిసిపట్టి పునర్జన్మ ప్రసాదించింది. కేరళలోని పిరవమ్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థాని మీడియా వివరాల ప్రకారం.. పిరవమ్ ప్రాంతంలో రమేశన్, పద్మ అనే దంపతులు నివసిస్తున్నారు. బుధవారం ఉదయం తమ నివాసంలోని మిరియాల చెట్టుపైకి ఎక్కి రమేశ్ (64) మిరియాలు తీస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టు విరగడంతో పక్కనే ఉన్న 40 అడుగుల లోతులో ఉన్న బావిలో పడిపోయాడు. వెంటనే స్పందించిన అతడి భార్య పద్మ (56) సమయస్ఫూర్తితో వ్యవహరించి తాడు సహాయంతో బావిలోకి దిగింది.

అయితే అప్పటికే స్పృహకోల్పోయే స్థితిలో ఉన్న భర్తను ఒడిసిపట్టుకుని దాదాపు 20 నిమిషాల పాటు అలాగే నీటిలో ఉంది. ఆమె కేకలు విని వచ్చిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సహాయక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. వల సహాయంతో వారిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించినట్లు వెల్లడించారు. తన భర్త ప్రాణాలను కాపాడు కోవడం కోసం పద్మ చూపిన తెగువను అధికారులు, స్థానికులు ప్రశంసించారు.

# బ్యాంకులకు మొత్తంచెల్లించాం, స్టేట్‌మెంట్లు ఇవ్వాలి



## కర్ణాటక హైకోర్టులో మాల్యా పిటిషన్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:** బ్యాంకులకు వేల కోట్ల రుణాలను చెల్లించకుండా దేశం వదిలిపారిపోయిన విజయ్‌మాల్యా కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. తానుతీసుకున్న రుణాలకు అనేకరెట్లు బ్యాంకులు తననుంచి వసూలుచేసాయని అందుకు సంబంధించిన అకౌంట్ స్టేట్‌మెంట్లను అందించాలని కోరుతూ పిటిషన్ దాఖలుచేసారు. తనతోపాటు ప్రస్తుతం లిక్విడేషన్‌లో ఉన్న యుబిహెచ్‌ఎల్ ఇతర సంస్థలనుంచి వసూలు చేసిన మొత్తాల వివరాలను అందించాలని కోరారు. తాజాగా న్యాయస్థానం ఈ పిటిషన్‌పై విచారణచేసింది. ఈ సందర్భంగా మాల్యాతరపు న్యాయవాది తన వాదనలు వినిపించారు. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ సుమారు రూ.6200 కోట్లరుణాన్ని తీసుకోగా ఇందుకు సంబంధించి 14 వేల కోట్లురికవరీచేసారని తెలిపారు. లోక్‌సభలో ఆర్థికమంత్రి స్వయంగా చెప్పారని మాల్యాకు చెందిన రూ.14,131 కోట్లవిలువైన ఆస్తులను బ్యాంకులు రికవరీచేసాయని ఆమె చెప్పారని ఆయన తీసుకున్న రుణంలో సుమారు రూ.10,200 కోట్లు చెల్లించినట్లు రికవరీ అధికారి కూడా తెలిపారు. పూర్తిరుణం చెల్లించినప్పటికీ ఇంకా రికవరీ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. మాల్యాకు సంబంధించిన రికవరీ చర్యలపై స్టే విధించాలని కోర్టును కోరుతున్నాను. దీనికి సంబంధించి అన్ని బ్యాంకుల అకౌంట్ స్టేట్‌మెంట్లను అందించాలని న్యాయవాది అభ్యర్థించారు. వాదనలు విన్న న్యాయస్థానం ఈ అంశంపై స్పందించాలంటూ ఎస్‌బిఐ, పంజాబ్‌నేషనల్‌బ్యాంకుసహా 10 బ్యాంకులకు ఆదేశాలు జారీచేసింది. ఈనెల 13వ తేదీలోగా స్పందన ఇవ్వాలని గడువు విధించింది. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ రుణాలపరంగామోసం చేసారనివిజయ్‌మాల్యా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దేశం విడిచి వెళ్లిపోయిన ఆయన మార్చి 2016 నుంచి బ్రిటన్‌లో నివసిస్తున్నారు. మాల్యాను భారత్‌కు రప్పించడానికి కేంద్రం ప్రయత్నిస్తున్న విషయం విదితమే. ఈ క్రమంలోనే ఆయన హైకోర్టును ఆశ్రయించగా బ్యాంకులకు ఆదేశాలు ఇచ్చింది.

# అరె చుప్..తేరేబాప్ మేరే సాథీహై

## మాజీ ప్రధాని కుమారుడు, ఎంపిపై ఖర్గే అసహనం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:** కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లిఖార్జున్‌ఖర్గే రాజ్యసభలోనోరుపారేసుకున్నారు. తన ప్రసంగానికి అడ్డుతగులుతున్న అధికారపక్ష సభ్యుడిని నోరుమూసుకుని కూర్చో అంటూ అసహనం వ్యక్తంచేసారు. రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో పాల్గొన్న ఖర్గే మాట్లాడుతుండగా భారత మాజీ ప్రధాని చంద్రశేఖర్ తనయుడు బిజెపి ఎంపి నీరజ్‌శేఖర్ అడ్డుతగలడంతో ఖర్గే ఆగ్రహం వ్యక్తంచేసారు. అమెరికా డాలర్‌తోరూపాయి మారకం విలువభారీగా పతనం అవుతోందని కేంద్ర ప్రభుత్వ విధానాలే ఇందుకు కారణమని ఖర్గే ఆరోపిస్తుండగా బిజెపి ఎంపి నీరజ్‌శేఖర్ అడ్డుతగిలారు. దాంతో సహనం కోల్పోయిన ఖర్గే 'తేరా బాప్‌కాభీ మెయిన్ ఐసా సాథీథా తూక్యాబాత్‌కర్తాహై? తుజ్‌కో లేకర్ గుమా చుప్‌చుప్ చుప్ బైట్ అంటూ అసహనం ప్రదర్శించారు. నేను నీ అయ్యకు సహచరుడిని ఏం మాట్లాడుతున్నావ్ నీ సంగతి చెప్పా నోర్ముయ్, నోరుమూసుకుని కూర్చో అంటూ చిరాకు ప్రదర్శించారు. ఖర్గే వ్యాఖ్యలు సభలో తీవ్ర దుమారంరేపాయి. దాంతో ఛైర్మన్ జగదీప్‌ధన్‌కడ్ కలుగచేసుకని అధికార ప్రతిపక్ష ఎంపిలను శాంతింపచేసారు. చంద్రశేఖర్ దేశంలోని గొప్ప నాయకుల్లో ఒకరు. ఆయనకున్న గౌరవం అమూల్యమైనదని ఆయన గురించి అగౌరవంగా మాట్లాడినందున ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోండి అని ఖర్గేను కోరారు. చంద్రశేఖర్ తాను కలిసి అరెస్టు అయ్యామని అందుకే ఆయన తన సమకాలికుడని చెప్పానని ఖర్గే బదులిచ్చారు. ఛైర్మన్ స్పందిస్తూ కానీ మీరు నీ అయ్య అనే పదం వాడారు. అలా మాట్లాడొచ్చా సాటి గౌరవ సభ్యుడితో మీరు నీ అయ్య అని వ్యాఖ్యానించారు. చంద్రశేఖర్‌గారిని మనం గౌరవించాలి. కాబట్టి మీ వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకోండి అని ఛైర్మన్ ధన్‌ఖడ్ మరోసారి ఖర్గేనుకోరారు. కానీ ఖర్గే అందుకు ఒప్పుకోలేదు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ గురించి బిజెపి సభ్యులు అమర్యాదగా మాట్లాడిన సందర్భాలను గుర్తుచేసారు. మన్మోహన్‌సింగ్ స్నానం చేసేటపుడు కూడా రెయిన్‌కోట్ వేసుకుంటారని ఒకరు కించపరిచారు. ఒకరు ఆయన మాట్లాడనే మాట్లాడడని హేళనచేసారు. కొందరు ఆయనకు ప్రభుత్వం నడపడం చేతకాదనికించపరిచారు. ఇంత అవమానించినా ఆయన సహించారు. అందుకు కూడా ఆయన్ను మౌనిబాబా అంటూ అగౌరవ పరిచారు. ఇలా సాటివ్యక్తులను అగౌరవపరిచే తత్వం వాళ్లదే. మేం అవమానాలను సహించేవాళ్లమని చంద్రశేఖర్‌ను అవమానించే ఉద్దేశ్యంతోనేను ఆ మాట అనలేదని ఛైర్మన్ ధన్‌ఖడ్‌కు ఖర్గే జవాబిచ్చారు.

# ఇస్మాయిలీ ముస్లింల ఆధ్యాత్మిక గురువు ఆగాఖాన్ కన్నుమూత!



ప్రణబ్ నుంచి పద్మవిభూషణ్ అందుకుంటున్న ఆగాఖాన్ (ఫైల్)

**లండన్, ఫిబ్రవరి 5:** అత్యంత సంపన్నుడు పద్మవిభూషణ్ గ్రహీత ప్రపంచ ఇస్మాయిలీ ముస్లిం అధ్యాత్మిక గురువు ఆగాఖాన్ 88వ ఏట కన్నుమూసారు. ఆగాఖాన్‌ఫౌండేషన్ అధికారికంగా ప్రకటించింది. ఆగాఖాన్ కుటుంబానికి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఇస్మాయిలీ కమ్యూనిటీకి సంతాపం తెలియజేస్తున్నామని, వ్యక్తులంతా మతపరమైన భేదాలు లేకుండా ఆయన కోరుకున్నట్లుగా ప్రజల జీవితాన్ని మెరుగుపరిచేందుకు భాగస్వాములతో కలిసి పనిచేస్తున్నట్లు ఆగాఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ ప్రకటన విడుదలచేసింది. ఆయన మరణవార్త కింగ్‌ఛార్లెస్3కి మనస్తాపం కలిగించింది. ఆయనకు కింగ్ ఛార్లెస్-3, ఆయన తల్లి దివంగత క్వీన్ ఎలిజెబెత్-2కు మంచి సంబంధాలున్నాయి. ఆగాఖాన్ స్విట్జరాండ్‌లో జన్మించారు. 20 ఏళ్ల వయసు 1957లోనే ఇస్మాయిలీ ముస్లింల 49వ వంశపారంపర్య ఇమామ్‌గా నియమితులయ్యారు. వారసత్వంగా వస్తున్న గుర్రాల పెంపకంతోపాటు ఇతర వ్యాపారాల్లోను రాణించారు.

యునైటెడ్‌కింగ్‌డమ్, ఫ్రాన్స్, ఐర్లాండ్ వంటి దేశాల్లో ప్రముఖంగా నిర్వహించే రేసు గుర్రాల్లోను ఆయన పాల్గొంటుండేవారు. 1967లో ఆగాఖన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ స్థాపించారు. ప్రపంచంలోనే వందలాది ఆసుపత్రులు, విద్యా సాంస్కృతిక సంస్థలను అభివృద్ధిచేసింది. ఆయన సేవలకుగాను 2015లో కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషణ్‌తో సత్కరించింది.



## హైదరాబాద్-తిరుపతి విమానంలో సాంకేతిక లోపం

### విమానం రద్దు, ప్రయాణికుల ఆందోళన

**శంషాబాద్. ఫిబ్రవరి 5. ప్రభాతవార్త:** హైదరాబాద్ నుండి తిరుపతి వెళ్లాల్సిన విమాన సర్వీసు సాంకేతిక కారణల వల్ల రద్దు అయ్యింది. దీనితో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం తెల్లవారుజామున ఐదు గంటల 30 నిమిషాలకు బయల్దేరాల్సిన విమానంలో సాంకేతిక సమస్యలు ఏర్పడ్డాయి. దీంతో విమాన సర్వీసును రద్దు చేశారు. చివరి నిమిషంలో ప్రయాణికులకు సమాచారం అందించడం పట్ల వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు 4 గంటల పాటు ప్రయాణికులు ఎయిర్‌పోర్టులో పడిగాపులు పడ్డారు.

విమాన సర్వీసు టికెట్లతో పాటు తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకోవడానికి ముందుగానే ప్లాన్ చేసుకుని టికెట్లు బుక్ చేసుకున్నట్లు వారు తెలిపారు. చివరి నిమిషంలో విమానం రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం పట్ల ఎయిర్‌వేస్ తీరుపై తిరుమల వెళ్లే ప్రయాణికుల ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమల వెంకన్న దర్శన భాగ్యాన్ని దూరం చేయడం పట్ల వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

# సహజీనం జంటలు కూడా నమోదు చేసుకోవాల్సిందే

## ఉత్తరాఖండ్ యుసిసితో జంటల నిరుత్సాహం



**డెహ్రాడూన్, ఫిబ్రవరి 5:** ఉత్తరాఖండ్‌లోఉమ్మడి పౌరస్మృతి గతనెల 27నుంచి అమలులోకి వచ్చేసింది. ఈచట్టంతో అన్ని మతాల్లోని వ్యక్తులకు వివాహం, ఆస్తిహక్కులు తదితర అంశాల్లో ఒకే రకమైన నిబంధనలు అమలుచేస్తున్నారు. ఏ మంతంలోనూ బహుభార్యాత్వాన్నియుసిసి అనుమతించదు. వీటికితోడు యూసిసికింద సహజీవనంచేసే జంటలుసైతం రిజిస్టర్‌చేసుకోవాలి. ఎవరైనా పెళ్లిచేసుకోకుండా కలిసి ఉండే జంటలు దరఖాస్తుచేసుకుని తమ సహజీవనాన్ని నమోదు చేసుకోవాలి. అయితే సహజీవనాల నమోదుకు ఇప్పటివరకూ ఐదే ఐదు దరఖాస్తులురాగా కేవలం ఒక సహజీవనం మాత్రమే రిజిస్టరు అయింది.

ఈ సహజీవనం జంటల రిజిస్ట్రేషన్‌ను కొందరు వ్యతిరేకిస్తున్నారు. చట్టంపై ప్రజల్లో అవగాహన రావడానికి సమయం పడుతుందని సహజీవనాల నమోదుకు చాలామంది ఇష్టపడటం లేదన్న వాదనకూడా ఉంది. అయితే సహజీవనం నమోదుచేసుకోకపోతే యుసిసికింద జరిమానాతోపాటు ఆరునెలల జైలు శిక్షను ఎదుర్కోనాలి. సహజీవనాల నమోదును చాలామంది వ్యతిరేకించినప్పటికీ ఉత్తరాఖండ్‌లోని పుష్కరసింగ్ ధామి ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు. శ్రద్ధావాకర్ తరహా ఘటనలు పునరావృతం కావద్దంటే సహజీవనాల నమోదు తప్పనిసరి అన్న నిబంధనను అమలుకు తెచ్చింది.

# అమెరికా అక్రమ వలసదారులను నేరస్తులుగా పంపడమా?



## కాంగ్రెస్ నేత పవన్ ఖేరా!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి:** అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న భారతీయులను అమెరికా ప్రత్యేక విమానాల్లో భారత్‌కు తరలిస్తున్న విషయం తెలిసిందే. ఈ విషయంపై ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ స్పందిస్తూ భారతీయుల చేతికి సంకెళ్లు వేసి వారిని నేరస్తులుగా పంపడం అవమానకరమని పేర్కొంది. ఓ భారతీయుడిగా అలాంటి దృశ్యాలు చూడలేకపోతున్నానని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా ఆవేదన వ్యక్తం చేశారు. 2013లో భారత దౌత్యవేత్త దేవయాని ఖోబ్రగాడేకు అమెరికాలో ఎదురైన అవమానాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు.

2013లో న్యూయార్క్‌లో దౌత్య కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ఓ వీసా వ్యవహారంలో ఆమెను అక్కడి పోలీసులు అరెస్ట్ చేసి అవమానించిన విషయం తనకు జ్ఞాపకానికి వస్తోందని అన్నారు. ఆ విధంగా ప్రవర్తినందుకు అదే సమయంలో దేశంలో పర్యటించిన అమెరికా కాంగ్రెస్ ప్రతినిధి బృందాన్నికలవడానికి అప్పటి యుపిఎ ప్రభుత్వ నేతలు నిరాకరించారని అన్నారు. యుఎస్ ఎంబసీకి ఇచ్చిన అనేక ప్రోత్సాహకాలను భారత్ ఉపసంహరించుకుందని పేర్కొన్నారు. కాగా అమెరికా నుంచి అక్రమ భారతీయ వలసదారులను తీసుకువస్తున్న ఈ విమానం మొదటిది కాదని కాంగ్రెస్ ఎంపి శశి థరూర్ అన్నారు. వాస్తవాలు బయటకు రాకుండా బిజెపి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు. జో బైడెన్ అధికారంలో ఉన్న సమయంలో కూడా 1100 మంది భారత అక్రమ వలసదారులను అమెరికా నుంచి బహిష్కరించారని కానీ వారి వివరాలు వెల్లడించలేదని పేర్కొన్నారు. 2022 నాటికి యుఎస్‌లో 725,000 మంది భారతీయ అక్రమ వలసదారులు ఉన్నట్లు పలు నివేదికలు వెల్లడించాయని చెప్పారు. అక్రమ వలసదారులపై మొదటి నుంచి కఠినంగా వ్యవహరిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్కడ అక్రమంగా ఉంటున్న విదేశీ వలసదారులను స్వదేశాలకు పంపుతున్నారు.

# యాచనచేస్తూ అత్త రెక్కీ రాత్రివేళల్లో అల్లుడు దొంగతనాలు!

**పాట్నా, ఫిబ్రవరి 5:** యాచకవృత్తిలో ఉన్న ఒక బిచ్చగత్తె ఇంటిపై పోలీసులు దాడిచేసి అక్కడ లభించిన వస్తువులను చూసి అవాక్కయ్యారు. ఖరీదైన సెల్‌ఫోన్లు, బైక్, విదేశీ నాణేలు ఇతర విలువైనవస్తువులు లభించాయి. అడుక్కునే నెపంతో ఆమహిళ రెక్కీనిర్వహించగా ఆమె అల్లుడు చోరీలకు పాల్పడుతున్నట్లుపోలీసులు గుర్తించారు. ఆ బిచ్చగత్తెను అరెస్ట్‌చేసారు. పరారీలో ఉన్న ఆమె అల్లుడికోసం వెతుకుతున్నారు.

బీహార్‌లోని ముజఫర్‌పూర్‌లో ఈ సంఘటన జరిగింది. నీలందేవి అనే మహిళ పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి అడుక్కునేది. కొన్నిసార్లు దోమతెరలు అమ్మేది. ఆప్రాంతాల్లో పలు చోరీలు జరగడంపై పోలీసులకు ఫిర్యాదులు అందాయి. దీనితో దర్యాప్తుచేపట్టి సిసిటివి ఫుటేజ్‌లను పరిశీలించారు. బిచ్చగత్తె నీలందేవిని అన ుమానించి ఆమె ఇంటిపై దాడిచేసారు. విలువైన బైక్, ఖరీదయిన 12 మొబైల్‌ఫోన్లు, నేపాల్ ఆఫ్ఘనిస్తాన్, కువైట్ వంటి పలుదేశాలకు చెందిన వెండి నాణేలు, బ్రిటిష్‌కాలంనాటి నాణేలు, బంగారు గొలుసు ఇతర విలువైన ఆభరణాలు ఆ మహిళ ఇంట్లో లభించాయి.

నీలందేవిని విచారించగా బిచ్చం ఎత్తుకునే నెపంతో రెక్కీ నిర్వహించి తాళాలు వేసి ఉన్న ఇతర ఇళ్లను ఆమె గుర్తించేదని తెలుసుకున్నారు. ఆమె అల్లుడు చతుక్‌లాల్ తన అనుచరులతో కలిసి ఆయ ఇళ్లల్లో చోరీలకు పాల్పడినట్లు పోలీస్ అధికారి తెలిపారు. బిచ్చగత్తె నీలందేవిని అరెస్టుచేసినట్లు చెప్పారు. పరారీలో ఉన్న ఆమె అల్లుడికోసం గాలిస్తున్నా మన్నారు. ఆతడి అరెస్ట్ తర్వాత మిగతా నిందితులు కూడా అదుపులోకి వస్తారని ఆయన అన్నారు.

## సౌతాఫ్రికా టి20 లీగ్‌లో..
# ఫైనల్లోకి ముంబయి ఇండియన్స్



**న్యూఢిల్లీ:** ముంబై ఇండియన్స్ ఫ్యామిలీకి చెందిన ఎంఐ కేప్‌టౌన్ తొలి సారిసౌతాఫ్రికా టీ20 లీగ్‌లో ఫైనల్‌కు చేరింది. తొలి క్వాలిఫయర్లో ఎంఐ కేప్‌టౌన్ పార్ల్ రాయల్స్‌పై 39 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఎంఐ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 199 పరుగులు చేసింది. ప్రస్తుత సీజన్‌లో ఎంఐకు ఇది మూడో అత్యధిక స్కోర్. ముంబై ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు ర్యాన్ రికెల్టన్ (27 బంతుల్లో 44; 4 ఫోర్లు, 2 సిక్సర్లు), వాన్ డర్ డస్సెన్ (32 బంతుల్లో 40; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) సహా డెవాల్డ్ బ్రెవిస్ (30 బంతుల్లో 44 నాటౌట్; 4సిక్సర్లు), జార్జ్ లిండే (14 బంతుల్లో 26; 3 సిక్సర్లు), డెలానో పోట్‌గెటర్ (17 బంతుల్లో 32 నాటౌట్; 4 ఫోర్లు, సిక్స్) రాణించారు. రాయల్స్ బౌలర్లలో దునిత్ వెల్లలగే 2, ఫోర్టుయిన్, డేవిడ్ గేలియమ్ తలో వికెట్ పడగొట్టారు. 200 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన రాయల్స్, ఎంఐ బౌలర్లు కలిసికట్టుగా సత్తా చాటడంతో 19.4 ఓవర్లలో 160 పరుగులకే ఆలౌటైంది. ట్రెంట్ బౌల్ట్, కగిసో రబాడ, కార్బిన్ బాష్, కెప్టెన్ రషీద్ ఖాన్ తలో 2 వికెట్లు పడగొట్టగా, జార్జ్ లిండే ఓ వికెట్ దక్కించుకున్నాడు. రాయల్స్ ఇన్నింగ్స్‌లో డేవిడ్ మిల్లర్ (45) టాప్ స్కోరర్గా నిలువగా, దినేశ్ కార్తీక్ (31) ఓ మోస్తరు స్కోర్ చేశాడు. ఇక లక్ష్య ఛేదనలో రాయల్స్ ఏ దశలోనూ విజయం దిశగా సాగలేదు. ఈ మ్యాచ్‌లో 2 వికెట్లు తీసిన రషీద్ ఖాన్ టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా అవతరించాడు. ఈ మ్యాచ్ ఓడినా ఫైనలుకు చేరేందుకు రాయల్స్‌కు మరో అవకాశం ఉంటుంది. ఈ నెల 6న జరుగబోయే క్వాలిఫయర్-2లో రాయల్స్, ఎలిమినేటర్ మ్యాచ్‌లో విజేతతో తలపడుతుంది.

# పతకాల పంట.. స్విమ్మర్లు ధినిధి, శ్రీహరి ఖాతాలో చెరో 9 పసిడి పతకాలు

**న్యూఢిల్లీ:** జాతీయ క్రీడల్లో కర్ణాటక స్విమ్మర్లు ధినిధి డెసింగు, శ్రీహరి నటరాజ్ పతకాల పంట పండించారు. ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న 38వ జాతీయ క్రీడల స్విమ్మింగ్ ఈవెంట్లో ఈ ఇద్దరూ చెరో 9 పసిడి పతకాలు ఖాతాలో వేసుకున్నారు. పారిస్ ఒలింపిక్స్లో దేశానికి ప్రాతినిధ్యం వహించిన 14 ఏళ్ల ధినిధి మహిళల 100 మీటర్ల ఫ్రీస్టయిల్లో జాతీయ రికార్డు తిరగరాస్తూ స్వర్ణం చేజిక్కించుకోవడంతో పాటు, 400 మీటర్ల ఫ్రీస్టయిల్, మిక్స్‌డ్ 4వ400 ఫ్రీస్టయిల్, 200 మీటర్ల ఫ్రీస్టయిల్, 100 మీటర్ల బటర్‌ఫ్లయ్, 4వ100 మీటర్ల ఫ్రీస్టయిల్ రిలే, 50 మీటర్ల ఫ్రీస్టయిల్, 4వ200 మీటర్ల ఫ్రీస్టయిల్ రిలే, మిక్స్‌డ్ 4వ100 మీటర్ల మెడ్లేలో పసిడిపతకాలతో మెరిసింది. దీంతో పాటు 50 మీటర్ల బటర్‌ఫ్లయ్‌లో రజతం, 4వ100 మీటర్ల రిలే మెడ్లేలో కాంస్యంతో మొత్తం 11 పతకాలు ఖాతాలో వేసుకుంది. పురుషుల విభాగంలో శ్రీహరి మొత్తం 10 పతకాలు (9 స్వర్ణాలు, 1 రజతం) సాధించాడు. ఈ జాతీయ క్రీడల్లో స్విమ్మింగ్ పోటీలు ముగియగా ఓవరాల్‌గా పట్టికలో కర్ణాటక 37 పతకాలతో (22 స్వర్ణాలు, 10 రజతాలు, 5 కాంస్యాలు)తో అగ్రస్థానంలో ఉంది.



## ముంబయి ఓపెన్ టెన్నిస్:
# హైదరాబాద్ అమ్మాయి రష్మిక సంచలనం

**న్యూఢిల్లీ:** ముంబై ఓపెన్ డబ్ల్యూటీఏ-125 టెన్నిస్ టోర్నమెంట్లో భారత మూడో ర్యాంకర్, హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక సంచలనంతో శుభారంభం చేసింది. ముంబైలో జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 325వ ర్యాంకర్ రష్మిక 6-1, 6-0తో ప్రపంచ 182వ ర్యాంకర్, రష్యాకు చెందిన ఎలీనా ప్రిడాన్కినాపై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. 64 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో రష్మిక కేవలం ఒక్క గేమ్ మాత్రమే కోల్పోవడం విశేషం. రెండు ఏస్లు సంధించిన రష్మిక మూడు డబుల్ ఫాల్టులు చేసింది. తన సర్వీసును ఒక్కసారి చేజార్చుకున్న రష్మిక ప్రత్యర్థి సర్వీసును ఏడు సార్లు బ్రేక్ చేసింది. ఓవరాల్‌గా మ్యాచ్ మొత్తంలో ప్రిడాన్కినా తన సర్వీసును ఒక్కసారి కూడా నిలబెట్టుకోక పోవడం గమనార్హం. ఇక భారత్‌కే చెందిన అంకిత రైనా, మాయ రేవతి రాజేశ్వరన్ కూడా తొలి రౌండ్లో నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రశించారు. 15 ఏళ్ల క్వాలిఫయర్ మాయ 6-4, 6-1తో బెలారస్‌కు చెందిన ఇరీనా షైమనోవిచ్‌పైన, అంకిత రైనా 6-2, 6-2తో భారత్‌కే చెందిన వైష్ణవి అడ్కర్‌పై విజయం సాధించారు.

## నేటి భారత్, ఇంగ్లండ్ మ్యాచ్‌కు..
# టీమిండియాలో 10మంది ఔట్
### జట్టులో భారీ మార్పులు
### ప్రక్షాళన చేసిన బిసిసిఐ

**న్యూఢిల్లీ;** ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు జరిగే సిరీస్ కోసం భారత జట్టులో భారీ మార్పులు చోటు చేసుకు న్నాయి. టీమిండియాను ప్రక్షాళన చేసే పనిలో భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) ఉంది. ఇందులో భాగంగా ఈ నెల 6వ తేదీ నుండి ప్రారంభం కానున్న ఇంగ్లండ్‌తో జరిగే వన్ డే టెస్టు మ్యాచ్‌లో భారత్ జట్టు నుండి 10 మంది ఆటగాళ్లను తొలగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. వారి స్థానంలో మరో 9 మంది ఆటగాళ్లకు అవకాశం కల్పించింది.



ఈ మార్పు ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపికైన భారత జట్టులో చేయలేదు. కేవలం ఇంగ్లాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌కు జట్టులో మాత్రమే ఈ మార్పులు చేసింది. నిజానికి, ఇంగ్లాండ్‌తో జరిగే 5 టీ20ల సిరీస్‌కు ఎంపికైన 15 మంది ఆటగాళ్లలో 10 మంది వన్డే సిరీస్‌లో భాగం కాలేదు. వారిని మినహాయించడం ద్వారా, మరో 9 మంది ఆటగాళ్లకు భారత వన్డే జట్టులో స్థానం లభించింది. టీ20 సిరీస్ ఆడిన, వన్డే సిరీస్ కోసం టీమిండియా నుంచి తొలగించబడిన 10 మంది ఆటగాళ్ళలో సంజు సామ్సన్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి, శివం దుబే, రమణ్‌దీప్ సింగ్, రింకు సింగ్, ధ్రువ్ జురెల్ పేర్లు చేరాయి. సూర్య, శాంసన్, అభిషేక్, బిష్ణోయ్, వరుణ్, తిలక్ టీ20 సిరీస్‌లోని 5 మ్యాచ్‌లలోనూ ఆడటం కనిపించింది. కాగా, రింకు సింగ్ మొదటి 3 మ్యాచ్‌లలో పాల్గొన్నాడు. జురైల్, దూబే తలో 2 మ్యాచ్‌లు ఆడగా, రమణ్‌దీప్ సింగ్‌కు ఏ మ్యాచ్ ఆడే అవకాశం రాలేదు.

ఇప్పుడు వన్డే సిరీస్ కోసం టీమిండియాలోకి ప్రవేశించిన ఆటగాళ్లలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, యశస్వి జైస్వాల్, రవీంద్ర జడేజా, రిషబ్ పంత్ ఉన్నారు. ఆ పేర్లలో కేఎల్ రాహుల్, శ్రేయాస్ అయ్యర్, కుల్దీప్ యాదవ్ ఉన్నారు. వీరిలో కుల్దీప్ యాదవ్ అక్టోబర్ 2024 తర్వాత, శ్రేయాస్ అయ్యర్ ఆగస్టు 2024 తర్వాత అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడటం కనిపిస్తుంది. కాగా ఈ నెల 6 నుంచి ఇంగ్లాండ్‌తో ప్రారంభం కానున్న వన్డే సిరీస్‌లో భాగంగా తొలి వన్డే నాగ్‌పూర్‌లో జరుగుతుంది. రెండవ వన్డే కోసం, భారత, ఇంగ్లాండ్ జట్లు ఫిబ్రవరి 9న మ్యాచ్ జరిగే కటక్‌కు వెళతాయి. వన్డే సిరీస్‌లోని మూడవ, చివరి మ్యాచ్ ఫిబ్రవరి 12న అహ్మదాబాద్‌లో జరుగుతుంది.



## జాతీయ బాస్కెట్‌బాల్ టోర్నీలో..
# తెలంగాణ ఖాతాలో తొలి స్వర్ణం
### ఆంధ్రప్రదేశ్‌కు మూడు కాంస్యాలు

**న్యూఢిల్లీ:** జాతీయ క్రీడల్లో తెలంగాణ ఖాతాలో తొలి స్వర్ణం చేరింది. మహిళల బాస్కెట్‌బాల్ 3వ3 ఈవెంట్లో తెలంగాణ జట్టు తొలి స్థానంలో నిలిచింది. ఫైనల్లో తెలంగాణ 21-11 పాయింట్ల తేడాతో కేరళపై విజయం సాధించింది. పసిడి పతకం సాధించిన మహిళల జట్టులో గులాబ్ షా అలీ, ఎస్.పుష్ప, కేబీ హర్షిత, పి.ప్రియాంక సభ్యులుగా ఉన్నారు. రెండేళ్ల క్రితం గోవా జాతీయ క్రీడల్లోనూ ఇదే ఈవెంట్లో విజేతగా నిలిచిన తెలంగాణ తమ స్వర్ణాన్ని నిలబెట్టుకుంది. మూడోస్థానం కోసం జరిగిన పోరులో 14-12 తేడాతో తమిళనాడును ఓడించి మధ్యప్రదేశ్ కాంస్యం సొంతం చేసుకుంది. అంతకుముందు సెమీస్‌లో తెలంగాణ 18-11తో తమిళనాడును, కేరళ 13-10తో మధ్యప్రదేశ్‌ను ఓడించాయి. మరో వైపు పురుషుల బాస్కెట్‌బాల్ 3-3 ఈవెంట్లో మధ్యప్రదేశ్, కేరళ, తమిళనాడు స్వర్ణ, రజత, కాంస్యాలు గెలుచుకున్నాయి. ఫైనల్లో మధ్యప్రదేశ్ 22-20 తేడాతో కేరళను ఓడించింది. కాంస్యం కోసం జరిగిన పోరులో తమిళనాడు చేతిలో 16-21తో ఓడిన తెలంగాణ నాలుగో స్థానంతో సరిపెట్టు కుంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌కు ఒక్క రోజులేనే మూడు కాంస్య పతకాలు లభించాయి. పురుషుల బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో క్రరి సాయిపవన్-షేక్ గౌస్ జోడీ, కనోయింగ్-కయాకింగ్ క్రీడాంశంలోని పురుషుల స్లాలోమ్-కే1 ఈవెంట్లో కొల్లకాని విష్ణు, మహిళల స్లాలోమ్-సీ1 ఈవెంట్లో దొడ్డి చేతన భగవతి కాంస్య పతకాలు సాధించారు. ఇక బ్యాడ్మింటన్ డబుల్స్ సెమీఫైనల్లో సాయిపవన్-షేక్ గౌస్ ద్వయం 13-21, 12-21తో నితిన్-ప్రకాశ్ రాజ్ (కర్ణాటక) జంట చేతిలో ఓడి కాంస్య పతకాన్ని ఖరారు చేసుకుంది. ఈ రోజు పోటీలు ముగిసిన తదుపరి ఆంధ్రప్రదేశ్ ఆరు పతకాలతో 21వ స్థానంలో, మూడు పతకాలతో తెలంగాణ 24వ స్థానంలో ఉన్నాయి.

## వాణిజ్యం

# పసిడి డిమాండ్ పైపైకి




**ముంబై, ఫిబ్రవరి 5:** దిగుమతి సుంకం తగ్గించడంతో దేశంలో బంగారానికి గిరాకీ పెరిగింది. దీనికి తోడు పెళ్లిళ్ల, పండగ సీజన్ కారణంగా 2024లో పసిడి డిమాండ్ 5శాతం పెరిగి 802.5 టన్నులకు చేరిందని ప్రపంచ స్వర్ణ మండలి వెల్లడిం చింది. ఈ యేడాదిలోనూ పుత్తడి గిరాకీ ఇదే స్థాయిలో ఉండొచ్చని అంచనా వేసింది. 2024 యేడాదికిగానూ ప్రపంచ వ్యాప్తంగా పసిడి వినియోగంపై ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజిసి) బుధవారం గణాంకాలు విడుదల చేసింది.

దాని ప్రకారం 2023లో బంగారం గిరాకీ 761 టన్నులుగా ఉండగా, గతేడాది ఆ మొత్తం 802.8 టన్నులకు పెరిగింది. 2025లో బంగారం గిరాకీ 700-800 టన్ను లు ఉండొచ్చని అంచనా వేస్తున్నాం. అయితే ఈ యేడాది ధరల్లో కొంత స్థిరత్వం వచ్చే అవకాశం ఉంది. దీంతో పెళ్లిళ్ల సీజన్‌లో బంగారు ఆభరణాల కొనుగోళ్ల పెరగొచ్చు. దిగు మతి సుంకాలు తగ్గించినప్ప టికీ, గత యేడా ది కాలంలో దేశీయ మార్కెట్లో పసిడి ధర విపరీతంగా పెరుగుతోంది. కొన్ని నగరా ల్లో పది గ్రాముల పుత్తడి ఏకంగా రూ.86 వేల పైన పలుకు తోంది. మరోవైపు గతేడాది బంగారంలో పెట్టుబడులు 29శాతం పెరిగి 239.4 టన్నులకు చేరినట్లు జైన్ తెలిపారు. 2013 తర్వాత పసిడి పెట్టుబడుల్లో ఇదే అత్యధికం కావడం విశేషం. ఇక గతేడాది రిజర్వ్ బ్యాంకు ఆఫ్ఇండియా ఏకంగా 73 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసినట్లు జైన్ వెల్లడించారు. 2023లో కొనుగోలు చేసిన 16 టన్నులతో పోలిస్తే ఇది ఏకంగా నాలుగు రెట్లు కావడం విశేషం. యుద్ధాలు, అధిక ద్రవ్యోల్బణం, ఇతర సవాళ్లను పరిగణనలోకి తీసుకొని రిస్కును తగ్గించుకునే ఉద్దేశంతో కేంద్ర బ్యాంకు బంగారం నిల్వలు పెంచుకునేందుకు ఆసక్తి చూపుతున్నట్లు నిపుణులు విశ్లేషిస్తు న్నారు.

# హోండా, నిస్సాన్ విలీనం లేనట్లే!

**ముంబై, ఫిబ్రవరి 5:** జపాన్‌కు చెందిన దిగ్గజ వాహన తయారీ సంస్థలు హోండా మోటార్, నిస్సాన్ మోటార్ విలీనం కోసం గత కొంతకాలంగా చర్చలు జరుగుతున్నాయి. అయితే ఈ విలీన ప్రక్రియ ముందుకు కొనసాగడం లేదని తెలుస్తోంది. హోండా కంపెనీతో విలీనం ప్రతిపాదనలను రద్దు చేసుకోవాలని నిస్సాన్ భావిస్తోందని సంబంధిత వ్యక్తులు తెలియచేసినట్లు కొన్ని కథనాలు వెలువడ్డాయి. త్వరలో ఈ అంశంపై భేటీ అయి నిస్సాన్ బోర్డు సభ్యులు నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పోటీని ఎదుర్కొనేందుకు జపాన్‌లోని రెండో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ హోండా, మూడో అతి పెద్ద సంస్థ నిస్సాన్ విలీన ప్రక్రియ కోసం చర్చలు జరుపుతున్నట్లు గతేడాది ప్రకటించాయి. చైనా వాహన తయారీ సంస్థ బివైడి, ఇతర ఎలక్ట్రిక్ వాహనాల సంస్థల నుంచి పోటీ ఎదుర్కొంటున్న తరుణంలో విలీనం కోసం సిద్ధమయ్యాయి. అయితే రెండు కంపెనీల మధ్య పెరుగుతున్న విభేదాల కారణంగా చర్చలు కష్టంగా మారాయని సంబంధిత వ్యక్తులు



పేర్కొన్నారు. నిస్సాన్‌కంటే దాదాపు ఐదురెట్లు ఎక్కువ మార్కెట్ విలువ కలిగిన హోండా, దాని పునరుద్ధరణ ప్రణాళికలో భాగంగా నిస్సాన్ పురోగతిపై ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. దాదాపు ఈ విలీనం రద్దు కావచ్చని జపాన్ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అయితే అంశంపై ఇతర సంస్థల ప్రతినిధులు స్పందించేందుకు నిరాకరించారు.

# ఎఐలో రూ.2వేల కోట్లు పెట్టుబడి: భవీశ్ అగర్వాల్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5:** ఓలా ఎలక్ట్రిక్ వ్యవస్థాపకుడు భవీశ్ అగర్వాల్ తన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ కృత్రిమ మేధలో క్రమంగా పెట్టుబడులు పెంచుకుంటున్నారు. తాజాగా ఈ స్టార్టప్‌లో రూ.2వేల కోట్లు పెట్టుబడి పెట్టారు. వచ్చే యేడాది నాటికి ఈ పెట్టుబడిని రూ.10వేల కోట్లకు పెంచాలని యోచిస్తున్నట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని అగర్వాల్ ఎక్స్ వేదికగా పంచుకున్నారు. కృత్రిమ మేధ సాంకేతికతను మెరుగు పరిచేందుకు కొత్త ఎఐ ల్యాబ్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. యేడాది నుంచి కృత్రిమ మేధ సాంకేతికతపై పనిచేస్తున్నట్లు అగర్వాల్ తెలిపారు. భారత్ కోసం ఎఐని అభివృద్ధి చేయడంపైనే తమ దృష్టి ఉందని పేర్కొన్నారు. దేశీయ భాషలు, డేటా కొరత వంటి వాటిపై ఎఐ పనితీరును మెరుగుపరిచేందుకు కృషి చేసినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే భారత్ మొట్టమొదటి లార్జ్ లాంగ్వేజ్ మోడల్ కృత్రిమ్-1ను లాంచ్ చేసింది. అది బేసిక్ 7బి మోడల్. తాజాగా కృత్రిమ్-2 పేరిట మెరుగైన మోడల్‌ను విజన్ లాంగ్వేజ్ మోడల్ చిత్రార్థ్-1, స్పీచ్ ప్రాసెసింగ్ కోసం ధ్వని-1ను ప్రవేశపెట్టనుంది. ఈ కృత్రిమి మోడళ్లు తెలుగుతో పాటూ, ఇంగ్లీష్, హిందీ, బెంగాలీ, తమిళం, మరాఠీ, గుజరాతీ, కన్నడ, మలయాళం, ఒడియా, అస్సామీ ఈ భాషలకు సపోర్ట్ చేస్తాయి. ఇప్పటి వరకు అమెరికా, చైనా సంస్థలు ఆవిష్కరించిన కృత్రిమమేధ మోడళ్లను ప్రపంచం వినియోగిస్తుండగా, మన దేశం నుంచీ సొంత ఎఐ మోడల్‌ను ఈ యేడాదిలో ఆవిష్కరించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు




కేంద్రం తాజాగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో భారత్‌లో మొట్టమొదటి జిబి200ఎఐ సూపర్ కంప్యూటర్‌ను ఎన్విడియా భాగస్వామ్యంలో తీసుకొచ్చేందుకు కృత్రిమ్ సిద్ధమవుతోంది. మార్చి నాటికి ఇది అందుబాటులోకి రానున్నట్లు ఓలా సిఇఒ తెలిపారు. క్లౌడ్ ఆధారిత ఎఐ సేవ కృత్రిమ్ క్లౌడ్‌ను కూడా కంపెనీ ప్రారంభించినట్లు ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. కృత్రిమ్ ఎఐని 2023లో ప్రారంభించారు. ఇప్పటికే వెంచర్‌కేపిటల్ ఫండ్ మ్యాట్రిక్స్ పార్టనర్స్ ఇండియా నేతృత్వంలోని ఇతర పెట్టుబడిదారుల నుంచి 50 మిలియన్ డాలర్లను సమకూర్చుకుంది. దీంతో 2024లో భారత్ మొదటి యూనికార్న్‌గా అవతరించింది. బిలియన్ డాలర్ల క్లబ్‌లో చేరిన మొదటి భారతీయ ఎఐ సంస్థగానూ నిలిచింది.

# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, ఫిబ్రవరి 5:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాల్లో ముగిసాయి. అమెరికా-చైనా మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధ భయాలు, అధిక వెయిటేజీ షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలను పడేశాయి. దీంతో పాటు రిజర్వ్‌బ్యాంకు ఆఫ్ ఇండియా మానిటరీ పాలసీ కమిటీ నిర్ణయాలు శుక్రవారం వెలువడ నున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత పాటిస్తుండడం సూచీలు నష్టాలకు కారణమయ్యాయి. నిఫ్టీ 23,700 దిగువన ముగిసింది. చివరికి సెన్సెక్స్ 312.53



పాయింట్లు నష్టపోయి 78,271.28 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 42.95 పాయింట్ల నష్టంతో 23,696.30 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో రూపాయి మారకం విలువ మరో 39 పైసలు క్షీణించి రూ.87.46 వద్ద ఆల్‌టైమ్ కనిష్టానికి చేరింది. ఏసియన్ పెయింట్స్, టైటాన్, నెస్లే ఇండియా, హిందుస్థాన్ యూనిలీవర్, ఎల్అండ్‌టి వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. అదానీ పోర్ట్స్, ఇండస్ ఇండ్ బ్యాంకు, టాటా మోటార్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, టాటా స్టీల్ వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.